ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 08.10.2025 | సంపుటి :12 సంచిక : 78 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI
JANAMSAKSHI TV



# నేడు హైకోర్టులో బీసీ రిజర్వేషన్‌పై విచారణ

## మన వాదన బలంగా ఉండాలి • మంత్రులతో సీఎం రేవంత్ భేటి

**పరిస్థితిని బట్టి వ్యూహం మార్చుకోవాలని న్యాయనిపుణులకు సూచన**

**సమావేశానికి హాజరైన మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, పొన్నం,వాకిటి శ్రీహరి, ప్రముఖ న్యాయ నిపుణులు అభిషేక్ మను సింఘ్వీ**



బీసీ రిజర్వేషన్ల అంశంపై తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాలోచనలు..హాజరైన డిప్యూటీ సీఎం భట్టి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, పొన్నం , వాకిటి శ్రీహరి, న్యాయనిపుణులు అభిషేక్ మను సింఘ్వీ

**హైదరాబాద్(జనంసాక్షి):** బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సామాజిక న్యాయం దిశగా చారిత్రాత్మక నిర్ణయంగా భావిస్తున్న ఈ వ్యవహారంలో ఏ మాత్రం నిర్లక్ష్యం జరగకుండా ఉండేందుకు సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా పర్యవేక్షి స్తున్నారు. బుధవారం హైకోర్టులో కేసు విచారణకు రానున్న సందర్భంగా మంత్రులు, న్యాయనిపుణ లుతో చర్చించారు. ఈ క్రమంలో మంగళవా రం సాయంత్రం హైదరాబాద్‌లోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశం సామాజిక సమతుల్యతకు సంబంధించిన కీలకమైన అంశమని ప్రభుత్వం భావిస్తోంది. కేసు పురోగతిని గంట గంటకు పర్యవేక్షిస్తూ, న్యాయపరంగా ఏ మార్పులు వచ్చినా తక్షణమే వ్యూహాన్ని సవరించుకునేలా ప్రత్యేక టీమ్‌ను సీఎం రేవంత్ ఏర్పాటు చేశారు. న్యాయ పోరాటంతో పాటు రాజకీయ, సామాజిక వర్గాల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు కూడా సమాంతరంగా కొనసాగుతున్నాయి. సుప్రీంకోర్టు నుంచి హైకోర్టు దాకా ప్రతి దశలోనూ బీసీల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం తన పూర్తి శక్తిని వినియోగిస్తోంది. సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా తెలంగాణ తరపున ప్రముఖ న్యాయ నిపుణులు అభిషేక్ సింఘ్వి, సిద్దార్థ దవే లు హాజరై వాదనలు వినిపించారు. ఈ విచారణకు ముందే సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన దిశానిర్దేశాలు ఇవ్వడంతో, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి లతో కూడిన బృందం ఢిల్లీ వెళ్లి న్యాయ నిపుణులతో విస్తృతంగా చర్చించింది. కేసు ప్రాధాన్యత దృష్ట్యా భట్టి విక్రమార్క, మంత్రుల బృందం స్వయంగా సుప్రీంకోర్టు విచారణను ప్రత్యక్షంగా పర్యవేక్షించింది.

మిగతా 2లో..



# గ్రూప్-1 నియామకాలపై స్టే ఇవ్వలేం

## హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చే తుది ఉత్తర్వులకు అనుగుణంగా నియామకాలు ఉండాలి • సుప్రీంకోర్టు స్పష్టీకరణ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** తెలంగాణ గ్రూప్-1 నియామకాలపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చే తుది ఉత్తర్వులకు అనుగుణంగా నియామకాలు ఉండాలని స్పష్టం చేసింది. గ్రూప్-1 నియామకాలపై ఇటీవల హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై పలువురు అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులకు అనుగుణంగా.. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందిచడంపై స్టే ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయమాల్య బాగ్చిల ధర్మాసనం విచారణ జరిపింది. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై డివిజన్ బెంచ్ మధ్యంతర ఆదేశాలు ఇవ్వడంపైనా అభ్యర్థుల తరపు న్యాయవాది అభ్యంతరం తెలిపారు. వాదనల అనంతరం.. స్టే ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరించింది. ఈ కేసుకు సంబంధించిన ప్రధాన పిటిషన్లన్నీ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో ఈనెల 15న విచారణకు రానున్న నేపథ్యంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఈలోగా చేపట్టిన నియామకాలన్నీ.. రిట్ అప్పీల్స్‌పై ఇచ్చే ఫలితానికి లోబడి ఉంటాయని, హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పాటించాలని సుప్రీంకోర్టు సూచించింది. అవకాశం ఉన్నంత త్వరగా పిటిషన్లపై విచారణ ముగించి తగిన ఆదేశాలు ఇవ్వాలని ధర్మాసనం సూచించింది. ఈ కేసుకు ప్రాధాన్యత ఇచ్చి విచారణ పూర్తి చేయాలని సూచిస్తూ.. సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లపై విచారణను ధర్మాసనం ముగించింది.

# నలుగురి పేర్లతో అధిష్టానానికి జాబితా

- నవీన్ యాదవ్ వైపే కాంగ్రెస్ మొగ్గు
- అధిష్టానానికి పేరు సిఫార్సు
- పోటీ నుంచి తప్పుకున్న బొంతు

**హైదరాబాద్(జనంసాక్షి):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్ కి లైన్ క్లియర్ అయినట్లు తెలుస్తోంది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై పార్టీ శ్రేణులతో మంగళవారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో నవీన్ యాదవ్ వైపు సీఎం రేవంత్ రెడ్డి మొగ్గు చూపినట్లు సమాచారం. ఈ నేపథ్యం లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి రేసులో నుంచి తప్పుకు న్నట్లు బొంతు రామ్మోహన్ ప్రకటించారు. జూబ్లీహిల్స్ అభ్యర్థిని కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయిస్తుందని బొంతు రామ్మోహన్ తెలిపారు.

మిగతా 2లో..






### పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై విచారణ

# పిటిషన్లపై విచారణ వాయిదా

**హైదరాబాద్(జనంసాక్షి):** కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను ఆధారంగా చేసుకొని చర్యలు తీసుకోవద్దని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి

మిగతా 2లో..



# భౌతిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

- జాన్ క్లార్క్, జాన్ ఎం మార్టిన్, మైఖేల్ హెచ్ డెవొరెట్‌లకు నోబెల్ పురస్కారం
- క్వాంటమ్ మెకానిక్స్ పరిశోధనలకు ఎంపిక

**స్టాక్‌హోమ్(జనంసాక్షి):** 2025 ఏడాదికిగాను నోబెల్ పురస్కారాల్లో భాగంగా భౌతిక శాస్త్రంలో చేసిన విశేష కృషికి ముగ్గురు శాస్త్రవేత్తలు ఈ పురస్కారాలకు ఎంపికయ్యారు.జాన్ క్లార్క్, జాన్ ఎం మార్టిన్, మైఖేల్ హెచ్ డెవొరెట్‌లకు నోబెల్ పురస్కారాలను ప్రకటించారు. క్వాంటమ్ మెకానిక్స్ పరిశోధనలకు గాను వీరు ఈ ప్రతిష్టాత్మక నోబెల్ పురస్కారాలకు ఎంపికయ్యారు."మ్యాక్రోస్కోపిక్ క్వాంటమ్ మెకానికల్ టన్నెలింగ్, విద్యుత్ సర్క్యూట్‌లో శక్తి పరిమాణీకరణ" అనే అంశంపై చేసిన విప్లవాత్మక ప్రయోగాలకు ఈ పురస్కారాలు లభించాయి. ఈ పరిశోధనల ద్వారా క్వాంటమ్ ఫిజిక్స్‌ను చేతిలో పట్టుకునేంత చిన్న చిప్‌లో చూపించగలిగారు. విద్యుత్

మిగతా 2లో..

# తెలంగాణలో 80% పత్తి కొనుగోళ్లు

- సీసీఐ ద్వారానే నేరుగా కొంటాం
- 122 కొనుగోలు సెంటర్ల ఏర్పాటు
- కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** తెలంగాణలో 80 శాతం పత్తిని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ స్పష్టం చేశారు. తెలంగాణలో 20 లక్షల మంది పత్తి రైతులు ,18 లక్షల హెక్టార్లలో పత్తి పంట పండిస్తున్నారని వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పత్తి రైతులకు సహకారం ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. పత్తి రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ఒక అప్లికేషన్ ప్రారంభించిదని... రైతులు అందులో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. మంగళవారం కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌తో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఢిల్లీలో సమావేశం అయ్యారు.

మిగతా 2లో..



# ఎన్డీఎస్‌ఏ నివేదిక ఆధారంగానే మేడిగడ్డకు మరమ్మతులు

## పెండింగ్ ప్రాజెక్టులకు అత్యధిక ప్రాధాన్యత • ఉన్నతాధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష

**హైదరాబాద్(జనంసాక్షి):** తుమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తుమ్మిడిహట్టి విషయంలో రెండు ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కాలువల విషయంలో ఈనెల 22 లోపు నిర్ణయం తీసుకుంటామన్నారు."మైలారం ద్వారా సుందిళ్లకు ఒక కాలువ ప్రతిపాదన, నేరుగా ఎల్లంపల్లికి నీటి తరలింపు ఇంకో ప్రతిపాదన ఉంది. వ్యయం, హైడ్రాలిక్, ఇంధనం, అన్నీ పరిశీలించి నిర్ణయం తీసుకుంటాం. రెండు ప్రతిపాదనలపై ఇంజినీర్లు 2 వారాల్లోపు నివేదిక ఇవ్వాలని కోరాం. 2027 డిసెంబర్ నాటికి ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తి చేయాలన్నది మా లక్ష్యం. వర్షాలు తగ్గిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. ఎన్డీఎస్ఏ నివేదిక ప్రకారమే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మరమ్మతులు చేపడతాం. డిజైన్లు రూపొందించేందుకు జాతీయ నైపుణ్య సంస్థల కోసం నోటిఫికేషన్ ఇచ్చాం. శాస్త్రీయ పద్ధతిలో పారదర్శకంగా మరమ్మతులు చేపడతాం. డిండి ఎత్తిపోతలపై అధికారులు 3 రోజుల్లోగా నివేదిక అందించాలి" అని ఉత్తమ్ అన్నారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో

మిగతా 2లో..



# ధాన్యం దిగుబడిలో తెలంగాణ రికార్డు

**148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి**

**80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

12లో..



# ట్రక్కులపై టారీఫ్‌లు

**మధ్యస్థ,భారీ వాహనాలపై 25శాతం వడ్డింపు**

- మరోసారి సుంకాల బాంబు పేల్చిన ట్రంప్
- ట్రంప్ ఇమిగ్రేషన్ పాలసీ..
- భారీగా తగ్గిన భారత విద్యార్థి వీసాలు

**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి టారిఫ్ బాంబ్ పేల్చారు. ఈసారి మధ్యస్థ, భారీ ట్రక్కులపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు.విదేశీ ట్రక్కులపై పెంచిన ఈ సుంకాలు వచ్చే నెల నుంచి అమల్లోకి రానుంది.నవంబర్ 1వ తేదీ నుంచి మధ్యస్థ, భారీ వాణిజ్య ట్రక్కులపై అమెరికా 25% సుంకాలు వసూలు చేయనుంది. అమెరికాలో వాహనాల ఉత్పత్తిని ప్రోత్సహించే చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ స్పష్టం చేశారు. అయితే.. అమెరికా-ఆధారిత భాగస్వామ్య దేశాలు, జాయింట్ వెంచర్లు ఈ టారిఫ్ నుంచి మినహాయింపు పొందే అవకాశం లేకపోలేదు. ఇక..చైనా, మెక్సికో, కెనడా వంటి దేశాలపై ఈ లేటెస్ట్ టారిఫ్ ప్రభావం ఉండే అవకాశం ఉంది. ఈ టారిఫ్‌పై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఒకవేళ విడి భాగాలు, ఉపకరణాలు దిగుమతులపై కూడా టారిఫ్‌లు ఉంటే, ఆటో మొబైల్ ఎక్స్‌పోర్ట్-ఆధారిత వ్యాపారాలపై ప్రభావం ఉండొచ్చు. భారత్ నుంచి అమెరికాకు ఈ తరహా ట్రక్కుల దిగుమతులు చాలా తక్కువగా ఉంటాయి. కాబట్టి అంతగా ప్రభావం పడకపోవచ్చు. అయితే.. ఇక్కడి కంపెనీలు అమెరికా మార్కెట్‌లో ప్రవేశించాలనుకుంటే మాత్రం టారిఫ్ చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది.

**భారీగా తగ్గిన భారత విద్యార్థి వీసాలు**

మాస్ డిపోర్టేషన్, అరెస్టులు, చట్టపరమైన ప్రవేశాలపై ఆంక్షలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి వలసదారులపై విరుచుకుపడుతున్నారు అమెరికా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోన్న వారిపై

మిగతా 2లో..

# పొన్నం క్షమాపణ చెప్పాలి

- మంత్రి అడ్లూరి డిమాండ్
- కాంగ్రెస్ అగ్రనేతలను కలిసి ఫిర్యాదు చేస్తానని వెల్లడి
- పరస్పర విమర్శలతో వేడెక్కిన రాజకీయం
- ఇరువురూ సమన్వయంతో కలసి ముందుకు వెళ్లాలి
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్



**హైదరాబాద్(జనంసాక్షి):** జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. మంత్రి పొన్నం వ్యాఖ్యలపై తాజాగా, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పందిస్తూ.. ఓ వీడియోను విడుదల చేశా రు. ఈ సందర్భంగా జరిగిన పొరపాటును ఒప్పు కొని క్షమాపణ చెబితే పొన్నంకు గౌరవంగా ఉంటుం దన్నారు. మాదిగలు అంటే మీకు అంత చిన్న చూపా, అని సీరియస్ అయ్యారు. అన్న మాటను సమర్థించుకుని ఇప్పటి వరకు

మిగతా 2లో..

# అడ్లూరి వ్యాఖ్యలపై నేను మాట్లాడను

- పార్టీలోనే చర్చిస్తాం: పొన్నం



**హైదరాబాద్(జనంసాక్షి):** మంత్రి అడ్లూరి వ్యా ఖ్యలపై తాను స్పందించనని మంత్రి పొన్నం పేర్కొన్నారు. అడ్లూరి లక్ష్మణ్‌తో విభేదాల నేపథ్యంలో ఆయన స్పందించారు. "పీసీసీ అధ్యక్షుడు నాతో మాట్లాడారు.. అదే ఫైనల్. రహ్మత్‌నగర్ భేటీలో ఏం జరిగిందో ఆయనకు వివ రించా. అడ్లూరి వ్యాఖ్యలపై నేను స్పందించను. పార్టీ పరంగా మాకు మహేశ్ గౌడ్ ఆదేశాలు శిరో ధా ర్యం" అని అన్నారు. పొన్నం మాదిరిగా అహం కా రంగా మాట్లాడటం తనకు రాదంటూ అడ్లూరి కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఆయన తన తప్పు తెలుసుకుంటారని అనుకున్నానని.. ఇప్పటికీ మారకపోతే తర్వాత జరిగే పరిణామాలకు ఆయన బాధ్యత వహించాల్సి ఉంటుందని అడ్లూరి వ్యాఖ్యానించారు.

# హిమాచల్‌ప్రదేశ్‌లో ఘోర ప్రమాదం

## టూరిస్టు బస్సుపై విరిగిపడిన కొండచరియలు.. 18 మంది మృతి.. శిథిలాల కింద 35 మంది!

**షిమ్లా(జనంసాక్షి):** హిమాచల్ ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్ జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఓ టూరిస్టు బస్సుపై కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో 18 మంది మృతి చెందారు. ప్రమాద సమయంలో బస్సులో 30-35మంది ఉన్నట్లు సమాచారం. శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని బయటకు తీసేందుకు ప్రయత్నాలు

మిగతా 9లో..



# పొన్నం క్షమాపణ చెప్పాలి

రియాక్ట్ కాకుండా ఉన్నావంటే ఈ విషయం నీ విజ్ఞతకే వదిలేస్తున్నాను అని మంత్రి అడ్లూరి పేర్కొన్నారు. సహచర మంత్రిని, ఎస్సీ సామాజిక వర్గం నేతను ఆ మాట అంటుంటే చూస్తూ ఉంటావా అని మంత్రి వివేక్ వెంకటస్వామిని మంత్రి లక్ష్మణ్ కుమార్ నిలదీశారు. ఇక, మంత్రి పొన్నం ప్రభాకర్– అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎపిసోడ్ పై పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ రంగ ప్రవేశం చేశారు. ఇద్దరు మంత్రులకు ఫోన్ చేసి ఇరువురు సంయమనం పాటించాలని చెప్పినట్లు సమాచారం. అడ్లూరినీ ఉద్దేశించి పొన్నం కామెంట్స్ చేశారని ప్రచారం.. అడ్లూరిని ఉద్దేశించి మాట్లాడలేదని పొన్నం వివరణ ఇచ్చారు. పొన్నం కామెంట్స్‌ని తప్పు పట్టిన మంత్రి శ్రీధర్ బాబు.. పార్టీకి, ప్రభుత్వానికి ఇది మంచిది కాదంటూ శ్రీధర్ బాబు హితవు పలికారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ మనస్పర్థలపై పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ స్పందించారు. ఈ మేరకు మీడియం సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు మహేష్ గౌడ్ ఫోన్ చేశారు. ఇద్దరు సమన్వయంతో కలిసి పని చేసుకోవాలని మహేష్ గౌడ్ సూచించారు. పొన్నం ప్రభాకర్ లాగా అహంకారంగా మాట్లాడటం తనకురాదని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. మంత్రి వివేక్ లాగా తన దగ్గర డబ్బులు లేవని స్పష్టం చేశారు. తాను మంత్రి కావడం, ఆ సామాజిక వర్గంలో పుట్టడం తన తప్పా.. అని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో సోనియా, రాహుల్, ఖర్గే, మీనాక్షిని కలుస్తానని వివరించారు. తాను కుర్చీలో కూర్చుంటే వివేక్ లేచి వెళ్లిపోతున్నారని చెప్పారు. తాను పక్కన ఉంటే వివేక్ ఓర్చుకోవడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం తాను ఆదిలాబాద్ పర్యటనలో ఉన్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు వచ్చిన వెంటనే కాంగ్రెస్ నేతలను కలుస్తానని అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు. తాను మాదిగ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని కాబట్టే మంత్రి పదవి వచ్చిందని అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. నేను మంత్రి కావడం.. మా సామాజికవర్గంలో పుట్టడం తప్పా? అని ప్రశ్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో విభేదాల నేపథ్యంలో ఆయన స్పందించారు. అయితే మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వ్యాఖ్యలపై తాను స్పందించనని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. అడ్లూరి లక్ష్మణ్‌తో విభేదాల నేపథ్యంలో ఆయన స్పందించారు. పీసీసీ అధ్యక్షుడు నాతో మాట్లాడారు.. అదే ఫైనల్. రహ్మత్‌నగర్ భేటీలో ఏం జరిగిందో ఆయనకు వివరించా. అడ్లూరి వ్యాఖ్యలపై నేను స్పందించను. పార్టీ పరంగా మాకు మహేశ్ గౌడ్ ఆదేశాలు శిరోధార్యం అని అన్నారు.

# భౌతిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

సర్క్యూట్‌లో క్వాంటమ్ టన్నెలింగ్, శక్తి స్థాయిల పరిమాణీకరణను స్పష్టంగా నిరూపించారు. ఇది క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ సెన్సార్లు, క్వాంటమ్ క్రిప్టోగ్రఫీ వంటి రంగాల్లో కొత్త అవకాశాలకు తెరలేపింది. ఈ ముగ్గురు శాస్త్రవేత్తల్లో జాన్ క్లార్క్, జాన్ ఎం మార్టిన్‌లు అమెరికాకు చెందిన శాస్త్రవేత్తలు కాగా, హెచ్ డెవొరెట్ ఫ్రాన్స్‌కు చెందిన శాస్త్రవేత్త.

క్వాంటమ్ మెకానిక్స్ ఆవశ్యకత..

గ్రహాలు, నక్షత్రాలు తదితరాలతో కూడిన విశాల విశ్వాన్ని సాధారణ భౌతికశాస్త్రంతో వివరించవచ్చు కానీ... ప్రోటాన్లు, న్యూట్రాన్లు, ఎలక్ట్రాన్లతో కూడిన అణు ప్రపంచాన్ని అర్థం చేసుకునేందుకు క్వాంటమ్ మెకానిక్స్ అవసరం అవుతుంది. ఎనర్జీ క్వాంటిజేషన్, టన్నెలింగ్‌లు అట్లాంటి అణుస్థాయి కార్యకలాపాలు. శక్తి ఒక ప్రవాహం మాదిరిగా కాకుండా స్థాయిల్లో ఉంటుందని ఎనర్జీ క్వాంటిజేషన్ చెబుతుంది. దీన్ని అర్థం చేసుకునేందుకు ఒక ఉదాహరణను పరిశీలిద్దాం. ఇంట్లోని బల్బు వెలుగును క్రమేపీ తగ్గించేందుకు డిమ్మర్‌ను ఉపయోగిస్తూం టారు కదా.. అచ్చం అలాగే శక్తిని కూడా నెమ్మదిగా హెచ్చుతగ్గులకు గురవుతుందన్నమాట. దీన్నే ఎనర్జీ క్వాంటిజేషన్ అంటారు. అయితే అణుస్థాయిలో ఇలా ఉండదు. శక్తి అనేది మెట్లు ఎక్కినట్లు దశలు, దశలుగా ఉంటుంది. ఈ ఏడాది నోబెల్ అవార్డు గ్రహీతలు ఈ ఎనర్జీ క్వాంటిజేషన్‌ను కూడా అరచేతిలో పట్టేంత, పూర్తిగా నియంత్రితమైన వ్యవస్థల్లోనూ చూపగలిగారు. క్వాంటమ్ స్థాయి ప్రవర్తన అన్నది అణుస్థాయికి మాత్రమే పరిమితం కాదని నిరూపించడం ఈ ఆవిష్కరణ విశేషం. ఈ ఆవిష్కరణ ఆధారంగా అత్యధిక వేగంతో పనిచేయగల క్వాంటమ్ కంప్యూటర్లకు కీలకమైన క్యూబిట్లను తయారు చేసే వీలేర్పడింది. గూగుల్, ఐబీఎంలు ప్రస్తుతం ఉపయోగిస్తున్న సూపర్ కండక్టింగ్ క్యూబిట్లు ఈ ఆవిష్కరణ ఆధారంగా తయారయ్యాయి. కంప్యూటింగ్ అంటే లెక్కలు వేసేందుకు ఈ క్యూబిట్లలో ఎనర్జీ క్వాంటిజేషన్, టన్నెలింగ్ వంటివి ఆధారమవుతాయి. అంతేకాదు.. ఈ ఆవిష్కరణ సాయంతో అత్యంత సున్నితమైన క్వాంటమ్ సెన్సర్ల తయారీ వీలవుతుంది. ఎమ్మారై, అల్ట్రాసౌండ్ వంటి వైద్య పరీక్షలు మరింత వివరంగా స్పష్టంగా చేసే వీలేర్పడుతుంది. తద్వారా వ్యాధులను చాలా తొందరగా గుర్తించవచ్చు. నావిగేషన్, జియలాజికల్ సర్వేల్లోనూ ఈ సెన్సర్లను ఉపయోగించవచ్చు. స్పేస్ టెలిస్కోపులు, గ్రావిటేషనల్ వేవ్ డిటెక్టర్లలో క్వాంటమ్ సెన్సర్ల వాడకం ద్వారా విశ్వం గురించి మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చు. హ్యాకింగ్ వంటి సమస్యల్లేకుండా అత్యంత సురక్షితంగా సమాచారాన్ని పంపేందుకు అవసరమైన క్వాంటమ్ క్రిప్టోగ్రఫీని అభివృద్ధి చేయవచ్చు. ఇదిలా ఉంచితే, నిన్న(సోమవారం, అక్టోబర్6) వైద్య శాస్త్రంలో నోబెల్ పురస్కారాలు ప్రకటించగా, ఈరోజు(మంగళవారం, అక్టోబర్(7) భౌతిక శాస్త్రంలో నోబెల్ పురస్కారాలును ప్రకటించారు. రేపు(బుధవారం, అక్టోబర్ 8) రసాయన శాస్త్రంలో నోబెల్ పురస్కారాలు ప్రకటించనున్నారు. ఆపై వరుసగా సాహిత్యం, శాంతి, ఆర్థికశాస్త్రాల్లో నోబెల్ పురస్కారాలను ప్రకటిస్తారు. డిసెంబర్ 10న, అల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి సందర్భంగా స్వీడన్‌లోని స్టాక్‌హోమ్, నార్వేలోని ఒస్లో నగరాల వేదికగా ఈ బహుమతులు అందజేస్తారు.

# నేడు హైకోర్టులో బీసీ రిజర్వేషన్‌పై విచారణ



ఈ క్రమంలో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింఘ్వి తో ఫోన్ లో మాట్లాడారు. బుధవారం హైకోర్టులో జరగనున్న బీసీ రిజర్వేషన్ల కేసు విచారణకు స్వయంగా హాజరై వాదనలు వినిపించాలని ఆయన కోరారు. ఈ విషయమై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఢిల్లీలో సింఘ్వీని కలసి ఇదే విషయమై విజ్ఞప్తి చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశం రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత సున్నితమైనదని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా న్యాయస్థానంలో బలమైన వాదనలు వినిపించాలని వారు కోరారు. హైకోర్టులో జరగనున్న విచారణకు ముందు, కేసు పురోగతిపై సమగ్ర సమీక్ష జరపాలని సీఎం నిర్ణయించారు.

# నలుగురి పేర్లతో అధిష్టానానికి జాబితా

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం తాను పనిచేస్తానని బొంతు రామ్మోహన్ ప్రకటించారు. మరోవైపు.. జూమ్ సమావేశంలో కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవ హారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ సెక్రటరీలు, టీపీ సీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై చేసిన సర్వే రిపోర్టులు , అభ్యర్థుల సామాజిక అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. అయితే, రెండు పేర్లతో ఏఐసీసీకి సిఫారసు చేయాలని నేతలు నిర్ణయం తీసుకున్నారు.

# రూ.300కోట్ల దాల్ ట్రేడ్ కేసు

## ఆంధ్రా, తెలంగాణ ఐటీ సోదాలు

**హైదరాబాద్(జనంసాక్షి): ఆంధ్రా, తెలంగాణలో** పలుచోట్ల ఐటీ సోదాలు జరుగుతున్నాయి. ఏపీ, తెలంగాణలోని 25 చోట్ల అధికారులు తనిఖీలు చేపట్టారు. రూ.300కోట్ల దాల్ ట్రేడ్ కేసులో హైదరాబాద్, గుంటూరు, విజయవాడ, కర్నూలు, విశాఖపట్నం ప్రాంతాల్లో సోదాలు కొనసాగుతున్నాయి. ఏపీలో గత ప్రభుత్వ హయాంలో పలు ట్రేడింగ్ కంపెనీలు భారీగా నగదు లావాదేవీలు జరిపినట్లు అధికారులు చెబుతున్నారు. 2024 ఎన్నికల సమయంలోనూ భారీగా నగదు విత్‌డ్రా చేసినట్లు ఐటీ శాఖ గుర్తించింది. పలు ట్రేడింగ్ కంపెనీలు పౌరసరఫరాల శాఖ నుంచి అనుమతులు పొంది పప్పు దినుసులు సరఫరా చేయకపోయినట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలోనూ విశాఖపట్నంలో హిందుస్థాన్ ట్రేడర్స్, కర్నూలుల వీకేర్ గ్రూప్‌లో సోదాలు జరిగాయి.

### తెలంగాణ నేతలతో సీఎం చంద్రబాబు సమావేశం.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై చర్చ

**అమరావతి(జనంసాక్షి):** ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో తెలంగాణ తెలుగుదేశం నేతలతో పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికలో అనుసరించాల్సిన విధానంపై చర్చించారు. కూటమి తరపున పోటీ చేసే అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని నేతలకు దిశా నిర్దేశం చేశారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపైనా చర్చించినట్లు సమాచారం

# తెలంగాణలో 80% పత్తి కొనుగోళ్లు

అనంతరం మీడియాతో గిరిరాజ్ సింగ్ మాట్లాడారు. గతంలో పత్తిని ఎంత సేకరించామో.. ఈ ఏడాది కూడా అలానే పత్తిని సేకరిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణలో పత్తి కొనుగోళ్ల కోసం గతేడాది 110 సెంటర్లు ఉన్నాయని.. ఇప్పుడు122 సెంటర్లు ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తనను కోరారని చెప్పుకొచ్చారు. గతంలో ఉపాధి హామీ పథకం నిధులు దుర్వినియోగం అయ్యాయని.. ఇప్పుడు కూడా దుర్వినియోగం అవుతున్నాయని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిం చడమే కాదని.. రాష్ట్ర రైతాంగానికి మద్దతుగా తెలంగాణ ప్రభుత్వం నిలవాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం తమ బాధ్యత నుంచి ఎందుకు తప్పుకుంటుందని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి ఎంత పత్తి ఉత్పత్తి అయితే అంత కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రైతులకు స్మార్ట్ ఫోన్స్ లేకుండానే నిధులు వెళ్తున్నాయా అని ప్రశ్నించారు గిరిరాజ్ సింగ్. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2013 నుంచి 2014 వరకు రూ.12, 500 కోట్ల పత్తి కొనుగోళ్లు చేస్తే.. ప్రస్తుతం రూ.73,000 కోట్ల పత్తి కొనుగోళ్లు జరిగాయని వెల్లడించారు. రూ. 65 వేల కోట్ల పత్తి కొనుగోళ్లు కేవలం తెలంగాణ నుంచే జరిగాయని వెల్లడించారు. ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అన్నదాతల ఆదాయం రెట్టింపు చేసేందుకు చర్యలు చేపట్టామని ఉద్ఘాటించారు. 2014లో క్వింటా పత్తి ధర రూ.3, 700లు ఉంటే.. ఇప్పుడు క్వింటా రూ.7,710ల ధర ఉందని నొక్కిచెప్పారు. మరో గ్రేడ్ రకం గతంలో క్వింటా రూ. 4 వేలు ఉంటే.. ప్రస్తుతం క్వింటా రూ. 8,110లుగా ఉందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులకు మద్దతుగా నిలవాలని సూచించారు. పత్తిలో తేమ శాతాన్ని తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం పంచాయతీ స్థాయిలో ఓ ప్లాట్ ఫామ్ ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పత్తి రైతులకు మద్దతుగా నిలవాలని కోరారు. రాష్ట్రప్రభుత్వం క్వాలిటీ సీడ్స్ ఇవ్వాలని గిరిరాజ్ సింగ్ సూచించారు.

# పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై విచారణ

కె. చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రి హరీశ్ రావు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను తెలంగాణ హైకోర్టు వచ్చే నెల 12వ తేదీకి వాయిదా వేసింది. ఈ సందర్భంగా హైకోర్టు ఇప్పటికే ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కమిషన్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు చేపట్టకూడదని కేసీఆర్, హరీశ్ తమ పిటిషన్లలో వాదించారు. ఆ నివేదికను పూర్తిగా రాజకీయ ఉద్దేశ్యాలతో రూపొందించారని, దాని ఆధారంగా చర్యలు తీసుకోవడం చట్టపరంగా సరైంది కాదని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టు తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కమిషన్ రిపోర్ట్ ఆధారంగా ఎటువంటి చర్యలు తీసుకోరాదని స్పష్టంగా ఆదేశించింది. కమిషన్ తరపున లాయర్ నిరంజన్ రెడ్డి ఈ విచారణ సందర్భంగా కౌంటర్ అఫిడవిట్ సమర్పించకపోవడంపై క్షమాపణలు కోరారు. కొన్ని వివరాలు సేకరించడంలో ఆలస్యం జరిగిందని, త్వరలోనే సమగ్రమైన కౌంటర్ సమర్పిస్తామని కోర్టుకు తెలిపారు. హైకోర్టు ఆయన వివరణను అంగీకరించి, తదుపరి విచారణ తేదీని నిర్ణయించింది. ఇక ఇదే కేసులో మాజీ ముఖ్య కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషి, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దాఖలు చేసిన పిటిషన్లపై కూడా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. కమిషన్ నివేదికలో తమ పేర్లు ప్రస్తావించబడిన నేపథ్యంలో ప్రభుత్వం తమపై చర్యలు తీసుకోకుండా ఉండాలని వారు కోర్టును ఆశ్రయించారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే పీసీ ఘోష్ కమిషన్ నివేదికను సీబీఐకి పంపిన విషయం తెలిసిందే. అయితే హైకోర్టు, ఆ నివేదిక ఆధారంగా నేరుగా చర్యలు చేపట్టకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. సీబీఐ తన స్వతంత్ర విచారణను చట్టపరమైన విధానాల ప్రకారం కొనసాగించవచ్చని పేర్కొంది. ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణ వచ్చే నెల 12న జరగనుంది. అప్పటి వరకు కమిషన్ నివేదిక ఆధారంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, మాజీ సీఎస్ జోషి, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌లపై ఎటువంటి చర్యలు తీసుకోరాదని హైకోర్టు స్పష్టం చేసింది.

# యుద్ధం ఎక్కడ మొదలైందో అక్కడే ముగుస్తోంది

కూడా నెతన్యాహు మాట్లాడారు. వాషింగ్టన్, న్యూయార్క్‌లను చేరుకునే ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను ఇరాన్ అభివృద్ధి చేస్తోం దని, అప్రమత్తంగా ఉండాలంటూ ట్రంప్‌ను హెచ్చరించారు. 'మామూలుగా ఒక దేశం తనకు తాను మొదట ప్రాధాన్యం ఇస్తుంది. అమెరికా ఫస్ట్ అంటే ఒక్క అమెరికానే ఉంటుందని కాదు.. గ్రేట్ పవర్స్‌కు మిత్ర దేశాలు కావాలి. ఇజ్రాయెల్ అనేది యుద్ధరంగంలో పోరాడుతోన్న ఒక మిత్ర దేశం' అని నెతన్యాహు అన్నారు. అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ మెరుపుదాడులకు పాల్పడింది. దీంతో ఇది యుద్ధానికి దారితీసింది. ఇప్పటివరకు టెల్‌అవీవ్ చేసిన ప్రతీకార దాడులకు గాజాలో వేల మంది ప్రాణాలు కోల్పోయారు. అనేక నగరాలు ధ్వంసం అయ్యాయి. గాజా యుద్ధం ముగింపునకు ఇటీవల కీలక ముందడుగు పడింది. ట్రంప్ 20 పాయింట్లతో ప్రణాళికను ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. దీనికి ఇరుపక్షాలు అంగీకరించాయి. దీనిపై ఈజిప్టులో చర్చలు జరుగుతున్నాయి.

# ఎన్డీఎస్ఏ నివేదిక ఆధారంగానే మేడిగడ్డకు మరమ్మతులు

ఉన్నతాధికారులతో విస్తృత సమీక్షా సమావేశం నిర్వహించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ ప్రణహితచెవెళ్ల సుజల శ్రవంతి ప్రాజెక్టు, శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కాలువ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్, అలాగే కాళేశ్వరం కింద మెడిగడ్డ, అన్నారం మరియు సుందిల్లా బ్యారేజీలు రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత జాబితాలో ఉన్నాయని తెలిపారు. ప్రణహిత%–%చెవెళ్ల ప్రాజెక్టులో తుమ్మడిహట్టి భాగాన్ని మొదటి అంశంగా తీసుకుంటూ, ఇంజనీరింగ్ బృందాలు రెండు ప్రత్యామ్నాయ కాలువ మార్గాలను పరిశీలిస్తున్నాయని, ఏ మార్గాన్ని ఎంచుకోవాలనే నిర్ణయం అక్టోబర్ 22 నాటికి తీసుకుంటామని అన్నారు. మైలారం నుండి 71.5 కిలోమీటర్ల గ్రావిటీ కాలువ మరియు 14 కిలోమీటర్ల సొరంగం ద్వారా సుందిల్లాకు నీరు తరలించబడుతుంది. మరో మార్గం ప్రకారం మధ్యలో పంపింగ్ స్టేషన్ ఏర్పాటు చేసి యెల్లంపల్లి ద్వారా నీటిని మళ్లించడం జరుగుతుంది. ఈ రెండు ప్రత్యామ్నాయాలు ఖర్చు, హైడ్రాలిక్ సామర్థ్యం, భౌగోళిక అనుకూలత మరియు విద్యుత్ అవసరాల సమీక్షించారు. శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కాలువ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ ప్రాజెక్టును డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. భూగర్భ ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తెలంగాణ నీటి పారుదల నిర్మాణంలో కీలక భాగమని, ఇది శ్రీశైలం జలాశయాన్ని కరవు ప్రాంతాలతో అనుసంధానిస్తూ 43 కిలోమీటర్ల పొడవైన టన్నెల్ ద్వారా వేల ఎకరాల వ్యవసాయ భూములకు కృష్ణా నదీ జలాలను అందించడానికి రూపొందించబడిందని చెప్పారు. సాంకేతిక మరియు పరిపాలనా అడ్డంకులను తొలగిస్తున్నామని, ప్రాజెక్టు పూర్తయ్యే వరకు ఉన్నత స్థాయి పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం కింద మెడిగడ్డ, అన్నారం మరియు సుందిల్లా బ్యారేజీల పునరుద్ధరణ ఎన్డీఎస్ఏ నివేదిక ప్రకారం జరుగుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే జాతీయ సంస్థలు మరియు నిపుణ సంస్థలను పునరుద్ధరణ పనుల్లో పాల్గొనమని కోరామని చెప్పారు. ప్రముఖ ఐఐటీ ప్రధాన సాంకేతిక భాగస్వామిగా వ్యవహరించే అవకాశం ఉందని, ఇది తెలంగాణ నీటి పారుదల శాఖకు చెందిన చీఫ్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీఓ) తో కలిసి పని చేస్తుందని వివరించారు. "ప్రధాన ఐఐటీ బృందం నిర్మాణ రూపకల్పన, పరీక్షలు మరియు పునరుద్ధరణ ప్రణాళికను చేపడుతుంది. వర్షాకాలానికి ముందు పరీక్షలు పూర్తయ్యాయి, వర్షాకాలం అనంతరం పూర్తి పునరుద్ధరణ రూపకల్పన ఒక సంవత్సరంలో పూర్తవుతుంది," అని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. పునరుద్ధరణ ప్రక్రియ ఎన్డీఎస్ఏ సిఫారసులకు కచ్చితంగా అనుగుణంగా ఉంటుందని, ఏదైనా వ్యత్యాసం లేదా ఆలస్యం జరిగితే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. వారానికి ఒకసారి పురోగతి సమీక్షలు నిర్వహించి సాంకేతిక ఫలితాలను పద్ధతిగా నమోదు చేయాలని ఆదేశించారు. "ఈ బ్యారేజీల భద్రత అత్యంత ప్రాధాన్యమైనది. ప్రతి దశలో జాతీయ స్థాయి సంస్థలు పాల్గొంటూ శాస్త్రీయ, పారదర్శక మరియు సవరణాత్మక విధానాన్ని అనుసరిస్తున్నాము," అని ఆయన తెలిపారు. న్యాయ పరమైన అంశాల పరంగా కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ ముందు జరుగుతున్న విచారణల పురోగతిని సమీక్షించారు. సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ తెలంగాణ వాదనలు ముగించారని, ఆంధ్రప్రదేశ్ తమ సమర్పణలను ప్రారంభించిందని తెలిపారు. ప్రతి సమావేశానికి సంబంధించిన సవివరమైన నివేదికలను సిద్ధం చేయాలని, ఢిల్లీలోని న్యాయ బృందంతో మరియు రాష్ట్ర సుప్రీంకోర్టు న్యాయవాదులతో సమన్వయం సాధించాలని, వాదనల్లో ఏకరూపత ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. సమ్మక్క%–%సరక్క ప్రాజెక్టు పురోగతిని కూడా సమీక్షించారు. ఈ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) ను సంప్రదించి నీటి కేటాయింపు మరియు టెక్నికల్ అడ్వైజరీ కమిటీ (టిఏసీ) ఆమోదం కోరిందని తెలిపారు. ఈ ప్రక్రియ చురుకుగా కొనసాగుతోందని అన్నారు. సీతమ్మసాగర్, మొడికుంటవాగు, చనక%–%కోరటా పంపిణీ వ్యవస్థలు మరియు చిన కాళేశ్వరం ప్రాజెక్టుల పెట్టుబడి ఆమోద దరఖాస్తులు ఢిల్లీలో సమర్పించబడ్డాయని, వాటి సమీక్ష ప్రధాన్ మంత్రి కృషి సించాయీ యోజన (పీఎంకేఎస్‌వై) పరిధిలో తుది దశకు చేరుకుందని తెలిపారు. "కేంద్ర ఆమోదాలు వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టులు గోదావరి మరియు కృష్ణా పరివాహక ప్రాంతాల్లో నీటి పారుదల సామర్థ్యాన్ని పెంచుతాయి," అని అన్నారు. దేవదుల ప్రాజెక్టు శాఖ ప్రధాన ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో ఒకటని అన్నారు. ప్యాకేజీ–6 మరియు అదనపు మూడవ దశ ప్యాకేజీలకు ఆమోదం లభించిందని తెలిపారు. భూ సేకరణ పరిహారంగా రూ.33 కోట్లు తక్షణమే విడుదల చేయాలని ఆదేశించి, అన్ని సవరించిన అంచనాలను (ఆర్‌ఈలు) ఈ నెలలోనే ఆమోదించాలని సూచించారు. దేవదుల ప్రాజెక్టు పూర్తిగా కార్య నిర్వాహక సామర్థ్యాన్ని ఈ ప్రభుత్వ కాలంలోనే చేరుకుంటుందని తెలిపారు. "దేవదుల ప్రాజెక్టు గణనీయమైన భౌతిక పురోగతి సాధించింది మరియు త్వరలోనే భూస్థాయి ఫలితాలను ఇస్తుంది," అని పేర్కొన్నారు. డిండి ప్రాజెక్టుపై సమగ్ర సమీక్షా నివేదిక సిద్ధం చేయాలని, ఇందులో భౌతిక పురోగతి, నిధుల వినియోగం మరియు పెండింగ్ పనులు ఉండాలని ఆదేశించారు. ఈ నివేదిక మూడు రోజులలో సమర్పించాల్సి ఉంటుంది. అనంతరం తదుపరి సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటారు. నీటి పారుదల రిజర్వాయర్ల మట్టిని తొలగించడం మరియు అవక్షేపాలను తొలగించడం పై ముసాయిదా విధానాన్ని సమీక్షించారు. ఈ ప్రతిపాదన అదనపు ప్రభుత్వ వ్యయం లేకుండా రిజర్వాయర్ల సామర్థ్యాన్ని మెరుగుపరచే స్వయం సమర్థ విధానాన్ని రూపొందించడమే లక్ష్యమని తెలిపారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇంటర్–స్టేట్ వాటర్ రిసోర్సెస్ (ఐఎస్‌డబ్ల్యూఆర్) మరియు చీఫ్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీఓ) బలోపేతం సమర్థవంతమైన రూపకల్పన మరియు పర్యవేక్షణకు అత్యవసరమని అన్నారు. అదనపు ఇంజనీర్ల నియామకం, హార్డ్‌వేర్ అప్‌గ్రేడ్ మరియు ఆధునిక రూపకల్పన సాఫ్ట్‌వేర్ వినియోగం ఆదేశించారు. అలాగే వర్షాకాలం తగ్గుముఖం పట్టడంతో అన్ని ప్రధాన రిజర్వాయర్లు నిండుగా ఉంచాలని, హైడ్రాలజికల్ సీజన్ ముగిసే వరకు టెలిమెట్రీ ఆధారిత పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.

# సామాన్యులపై ఆర్టీసీ గుదిబండ

- ఛార్జీల పెంపు దారుణం
- ప్రజలపై భారం మోపడమే: కేటీఆర్
- 9న ఛలో బస్ భవన్‌కు బీఆర్ఎస్ పిలుపు

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో ఆర్టీసీ బస్సు చార్జీల పెంపుపై రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రభుత్వ నిర్ణయంపై బీఆర్ఎస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఈ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ప్రజల ఆర్థిక స్థితిని పట్టించుకోకుండా ప్రభుత్వం చార్జీలు పెంచడం అన్యాయం అని ఆయన విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అనే పేరుతో ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోందని, కానీ అదే సమయంలో పురుషులు, విద్యార్థులపై అదనపు భారాన్ని మోపుతోందని కేటీఆర్ మండిపడ్డారు. ఇంట్లో ఒక మహిళ ఉచితంగా ప్రయాణం చేస్తే, కుటుంబంలోని మిగిలిన సభ్యులందరికీ రెండింతలు చార్జీలు కట్టాల్సి వస్తోంది. దీంతో ఒక కుటుంబానికి నెలకు కనీసం ఇరవై రూపాయల వరకు అదనపు భారం పడుతోంది. ఈ విషయం ఇప్పుడు ప్రతి తెలంగాణ కుటుంబానికీ అర్థమైందని ఆయన అన్నారు. కేటీఆర్ మాట్లాడుతూ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అనే పథకం ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతో ప్రారంభించినట్లు ప్రభుత్వం చెబుతుందేమో కానీ, వాస్తవానికి ఇది ఆర్థిక సమతుల్యతను దెబ్బతీసే నిర్ణయమని వ్యాఖ్యానించారు. ఆర్టీసీ ఇప్పటికే ఆర్థికంగా కష్టాల్లో ఉన్న సమయంలో ఈ విధంగా వసూళ్లను పెంచడం ప్రజలపై నేరుగా భారం మోపడం అవుతుందని ఆయన అన్నారు. ఆర్టీసీని బలోపేతం చేయాలనే ఉద్దేశం ఉన్నా, అది ప్రజల వెన్నుపైన భారం మోపడం ద్వారా సాధ్యం కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం తన ఆర్థిక లోటును పూడ్చుకునేందుకు ప్రయాణికులను బలితీసుకుంటోందని ఆయన ఆరోపించారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకోవడం మానేసి, ప్రచారపరమైన పథకాల పేరుతో బడ్జెట్ నష్టాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నారు. ఇది ప్రజలతో మోసం చేయడమేనని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ నాయకులు కూడా ఈ అంశంపై ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ, చార్జీల పెంపును తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల జీవన వ్యయాలు ఇప్పటికే పెరిగిపోయాయని, ఇలాంటి చర్యలు సాధారణ కుటుంబాలపై మరింత భారం మోపుతాయని వారు పేర్కొన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలతో ఆర్టీసీ చార్జీల పెంపు అంశం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన చర్చావిషయంగా మారింది.

9న ఛలో బస్ భవన్‌కు బిఆర్ఎస్ పిలుపు

ఆర్టీసీ చార్జీల పెంపునకు నిరసనగా ఈ నెల 9వ తేదీన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఛలో బస్ భవన్కి పిలుపునిచ్చింది. ఛార్జీల పెంపు పేదలపై భారం పడుతందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఛలో బస్ భవన్ ధర్నాలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో సహా.. బీఆర్ఎస్ నేతలు పాల్గొంటారని తెలిపారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడారు. నందినగర్ నుంచి కేటీఆర్.. మెహిదీపట్నం నుంచి హరీశ్‌రావు బస్సులో ప్రయాణం చేసి బస్ భవన్‌కి చేరుకుంటారని చెప్పుకొచ్చారు తలసాని శ్రీనివాస్ యాదవ్. పెంచిన బస్సు చార్జీలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణం అంటూనే.. వాళ్ల కుటుంబ సభ్యులపై భారం వేయడం అన్యాయమని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి కోల్పోయిన వారి సంఖ్యనే ఎక్కువని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ పడిపోయిందని ఆరోపించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో కూడా చెప్పిందని గుర్తుచేశారు తలసాని శ్రీనివాస్ యాదవ్. గౌలిగూడ బస్ డిపోను రూ.400కోట్లకు ప్రైవేట్ వాళ్లకి ఇచ్చారని ఆరోపించారు. మియాపూర్, ఉప్పల్‌తో సహా.. వివిధ డిపోలను ప్రైవేటీకరణ చేయబోతున్నారని విమర్శించారు. ఆర్టీసీని ప్రైవేటీకరణ చేసి కార్మికులను ముంచాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చూస్తోందని ధ్వజమెత్తారు.

# ట్రక్కులపై టారీఫ్‌లు

కఠిన చర్యలు తీసుకుంటున్నారు. దీంతో బంగారు భవిష్యత్తును తలుచుకుంటూ ఆ దేశానికి వెళ్లాలనుకునే వారి సంఖ్య తగ్గిపోతోంది. ఆగస్టులో ఉన్నతవిద్య కోసం అమెరికాకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా పడిపోయిందని ఇంటర్నేషనల్ ట్రేడ్ కమిషన్ వెల్లడించింది. ట్రంప్ చర్యల నేపథ్యంలో ఆగస్టులో విదేశీ విద్యార్థులకు జారీచేసే వీసాల్లో తగ్గుదల కనిపించింది. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే అమెరికాకు వచ్చే విద్యార్థుల సంఖ్య 19శాతం తగ్గింది. కరోనా మహమ్మారి తర్వాత ఇదే రికార్డు స్థాయి తగ్గుదల కావడం గమనార్హం. ఇక భారతీయ విద్యార్థుల విషయానికొస్తే 44 శాతం మేర క్షీణత కనిపించింది (%×అ౦ఖుఅ ర్బ౦వత్ జఅఝం%). సాధారణంగా యూఎస్ విశ్వవిద్యాలయాలు ప్రారంభమయ్యే ఆగస్టులో అమెరికా 3,13,138 విద్యార్థి వీసాలు జారీ చేసింది. గత ఏడాది ఇదే సమయానికి అగ్ర దేశానికి వెళ్లిన విద్యార్థుల సంఖ్యలో భారత్ ముందంజలో ఉండగా, ఈసారి ఆ సంఖ్య భారీగా తగ్గింది. మరోవైపు.. చైనా విద్యార్థులకు యూఎస్ 86,647 వీసాలు జారీ చేసింది. భారతీయులకు జారీ చేసిన వీసాల సంఖ్య కంటే ఇది రెట్టింపు కావడం గమనార్హం.

# రూ.24,634 కోట్లతో రైల్వే విస్తరణ

- పలు రైల్వే ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ.. రూ.24,634 కోట్ల విలువైన నాలుగు మల్టీ–ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లోని 18 జిల్లాలను అనుసంధానం చేసే ఈ నాలుగు ప్రాజెక్టులు ప్రస్తుత భారతీయ రైల్వే నెట్‌వర్క్‌ను సుమారు 894 కి.మీ. మేరకు విస్తరించనున్నాయి.

నాలుగు ప్రాజెక్టులు ఇవే..

వార్ధా – భూసావల్ – 3వ, 4వ లైన్ – 314 కి.మీ (మహారాష్ట్ర)
గోండియా – డోంగర్‌గఢ్ – 4వ లైన్ – 84 కి.మీ (మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్)
వడోదర – రత్లాం – 3వ, 4వ లైన్ – 259 కి.మీ (గుజరాత్, మధ్యప్రదేశ్)
ఇటార్సి – భోపాల్ – బినా 4వ లైన్ – 237 కి.మీ. (మధ్యప్రదేశ్)

కేబినెట్ ఆమోదం పొందిన ఈ మల్టీ–ట్రాకింగ్ ప్రాజెక్ట్ సుమారు 3,633 గ్రామాలకు కనెక్టివిటీని పెంచుతుంది. ఇది దాదాపు 85.84 లక్షల జనాభాకు ప్రయోజనం కలిగించనుంది.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ఖండిస్తూ
# తెలంగాణ హైకోర్టు వద్ద టీపీసీసీ లీగల్ సెల్ నిరసన




**హైదరాబాద్, అక్టోబర్ 7 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) లీగల్ సెల్ ఆధ్వర్యంలో చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ నాయకత్వంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, తెలంగాణ హైకోర్టు గేట్ నెం.6 వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొన్నం అశోక్ గౌడ్, న్యాయవ్యవస్థపై దాడి చేయడం అనేది ప్రజాస్వామ్య స్తంభాలపై దాడి చేసినట్లేనని తీవ్రంగా ఖండించారు? న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని, సమగ్రతను కాపాడే దిశగా న్యాయవాదులు, ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో న్యాయవాదులు, టీపీసీసీ లీగల్ సెల్ సభ్యులు పాల్గొని, ప్రధాన న్యాయమూర్తికి సంఘీభావం తెలిపారు. న్యాయపరమైన విలువలు, రాజ్యాంగ పరిరక్షణపై తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు.

మొమిన్ రోషన్ జమీర్, కురుమ నరేందర్, అభిలాష్ ఆశ్రిత్, కమలాకర్, రాజేంద్ర ప్రసాద్, ముజక్కిర్, హైదర్, బాలాజీ, రాజ్‌కుమార్, ఇనాయతుల్లా, లుక్మాన్ అలీ, శిబా రాణి, సంతోష్, మహేష్, శారద, ప్రభాకర్, సిలం, రాఘవేంద్ర రెడ్డి, నర్సింగ్, హరిందర్ సింగ్, ఇతర అభిమత సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు. నిరసన ముగింపులో ఈ ఘటనపై తక్షణమే నిర్పక్షపాతంగా విచారణ జరపాలని డిమాండ్ చేయడంతో పాటు, న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని రక్షించేందుకు దేశంలోని ప్రజాస్వామ్యవాదులు అన్ని వర్గాలు కలిసికట్టుగా పోరాడాలని విజ్ఞప్తి చేశారు

# గడ్డి మందు తాగి ప్రేమికుల ఆత్మహత్యాయత్నం

- **ప్రియుడు మృతి, చికిత్స పొందుతున్న ప్రియురాలు**





**స్టేషన్ ఘన్‌పూర్ / వరంగల్ ఎంజీఎం, అక్టోబర్ 7(జనంసాక్షి):** స్టేషన్ ఘనపూర్ మండలం తాటికొండ గ్రామంలో ప్రేమ జంట సోమవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా ప్రియుడు మృతి చెంద గా, ప్రియురాలు చావు బతుకుల మధ్య కొట్టు మిట్టాడుతూ చికిత్స పొందుతున్నది. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తాటికొండ గ్రామానికి చెందిన మారపాక అంజయ్య, రేణుకుల పెద్ద కుమారుడు అన్వేష్(24), హనుమకొండజిల్లా ధర్మసాగర్ మండ లం పెద్ద పెండ్యాల గ్రామానికి చెందిన గడ్డం దాసు, ఎలిషా దంపతుల కూతురు పావని మధ్య పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఇరువురు పెళ్లి చేసుకోవడా నికి నిశ్చయించుకుని అమ్మాయిని గత మూడు నెలల క్రితమే అబ్బాయి తన ఇంటికి తీసుకువచ్చాడు. అప్ప టినుండి అందరూ అదే ఇంటిలో కలిసి ఉంటున్నారు. అమ్మాయి తల్లిదండ్రులు సైతం నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో పెళ్లి ఖర్చులు భరించి పెళ్లి చేయడానికి ఇరువురి కుటుంబాలు గత రెండు నెలల రోజుల క్రితమే అంగీకరించాయి. ఈ లోగా అబ్బాయి బంధువులు చనిపోవడం మళ్ళీ చుట్టు రావడంతో పెళ్లి వాయిదా పడుతూ వచ్చింది. ఇలా వీరి పెళ్లికి ఏదో ఒకటి అడ్డంకి రావడంతో ఈ ప్రేమ జంట అన్వేష్, పావనీల మధ్య మనస్పర్ధలువచ్చి సోమవారం మధ్యాహ్నం అబ్బాయి ఇంటిలో ఎవరు లేని సమయంలో గడ్డి మంది తాగి ప్రేమ జంట ఆత్మహత్యానికి పాల్పడ్డా రు. వీరిని చూసిన అబ్బాయి తల్లి బంధువులకు, ఇరు పక్కల వారికి తెలుపగా, వారిని చికిత్స నిమిత్తం వరం గల్ యంజీయం తరలించారు. కాగా మంగళ వారం ఉదయం 3 గంటలప్రాంతంలో అన్వేష్ మృతిచెందగా, పావని చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంది. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# అప్పు తీసుకుని ఎగ్గొట్టిన వ్యాపారి

**ఇంటిపై దాడిచేసి తగులబెట్టిన బాధితులు**



**నల్గొండ, అక్టోబరు7 (జనంసాక్షి) :** నమ్మిన జనానికి మాయమాటలు చెప్పి వాళ్ల దగ్గర సొమ్ములు అడ్డంగా దోచేసి, తీరా ఇవ్వమంటే, ఏళ్లకేళ్లు తిప్పించుకుంటూ నరకయాతన గురిచేసిన ఓ మాయగాడికి అప్పిచ్చిన వాళ్లంతా కలిసి గుణపాఠం చెప్పారు. అందరి దగ్గరా రూ. 10 కోట్లకు పైగా ఎగ్గొట్టిన సదరు ఘరానా చీటర్ ఇంటి పై బాధితుల దాడి చేశారు. ప్రజల సొమ్ములతో సుందరంగా కట్టుకున్న భవంతిని దగ్ధం చేసేందుకు ఉపక్రమించారు. ఇంటికి నిప్పంటించారు. నల్గొండ జిల్లా పెద్ద అడిశర్లపల్లి మండలంలోని పడమటి తండాలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రజలకి వడ్డీల ఆశ చూపి రూ. 10 కోట్లకు పైగా దోచేసి, తీరా తిరిగి సొమ్ములివ్వమంటే, వాటిని ఎగ్గొట్టి తిరుగుతున్న బాలాజీ నాయక్ అనే వడ్డీ వ్యాపారి ఇంటి పై బాధితులు కక్ష కొద్దీ రెచ్చిపోయారు. ఇంటి అద్దాలు పగులగొట్టి, ఫర్నీచర్ ధ్వంసం చేసి తగలబెట్టారు. కోర్టుకు పోయి ఐపీ పెట్టి 300 మందికి డబ్బులు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్న బాలాజీ నాయక్ ఇంటికి ఉదయం పెద్ద ఎత్తున బాధితులు తరలి వచ్చి బాలాజీ నాయక్ ఇంటిపై దాడికి పాల్పడ్డారు.

# సీఎం ప్రజావాణిలో 302 దరఖాస్తులు

- **దరఖాస్తులు స్వీకరించిన చిన్నారెడ్డి, దివ్య**

**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 302 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 87, రెవెన్యూ శాఖకు సంబంధించి 42, ఇందిరమ్మ ఇండ్ల కోసం 102, ప్రవాసి ప్రజావాణికి 03 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 68 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

**చిన్నారెడ్డిని సన్మానించిన గ్రూప్ - 2 అభ్యర్థులు**

రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్ - 2 పరీక్షలలో ఎంపికైన అభ్యర్థులు సీఎం ప్రజావాణి ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డిని మంగళవారం ప్రజా భవన్ లో శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. గ్రూప్ - 2 ఫలితాలు ఆలస్యం అవుతున్న నేపథ్యంలో పలు మార్లు అభ్యర్థులు ప్రజా భవన్ లో జరిగే సీఎం ప్రజావాణికి వచ్చి చిన్నారెడ్డిని కలువగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్, సెక్రటరీలతో ఫోన్ ద్వారా మాట్లాడి ధైర్యం నింపిన చిన్నారెడ్డిని కలిసి వారు ధన్యవాదాలు తెలిపారు. పోస్టింగ్స్ కూడా తొందరగా ఇచేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థులు చిన్నారెడ్డిని కోరారు.

# ప్రభుత్వ అడ్వాన్స్డ్ టెక్నాలజీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



**మహబూబాబాద్ బ్యూరో, అక్టోబర్ 07(జనం సాక్షి):** మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అడ్వాన్స్డ టెక్నాలజీ సెంటర్ ను జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ రెవెన్యు , అడిషనల్ కలెక్టర్ అనిల్ కుమార్ తో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏటీసీలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అమలు అవుతున్న వివిధ కోర్సుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏటీసీలో ఉన్న అధునాతన మిషనరీ గురించి వివరాలను సంబందిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్శనలో కలెక్టర్ వెంట మహబూబాబాద్ తహసిల్దార్ రాజేశ్వర్, ఏటిసి ప్రిన్సిపల్ ఎన్. బాబు ఏటిసి ఇంచార్జ్ ఉప్పలయ్య, రాజేశ్వర్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## చెరువులో దూకి ఇద్దరు అన్నదమ్ములు మృతి



**నిర్మల్ టౌన్, అక్టోబర్07 (జనంసాక్షి) :** ఇద్దరు అన్నదమ్ములు చెరువులో పడి మృతి చెందిన ఘటన మంగళవారం నిర్మల్ పట్టణంలో తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. స్థానికుల వివరాల ప్రకారం పట్టనంలోని నాయిడి వాడకు చెందిన మాన్పురి నరేష్,నవీన్ ఇద్దరు అన్నదమ్ములు నరేష్ కు భార్య, ఇద్దరు పిల్లలు, నవీన్ కు భార్య, ఒక కూతురు ఉన్నారు. ఇంట్లో జరిగిన చిన్న వివాదంతో నరేష్ ఆవేశంలో పక్కనే ఉన్న బంగల్ చెరువులో దూకి ఆత్మహత్య పాల్పడ్డాడు, దీనిని గమనించిన తమ్ముడు అన్నను కాపాడాలని వెంటనే చెరువులో దూకి కాపాడేందుకు ప్రయత్నించగా ప్రమాద వశాత్తూ ఇద్దరు మృతి చెందారని తెలిపారు. ప్రమాద స్థలానికి చేరుకున్న కొంత మంది వ్యక్తులు ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ అన్నదమ్ములు మృతి చెందారు .ఇద్దరు అన్నదమ్ములు ఒకేసారి మృతి చెందడంతో కుటుంబంలో విషాదఛాయలు నెలకొన్నాయి. భార్య పిల్లల రోదనలు మిన్నంటాయి. ఈమేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మరణానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# ఆర్టీసీని మరింత దివాళా తీసేలా కుట్ర

- **బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** పెంచిన బస్ చార్జీలు వెంటనే తగ్గించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డి.సుధీర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్ డిమాండ్ చేశారు. చార్జీల భారం ప్రయాణీకులపై ఎలా ఉందో ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు వారు మంగళవారం ఉదయం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ నుంచి అసెంబ్లీ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. చార్జీల పెంపుపై ప్రయాణీకులు తమ నిరసన వ్యక్తం చేశారు. పేదలపై నెలకు ఐదు వందల రూపాయల దాకా అదనపు భారం పడుతుందని వారు వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎమ్మెల్యేలతో కలిసి ప్రయాణీకులు నినాదాలు చేశారు. అసెంబ్లీ దగ్గర బస్సు దిగిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బస్ స్టాప్ లో మీడియాతో మాట్లాడారు. సామాన్య ప్రజలపై చార్జీల మోతతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల వ్యతిరేక సర్కార్ అని రుజువైందని ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్ వ్యాఖ్యానించారు. ఇప్పటికే వాహనాల పన్ను పెంచారు. మద్యం ధరలు పెంచారు. ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ చార్జీల పెంపునకు రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని వారు విమర్శించారు. చార్జీల పెంపుతో ఆర్టీసీని మరింత దివాళా తీసేలా కుట్ర పన్నారని ఆరోపించారు. బస్ పాస్ చార్జీలు పెంచి విద్యార్థులపై భారం మోపారు. ఇప్పుడు మళ్లీ చార్జీలు పెంచి అందరిపై అదనపు భారం మోపాన్నారు. మార్పు మార్పు అంటే సామాన్య ప్రజలపై అధిక భారం మోపడమేనా వారు ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ పేద ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటుందని ఈ ప్రభుత్వంపై చార్జీలు దించేదాకా ఒత్తిడి పెంచుతుందని వారు స్పష్టం చేశారు.



# అన్నప్రసాద వితరణలో ఉప్పల

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మహిళ విభాగం ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్బంగా కొత్తపేట కరెంట్ ఆఫీస్ వద్ద నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీ య ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త ప్రారంభించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల కన్న అన్నప్రసాద వితరణ కార్యక్రమం గొప్పది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పబ్బ చంద్ర శేఖర్ గుప్త, ఐవీఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, ఐవీఎఫ్ మహిళ విభాగ్ రాష్ట్ర ప్రెసిడెంట్ చందా భాగ్య లక్ష్మి మనిమాల, పద్మ ,పద్మజ, గోలి సరిత, పోలా అర్చన కావ్య, చందా సుధాకర్, సామా జగన్నాథం సునీత ,భార్గవి, దాక్షాయిని తదితరులు పాల్గొన్నారు.

## సినీఫక్కీలో మోసం...

**రాయచోటి, అక్టోబరు7 (జనంసాక్షి) :** అన్నమయ్య జిల్లా రాయచోటిలో సినీఫక్కీలో జరిగిన మోసం వెలుగు చూసింది. బ్లాక్ మనీని, వైట్ మనీగా మార్చుకునేందుకు వచ్చామని చెప్పిన.. ముగ్గురు ఢిల్లీ యువకులు ఓ వ్యక్తి నుంచి రూ.4.50 లక్షలు దోచుకెళ్లారు. ఈ మేరకు వివరాలను డీఎస్పీ కృష్ణ మోహన్ మీడియాకు వెల్లడించారు. సౌదీ కరెన్సీ నోట్లు చూపి, నగదు దోచుకెళ్లినట్లు తెలిపారు. న్యూస్ పేపర్ల మధ్య సౌదీ కరెన్సీ పెట్టి నోట్లకట్టగా నమ్మించారు. బాధితుడి ఫిర్యాదుతో 2 గంటల్లోనే రాయచోటి పోలీసులు నిందితులను పట్టుకున్నట్లు మీడియాకు తెలిపారు.

## జూబ్లీహిల్స్ ఎన్నికకు ఎంసీఎంసీ కమిటీ ఏర్పాటు

**హైదరాబాద్, అక్టోబర్ 7 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల నేపథ్యంలో జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ జిల్లాస్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసిఎంసి) ఏర్పాటు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఏర్పడిన ఈ కమిటీ, ఎన్నికల సమయంలో ప్రచార మాధ్యమాల్లో ప్రచురితమయ్యే వార్తలు, ప్రకటనలు, చెల్లింపు వార్తలపై పర్యవేక్షణ చేయనుంది. జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ ఈ కమిటీకి చైర్మన్‌గా , జిహెచ్ఎంసి ప్రజా సంబంధాల అధికారి మామిండ్ల దశరథం మెంబర్ సెక్రటరీగా వ్యవహరించ నున్నారు. సికింద్రాబాద్ ఆర్డిఓ, జూబ్లిహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి.సాయి రామ్, జీహెచ్ఎంసీ డిప్యూటీ ఇంజనీర్ (ఐటి వింగ్ – సోషల్ మీడియా) నర్సింగ్‌రావు, హైదరాబాద్ పిఐబి డిప్యూటీ డైరెక్టర్ మనసా కృష్ణ కాంత్ , ఇండియన్ ఎక్స్‌ప్రెస్ డైలీ ప్రిన్సిపల్ కరస్పాండెంట్ బచంజీత్ సింగ్ లు కమిటీలో సభ్యులు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, మీడియా సమన్వయం కోసం ఈ కమిటీ కీలక పాత్ర పోషించనుంది.

# ఎన్నికల బహిష్కరణ దిశగా పెద్దఎల్లాపురం గ్రామం



**గంగారం అక్టోబర్ 7 (జనం సాక్షి) :** రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు నగారా మోగింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రధానమైన జడ్పీ చైర్మన్, జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు స్థానాలకు రిజర్వుషన్లు ఖరారయ్యాయి. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో సైతం జారీ చేసింది. గంగారం మండలం కోమాట్లగూడెం గ్రామపంచాయతీ నందు1364 ఓట్ల గాను పెద్దఎల్లాపురం గ్రామం నందు 450 ఓట్లు ఉన్నాయి నాలుగు వార్డులు ఈ గ్రామానికి ఉన్నప్పటికీ ఒక్క వార్డులో రిజర్వేషన్ రాకపోవడంతో గ్రామంలోని ప్రజలందరూ ఓట్లని బహిష్కరిస్తున్నట్టు తీర్మానం చేసుకున్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం ఓటర్ల సంఖ్యను బట్టి రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలి కానీ మమ్మల్ని ఓటు వేసే యంత్రాలుగానే వాడుకుంటున్నారని ఇకనైనా మాకు ఎన్నికలలో పోటీ చేసి ప్రజా ప్రతి నిధులుగా ఎన్నికయ్యే అవకాశాలు కల్పించాలని ఎమ్మార్వోకి పెద్దఎల్లాపురం గ్రామస్తులు వినతి పత్రం అందించారు.

## ఓటు చోరీ పోరాటానికి మద్దతుగా
# సంతకాల సేకరణ

- **ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**



**శాయంపేట, అక్టోబర్ 7 ( జనం సాక్షి) :** శాయంపేట మండల కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రారంభించిన ఓటు చోరీ పోరాటానికి మద్దతుగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ఓటు చోరీతోనే మూడవ సారి అధికారంలోకి వచ్చారని, తెలంగాణలో ఎనిమిది ఎంపీ సీట్లను సైతం అలాంటి మోసాలకు పాల్పడే గెలిచిందని ఆరోపించారు. ప్రతి గ్రామములో కనీసం 100 సంతకాలు సేకరించాలని అన్నారు. దేశంలో ఓటు హక్కును,ప్రజాస్వామ్య విలువను కాపాడుకునేందుకు ప్రజలంతా కలిసికట్టుగా పోరాటం చేయాలని అన్నారు. అనంతరం మండల కేంద్రంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకల లో పాల్గొని వాల్మీకి మహర్షి ఫోటోని పాలతో కడిగి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామాయణ మహాకావ్యాన్ని మానవాళికి అందించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని అన్నారు. వాల్మీకి మహాకవి విరచిత రామాయణ ఇతిహాసం సదా అనుసరణీయం ఆదర్శప్రాయమన్నారు. అఖండ భారతావనికి ఆదర్శప్రాయుడై నిలిచిన లోకభిరాముని దివ్యచరితను లోకొత్తరం చేసిన ఆదికవి వాల్మీకి మహర్షి అని తెలిపారు. కృషి ఉంటే మనుషులు రుషులవుతారుమహాపురుషులవుతారన్న మాటలకు వాల్మీకి మహర్షి జీవితం ఒక ప్రత్యక్ష నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమాలలో ఎమ్మెల్యే వెంట శాయంపేట మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రింటింగ్ ప్రెస్ యజమానులకు అవగాహన

- **జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి..**




**వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 7(జనం సాక్షి):** జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ప్రింటింగ్ మరియు ముద్రణ యాజమాన్యం తో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు లో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అవగాహన కలిగించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ జి సంధ్య రాణి, జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, డిపిఓ కల్పన పాల్గొని ప్రింటింగ్, ముద్రణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలోరాష్ట్ర ఎన్నికల ప్రింటింగ్ ప్రెస్ ల యాజమాన్యం కమిషన్ నిబంధనలు, ,మార్గదర్శకాలకు ఖచ్చితంగా పాటించాలని అన్నారు. ఎన్నికల నియమ నిబంధనలను ముందస్తుగా తెలియజేయుటకు నిబంధనలతో కూడిన పత్రాలు వారికి అందించాలని వారు పేర్కొన్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 లోని నిబంధనలను అనుసరించి ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లు, మొదలైన ముద్రణ ప్రచురణాలు నిబంధనల మేరకు అనుబంధంబి ఏ అనుబంధం బి బి లను సంబంధిత రాజకీయ పార్టీల ప్రతినిధులు పూరించి ఇచ్చినట్లయితే వాటిని ముద్రించాలని పేర్కొన్నారు. ఈ అవగాహన సదస్సులో వరంగల్ జిల్లాలోని వివిధ ప్రింటర్స్ యజమాన్యం పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఎయిరిండియా విమాన ప్రమాద దర్యాప్తు

- **ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు: కేంద్రమంత్రి**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (జనంసాక్షి) :** అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న ఎయిరిండియా విమాన ప్రమాదంపై నిష్పక్షపాత దర్యాప్తు సాగుతోందని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. దర్యాప్తుపై వస్తోన్న ఆందోళనలను రామ్మోహన్ నాయుడు తోసిపుచ్చారు. దర్యాప్తులో ఎటువంటి అవకతవకలు జరగడం లేదని.. నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరుగుతోందన్నారు. విమాన ప్రమాదంపై 'ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ఇచ్చిన ప్రాథమిక నివేదికపై విమర్శల నేపథ్యంలో కేంద్ర మంత్రి ఇలా స్పందించారు. విమాన ప్రమాదాల వ్యవహారాలను చూసే బాధ్యత ఏఏఐబీది. కేవలం వాస్తవాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటుంది. ఎవరి ప్రభావం దీనిపై ఉండదు. నిబంధనల ప్రకారం.. పారదర్శకంగా, స్వతంత్ర పద్ధతిలో దర్యాప్తు జరుగుతోంది. ప్రాథమిక నివేదికపై వ్యాఖ్యలు చేయడం తొందరపాటే అవుతుంది. అసలేం జరిగిందనే విషయంపై స్పష్టత రావాలంటే తుది నివేదిక వచ్చే వరకు వేచి చూడాల్సిందేనని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. దిల్లీలో ఓ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. విలేకరులతో మాట్లాడారు. దేశంలోని అన్ని బోయింగ్ 787 విమానాల్లో క్షుణ్నంగా తనిఖీలు చేయాలని, ఎలక్ట్రికల్ వ్యవస్థల పనితీరుపై దర్యాప్తు చేపట్టాలని కోరుతూ 'ది ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్(ఎఫ్ఐపీ)' ఇటీవల డీజీసీఏకు లేఖ కూడా రాసిన విషయం తెలిసిందే. బోయింగ్ విమానాల్లోని భద్రత ప్రమాణాలపై గతంలోనూ తాము ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని అందులో గుర్తు చేసింది. ఈ క్రమంలోనే పౌర విమానయాన శాఖ





# ఊరంతా సోలార్

## దేశానికి రోల్ మోడల్‌గా కొండారెడ్డిపల్లి

*జన్మభూమి రుణం తీర్చుకుంటున్న సీఎం*
*కొత్త కాంతుల ఖిల్లా కొండారెడ్డిపల్లి..*
*సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామంలో*
*వంద శాతం సౌర వెలుగులే..*
*దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా..*
*భారతదేశంలోనే రెండో గ్రామంగా రికార్డు..*
*దేశం దృష్టిని ఆకర్షిస్తోంది..*
*అభివృద్ధిలోనూ ఆదర్శం..*

ఆ ఊరికి ఒక ప్రత్యేకత ఉంది.. రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు.. అక్కడి పుట్టిన బిడ్డే రాష్ట్రానికి ముఖ్యమంత్రి.. మా మధ్యలో ఉన్న నేత ముఖ్యమంత్రి కావడంతో ఆ గ్రామ ప్రజలు ఎంతో సంతోషించారు.. మేమంతా అదృష్టవంతులు అని సంభ్రమాశ్చర్యంలో మునిగిపోయారు.. నిజంగా ఆ ఊరి ప్రజలు అదృష్టవంతులే.. ఎందుకు చెప్పాల్సి వస్తుందంటే ఆ ఊరికి మహర్దశ వచ్చింది. వారి కళ నెరవేరుతున్నది. అక్కడ ప్రజలకు ఏలాంటి సమస్యలు.. ఇబ్బందులు ఉండవు. ఒకవేళ ఉన్నా నిమిషాల్లోనే పరిష్కారమవు తాయి. ఇక అభివృద్ధిలో అందనంత ఎత్తులో పరుగు పరుగులు పెడుతున్నది. అన్నిరంగాల్లోనూ ప్రగతి పథంలో పయనిస్తోంది. రాష్ట్రానికే ఆ గ్రామం దిక్సూచినా నిలుస్తుంది. రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయినా సొంత గ్రామం ఇతర నగరాలకు ధీటుగా ఉండాలని సంకల్పించారు. దీంతో గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆ గ్రామం దేశంలోనే రోల్ మోడల్ గా ఉండేలా.. అభివృద్ధిలో చరిత్ర సృష్టించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇతర గ్రామాలకు మార్గదర్శకంగా నిలవాలనీ.. ఐకాన్ గా ఉండాలని సరికొత్త కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రజల కలను సహకారం చేసి చూపిస్తున్నారు. దేశంలోనే ఉత్తమ గ్రామంగా పేరు ప్రఖ్యాతులు వచ్చేలా తీర్చిదిద్దుతు న్నారు. ఆ గ్రామానికి నిరంతరం వెలుగులు ప్రసరించేలా వినూత్న పథకానికి శ్రీకారం చుట్టారు. అభివృద్ధిలో వెలుగుతున్నట్టే నిత్యం గ్రామం సౌర విద్యుత్ తో నిత్య నూతనంగా వెలుగులు విరజిమ్మేలా కొత్త ఆలోచనకు పురుడు పోశారు.. ఆ గ్రామానికి వెలుగులు ఇవ్వడమే కాదు.. ఒకవైపు వెలుగునిస్తూనే వారికి అదనపు ఆదాయం వచ్చేలా చేశారు.. దీంతో ఆ గ్రామస్థుల ఆనందానికి అవధుల్లేవు.. తమ గ్రామం ఇంత అభివృద్ధి చెందుతుందని కలలో ఊహించలేమని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలా ఎవరు చేశారంటే ఇప్పుడికే అర్థమై ఉంటుంది.. ఆ మహానేత.. మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి.. ఈ గ్రామం ఎవరిదో కాదు. ముఖ్యమంత్రికి జన్మనిచ్చిన గ్రామం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లి. ఈ గ్రామం నాగర్ కర్నూలు జిల్లా వంగూరు మండలంలో ఉంది. తాజాగా కొండారెడ్డిపల్లి కొత్త కాంతుల ఖిల్లాగా మారింది. జన్మభూమి రుణాన్ని సీఎం తీర్చుకుంటున్నారు. జన్మనిచ్చిన ఊరికి ప్రజలకు అండగా ఉంటున్నారు. నూరు శాతం సోలార్ విలేజ్ గా గుర్తింపు పొందిన కొండారెడ్డిపల్లి ప్రస్తుతం దేశం దృష్టిని ఆకర్షిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏ కార్యక్రమం.. కార్యం చేపట్టినా చాలా లోతుగా ఆలోచిస్తారు.. అధ్యయనం చేస్తారు.. దాని లాభనష్టాలు.. ప్రజలకు దానితో ఏమి ఉపయోగం ఉంటుంది. అనుకూలతలు.. ప్రతికూలతలు అన్నింటిపై శోధిస్తారు. ఏదో అషామాషీగా మాత్రం నిర్ణయం తీసుకోరు. లోతుగా చర్చించిన విశ్లేషించిన తర్వాతనే దానిపై నిర్ణయం తీసుకుంటారు. దీర్ఘకాలికంగా దానిపై వచ్చే ఫలితాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన తర్వాతనే దానిపై ముందడుగు వేస్తారు. రాష్ట్రంలో చేపడుతున్న బృహత్తర పథకాలు అలాంటివే. ఆ విధంగా రూపుదిద్దుకున్నవే. అందులో భాగంగానే తన స్వగ్రామం లోనూ 100% సోలార్ గ్రామంగా రూపుదిద్దుకునేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. నూరుశాతం సౌరశక్తితో నడిచే గ్రామంగా కొండారెడ్డిపల్లి ప్రత్యేకత సాధించింది. దేశంలో గుజరాత్లోని మోదర తర్వాత దేశంలోనే రెండో గ్రామంగా కొండారెడ్డిపల్లి రికార్డుల్లోకి ఎక్కింది. పూర్తిగా సౌర విద్యుత్ తో నడుస్తున్న కొండారెడ్డిపల్లి. తెలంగాణ లోనే మొదటి సోలార్ విలేజ్ గా గుర్తింపునకు నోచుకుంది. గుజరాత్ లోని మోదర తర్వాత 24/7 సౌర విద్యుత్ అందిస్తున్న దేశంలోని రెండో గ్రామంగా ఘనత సాధించింది. కొండారెడ్డిపల్లిలోని ప్రతి ఇంటి పైకప్పుపై సోలార్ రూఫ్ లాప్ లు ఏర్పాటు చేశారు. వాటి ద్వారా ఉత్పత్తి చేస్తున్న విద్యుత్ ప్రస్తుతం గ్రామ ప్రజలందరు వాడుకుంటున్నారు. ఇంటి.. గృహ అవసరాలకు వాడుకుంటూ మిగిలిన విద్యుత్ ను ప్రభుత్వానికే గ్రామ ప్రజలు విక్రయిస్తున్నారు. తద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు. 200 యూనిట్ల విద్యుత్ వినియోగించిన వారికి గృహజ్యోతి పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉచిత విద్యుత్ అందిస్తున్నది. కొండారెడ్డిపల్లిలో అంతా సౌర విద్యుత్ ను వాడడం వల్ల ప్రజలకు విద్యుత్ బిల్లుల భారం పూర్తిగా తగ్గిపోయింది. ప్రజలకు డబ్బులు చెల్లించే అవసరం లేకుండా పోయింది. ఈ డబ్బులను పొదుపు చేసుకుంటున్నారు. రహదారి మధ్యలో సోలార్ వీధి దీపాలు ఏర్పాటు చేయడం విశేషం.





### సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టగానే కార్యారూపం..

దక్షత.. నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తున్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అనుకున్న లక్ష్యాన్ని సాధించడంలో అందరికంటే ముందు వరుసలో ఉంటారు. పట్టువదలని విక్రమార్కుడు వలె తన సొంత గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతు న్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత కొండారెడ్డిపల్లి గ్రామంలో విద్యుత్ ఇబ్బందులు తీర్చేందుకు సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఒకవైపు విద్యుత్ కష్టాలు తీర్చడంతో పాటు గ్రామ ప్రజలు విద్యుత్ బిల్లుల ఇక్కట్లకు చెక్ పెట్టాలని నిర్ణయించారు. దానికో కొత్త ఆలోచన చేశారు ముఖ్యమంత్రి. శాశ్వతంగా భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఉండాలని సంకల్పించారు. కొండారెడ్డిపల్లి గ్రామాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పీఎం సూర్యఘర్ యోజన పథకం కింద ఎంపిక చేయించారు. ఆ గ్రామాన్ని సోలార్ విలేజ్ గా మార్చే ప్రాజెక్టు వ్యయం రూ.10.53 కోట్లు కాగా కేంద్ర ప్రభుత్వం రూ.3.56 కోట్లను సబ్సిడీగా అందజేసింది. మిగిలిన మొత్తాన్ని శ్రీ ఆసోసియేట్స్, అమార్ కంపెనీలు ఖర్చు చేశారు. టీజీరెడ్కో ఆధ్వర్యంలో గతేడాది సెప్టెంబర్లో పనులు ప్రారంభమయ్యాయి. గ్రామంలో 514 ఇళ్లు ఉన్నాయి. ఏడాది వ్యవధిలోనే ప్రతి ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ లు.. కాలనీలో విద్యుత్ వెలుగులు విరజిమ్మేలా రహదారులపై సోలార్ వీధి దీపాలు ఏర్పాటు చేశారు. వేగవంతంగా పనులు చేపట్టేలా ఆదేశాలిచ్చి ముఖ్యమంత్రి వాటిని పూర్తి చేయించారు. జిల్లా అధికారుల పర్యవేక్షణలో పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఇంటి సామర్థ్యం, విస్తీర్ణం ప్రకారం ఒక్కో ఇంటిపై కిలో వాట్ నుంచి మూడు కిలో వాట్ల సామర్థ్యం ఉన్న ప్లాంట్లను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్ ను ప్రజలు తమ గృహ అవసరాలకు ఉపయోగించుకుం టున్నారు. మిగిలిన విద్యుత్తును ప్రభుత్వానికి విక్రయిస్తున్నారు. తద్వారా అదనపు ఆదాయాన్ని అర్జిస్తున్నారు. అదేవిధంగా 60 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సౌర విద్యుత్ పరికరాలను ప్రభుత్వ భవనాలపై బిగించారు. ప్రభుత్వ కార్యాలయాలకు సైతం సౌర విద్యుత్ అందుతున్నది. ఇంత గొప్పగా విద్యుత్ వెలుగులతో పాటు అదనపు ఆదాయాన్ని అందించే అవకాశం ఆ గ్రామ ప్రజలకు కల్పించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఈ ప్లాంట్ల ద్వారా నెలకు 360 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. గ్రామప్రజలు ఇప్పటిదాకా దాదాపు లక్ష యూనిట్లను ప్రభుత్వానికి విక్రయించారు. ఒక్కో యూనిట్ సౌర విద్యుత్ కు ప్రభుత్వం రూ. 5.25 ఇచ్చేలా ఒప్పందం చేసుకుంది. ఇప్పటివరకు లక్ష యూనిట్లను గ్రిడ్ కు సరఫరా చేయగా దాదాపు రూ.5 లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఏ ఇంటి ప్లాంటు నుంచి ఎంత తీసుకున్నారో దానికి సంబంధించిన మొత్తాన్ని సదరు ఇంటి యజమాని బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నారు. ఈ నిర్వహణ పక్కాగా.. పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. గతంలో గ్రామంలో విద్యుత్ వినియోగానికి సంబంధించి నెలకు రూ.2 లక్షల వరకు బిల్లులు వచ్చేవి. ఇప్పుడు పూర్తిగా సోలార్ గ్రామంగా మారడంతో ప్రజలపై విద్యుత్ బిల్లుల భారం తగ్గిపోయింది. పైగా, సౌర విద్యుత్ ప్రభుత్వానికి విక్రయించడం వల్ల చేస్తుండటంతో నెలకు రూ. 6 లక్షల వరకు ప్రజలకే అదనపు ఆదాయం వస్తుండడం రికార్డు అని చెప్పవచ్చు. దీంతో పాటు ఈ గ్రామం అభివృద్ధిలో సైతం పరుగులు పెడుతున్నది. అన్నిరంగాల్లో ప్రగతి పథంలో పయనిస్తున్నది.

**రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక కొండారెడ్డిపల్లికి మహర్దశ వచ్చింది. మరో పక్క, కొండారెడ్డిపల్లిలో దేవాలయాల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. గ్రామంలో ఇప్పటికే నాలుగు లైన్ల రహదారి, గ్రంథాలయ భవనం, పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టారు. గ్రామం అభివృద్ధికి నిలయంగా మారింది. రాష్ట్ర ప్రజల దృష్టిలో ప్రత్యేకత సాధించింది.**

**కొండారెడ్డిపల్లిలో వ్యవసాయానికి సైతం సోలార్ విద్యుత్ అందించేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. వ్యవసాయానికి సౌర విద్యుత్ అందించేందుకు అంచనాలను టీజీ రెడ్కో అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి అందించారు. ఒక్కో పంపుసెట్ నడవాలంటే 7.5 కిలో వాట్ల సోలార్ ప్లాంటు అవసరమని అధికారులు తేల్చారు. కొండారెడ్డిపల్లిలో 941 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. సౌర విద్యుత్తు ఏర్పాటు చేసినప్పటి నుంచి 25 ఏళ్ల వరకు పెద్దగా నిర్వహణ ఖర్చులు ఏమి ఉండవు. రైతులకు అనవసర ఖర్చులు కూడా తగ్గిపోతాయి. అదనపు భారం కూడా ఏమీ ఉండదు రైతులకు పూర్తిగా ఉచిత విద్యుత్తును పొందుతారు. రైతుల అవసరం తీరినప్పుడు మిగిలిన విద్యుత్తును ప్రభుత్వానికి విక్రయించుకునే ఛాన్స్ కూడా ఉంది. ముఖ్యమంత్రి తన సొంత గ్రామానికి సౌర వెలుగులు అందించడమే కాకుండా అభివృద్ధిలోను వెలుగులు విరజిమ్ముతున్నారు. ఈ గ్రామం రాబోయే రోజుల్లో మరింతగా అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి గ్రామం అన్నిట్లోనూ రాష్ట్రంలోనే మార్గదర్శకంగా నిలవాలని కోరుకుందాం.. తనకు జన్మనిచ్చిన గడ్డ లో కలకాలం నిలిచిపోయేలా ముఖ్యమంత్రి పనులు చేపట్టడం చారిత్రాత్మకం.. అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తలపోసిన లక్ష్యం నెరవేరాలని ఆశిద్దాం.. జన్మభూమి రుణం తీర్చుకునేందుకు మంచి అవకాశం దొరికింది ముఖ్యమంత్రికి..**

**హాట్సాఫ్ రేవంత్ రెడ్డి గారు..**



గొట్టిముక్కుల బ్రహ్మచారి
సీనియర్ జర్నలిస్టు
9441884389

# జస్టిస్ గవాయిపై దాడి న్యాయవ్యవస్థపై దాడే



భారత సామాజిక వ్యవస్థలో సనాతన ధర్మం పేరిట భిన్న జాతుల మధ్య ఐక్యత లేకుండా ఆధిపత్య కులాల ఆధిపత్యం ఇప్పటికీ బలంగా అణిచివేతను కొనసాగిస్తున్నది. పాఠశాలల మొదలు పని స్థలాల వరకు ఇది నిత్యకృత్యమైంది. అన్ని రాష్ట్రాల్లోనూ దళితులపై అణిచివేత ఇంకా బలంగానే వ్యక్తమవుతున్నది. తాజాగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఓ కేసు విచారణ సమయంలోనే దాడి జరిగింది. సనాతన ధర్మం పేరుతో దళితుడైన చీఫ్ జస్టిస్ మీద దాడి జరగడంతో దీని వెనక నేపథ్యాన్ని అర్థం చేసుకోవడం కష్టమేమీ కాదు. ఈ ఘటన ప్రజాస్వామ్యానికే మచ్చ తెచ్చింది. దేశంలోని అగ్ర కుల ఆధిపత్యానికి, మత ఛాందసవాద తీవ్రతకు ఇది నిదర్శనం.

కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గడచిన పదకొండేళ్లుగా కులవిద్వేష, మత విద్వేష రాజకీయాలు పెచ్చుమీరిపోయాయి. దళితులకు జీవించే హక్కు ప్రమాదంలో పడింది. కుల అణిచివేత, మత అణిచివేతపై ఆధారపడ్డ బీజేపీ చివరికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తినీ వదల్లేదు. దేశంలో ప్రజాస్వామ్యం ఉన్నదా?.. రాజ్యాంగం అమలవుతున్నదా?.. మతోన్మాదాన్ని వ్యతిరేకిస్తే ఇలాంటి దాడులు పెరుగుతాయని హెచ్చరించడమా?.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపైనే దాడి జరిగితే ఇక దేశంలో భద్రతెక్కడ?.. రాబోయే రోజుల్లో మరిన్ని ప్రమాద ఘంటికలకు ఇదో సంకేతం.

సామాజిక, ఆర్థిక విషయాలపై ఉద్యమిస్తున్న అన్ని వర్గాల ప్రజలపైనా హిందూ ఫాసిస్టు దమన కాండ విజృంభిస్తున్నది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై హిందూ మతోన్మాదుల దాడిని ఈ కోణంలోనే చూడాలి. సామ్రాజ్యవాద సంస్కృతికి, బహుళజాతి కంపెనీల పెట్టుబడులకు దేశ సంపదను దోచిపెట్ట డానికి ఎర్ర తివాచీ పరుస్తూ ప్రశ్నించే గొంతులను బీజేపీ నొక్కేస్తు న్నది. ప్రజాస్వామిక విలువలు, రాజ్యాంగ స్ఫూర్తి బేఖాతర్. ఈ మౌలికమైన అంశంపై ప్రశ్నించడంతో పాటు సమాధానాన్ని రాబట్టాల్సిన సందర్భమిది.


గడచిన దశాబ్ద కాలంలో దేశంలో వందలాది మందిని మతోన్మాదులు హత్య చేశారు. లక్షల మందిపై దాడులు చేసి గాయపర్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహంతోనే మత రాజకీయాలు, ఉన్మాద రాజకీయాలు జరుగుతున్నాయి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ఆ కోణంలోనే చూడాలి. కేంద్ర ప్రభుత్వమే మతాన్ని అధికారికంగా ప్రచారం చేస్తున్నది. మత సంస్థలను, మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తున్నది. ఫలితంగా లౌకికవాదం ప్రశ్నార్థకంగా మారింది. దీన్ని ప్రస్తావిస్తే భౌతిక దాడులు ఎదురవుతున్నాయి. హిందు రాజ్య స్థాపనే లక్ష్యంగా సనాతన ధర్మం పేరుతో దేశంలోని మతాల మధ్య చిచ్చు పెడుతున్నది. కేవలం అధికారం కోసం మతాన్ని ఎజెండాగా ఎంచుకున్నది. ఇది ప్రజాస్వామ్యా నికి, రాజ్యాంగానికి, లౌకికవాదానికి విరుద్ధం.

నిజానికి గత కొన్ని దశాబ్దాలుగా సెక్యులర్ స్ఫూర్తితో కొనసాగుతున్న ఇండియాను హిందూ భారత్‌గా మార్చే కుట్రలు జరుతు న్నాయి. అందులో భాగమే దేశంలోని అన్నిరాజ్యాంగబద్ధమైన సంస్థలను కాషాయికరిస్తున్నది. ఒక్కో వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నది. సనాతన ధర్మం పేరుతో బలహీనపరుస్తున్నది. లౌకికవాదం గురించి, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడేవారిపై, రాసేవారిపై, పాడేవారిపై మతోన్మాదులు దాడులకు తెగడుతున్నారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత మతోన్మాద రాజకీయాలు పెచ్చుమీరిపోయాయి. దేశంలో హిందు మతం తప్ప మరే మతం ఉండొద్దని, హిందువులు తప్ప ఇతర మతస్తులు వుండొద్దన్న నిర్బంధం అమలవుతున్నది. ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేస్తున్న బీజేపీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నది. ప్రధాని, కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలంతా చట్టసభల వేదికగా చేసిన ప్రమాణాలను తుంగలో తొక్కుతున్నారు. దేశంలో ప్రజాస్వామ్యంపై శాస్త్రీయతను ప్రజల్లోకి తీసుకెళ్ళే ప్రయత్నం చేసిన డా. దబోల్కర్ను చరిత్ర వక్రీకరణను వ్యతిరేకించి న గోవింద్ పన్సారేలను మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా నిలబడ్డ ప్రొ. ఎం.ఎం. కల్బుర్గిని అవినీతికి వ్యతిరేకంగా గొంతెత్తిన జర్నలిస్టు గౌరీ లంకేశ్న హతమార్చడమే కాక ఈ మధ్య కాలంలో చత్తీస్ ఘడ్ లో 100 కోట్ల అవినీతిని బయట పెట్టిన యూట్యూబ్ ఛానెల్ జర్నలిస్ట్ ముఖేష్ చంద్రాకర్ను కూడా అత్యంత కిరాతకంగా హత్య చేసిన పరిస్థితిని మనం చూస్తున్నాం. ఇటువంటి అశాస్త్రీయ అప్రజాస్వామిక రాజ్యాంగ వ్యతిరేక దాడులను నివారించాలంటే చైతన్యవంతులైన ప్రజలందరు సంఘటితం అవ్వడం ద్వారానే సమాజాన్ని ప్రజాస్వామ్యాన్ని నైతిక విలువలను కాపాడుకుంటాం. అందులో భాగంగానే సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ మీద జరిగిన దాడిని తీవ్రంగా ఖండించాలని ప్రజలకు ప్రజాస్వామ్యవాదులకు పిలుపునిస్తున్నాం.



ఎన్. నారాయణ రావు
ప్రధాన కార్యదర్శి
పౌరహక్కుల సంఘం

# దేశంలో ఫాసిజం విజృంభణకు చిహ్నాం



భారత ప్రధాన న్యాయమూర్తి , జస్టిస్ బి.ఆర్. గవాయి పై సుప్రీం కోర్టు లోపల బూటు విసిరిన చర్య కేవలం ఒక వ్యక్తి యొక్క ఆగ్రహ ప్రకటన మాత్రమే కాదు. ఇది మన దేశం యొక్క మానసిక రుగ్మతల వాతావరణాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. న్యాయస్థానం అనేది చట్టం ఆధారంగా మాట్లాడే స్థలం. భావోద్వేగాలు కాదు. కానీ హేతుబద్ధత, తీర్కం, సత్యం ఆధిపత్యం చెలాయించాలి. అయినప్పటికీ, ఈ సంఘటన న్యాయ స్థానం యొక్క పవిత్ర గోడల్లోకి కూడా మత అసహనం చొచ్చుకుపోయిందని వెల్లడిస్తుంది.

గతంలో జరిగిన సంఘటనల నేపథ్యం:

2008లో, ఇరాకీ జర్నలిస్ట్ ఒకరు అమెరికా అధ్యక్షుడు జార్జ్ బుష్‌పై బూటు విసిరారు. ఆ చర్య ప్రపంచవ్యాప్తంగా రాజకీయ వ్యతిరేకతకు చిహ్నంగా మారింది. ఆ తర్వాత, భారతదేశంలో కూడా, పార్లమెంటు ప్రాంగణంలో రాజకీయ నాయకులు, మంత్రులపై బూట్లు విసిరిన సంఘటనలు ప్రజల ఆగ్రహ వ్యక్తీకరణగా జరిగాయి. అయితే, సుప్రీం కోర్టులో ఒక సిట్టింగ్ జడ్జిపై ఈ ఇటీవలి ప్రయత్నం వ్యక్తిగత నిరసనను మించినది. ఇది న్యాయం, చట్టం, ధర్మం, మరియు రాజ్యాంగ క్రమం యొక్క ఆదర్శాలపై జరిగిన అమానుషత్వంతో, మతోన్మాదంతో రెచ్చిపోయిన దాడి. న్యాయమూర్తులపై ఇటువంటి నిరసనలు చరిత్రలో చాలా అరుదు. 1975లో ఎమర్జెన్సీ సమయంలో కూడా సుప్రీం కోర్టు యొక్క గౌరవం అలాగే ఉండిపోయింది. న్యాయమూర్తి హెచ్.ఆర్. ఖన్నా వృత్తిపరంగా ప్రమాదంలో పడినప్పటికీ, తన సిద్ధాంతాలలోనూ వ్యక్తిత్వం విషయంలోనూ ఎన్నడూ రాజీ పడలేదు.


ఈ రోజు, ప్రధాన న్యాయమూర్తి గవాయ్ పై లేవనెత్తిన బూటు మన న్యాయ సంస్కృతిలో దుఃఖకరమైన క్షీణతను సూచిస్తుంది. 'సనాతన సంకుచిత ధర్మం' పేరుతో సాంస్కృతిక దుందుడుకుతనం, రౌడీయిజం తీవ్రమైంది. ఈ దుచర్యను చేపట్టిన వ్యక్తి న్యాయవాది ముసుగులో ఉన్న హిందుత్వ ఉగ్రవాది. "సనాతనానికి ఎలాంటి అవమానాన్ని సహించము" అని అరిచాడు. ఇక్కడే నిజమైన సమస్య మొదలవుతుంది – వ్యక్తులు తమ భావజాలాన్ని మానవత్వం కంటే ఎక్కువగా ఉన్నతీకరించినప్పుడు. సనాతన ధర్మం సంయమనం మరియు కరుణ విలువలను బోధించ లేదా? మతం, ధర్మం, కుల, మత సంస్కృతి ఇప్పుడు వాదనల స్థాయి దాటి పోయి మతోనోమ్మాద ధూర్తుల చేతిలో ఆయుధాలగా మారాయి. సనాతనం, నిర్వచనం ప్రకారం, శాశ్వతమైనది, దానికి హింస ద్వారా రక్షణ అవసరం లేదు. కానీ, ఈ రోజు సంప్రదాయ రక్షకులుగా స్వీయ-ప్రకటిత వ్యక్తులు దాని పునాది విలువైన సహనాన్ని విడిచిపెట్టీ మరో ఉగ్రవాద రూపాన్ని తలకెత్తుకున్నారు . వారు రక్షిస్తున్నది ధర్మాన్ని కాదు, పెంచి పోషిస్తున్నది వారి ఆగ్రహాన్ని, అక్కసును, నిలువెల్లా ద్వేషాన్ని.వారి అంధ భక్తి, వారి రాజకీయ ఉగ్ర వాదానికి పరాకాష్ట.

ప్రధాన న్యాయమూర్తి గవాయ్ గౌరవప్రదమైన జనాభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "న్యాయవాదులు తమ వాదనలను సమర్పించనివ్వండి. ఈ చర్యలు నన్ను ప్రభావితం చేయవు. న్యాయవాదులు శాంతిని కాపాడటం నేర్చుకోవాలి."ఆయన ఆ తర్వాత కూడా కేసును వినడం కొనసాగించారు. ఈ ఒక్క వాక్యం సమకాలీన రాజకీయ భాషపై తీర్పుగా నిలుస్తుంది. ప్రస్తుత పాలనా కాలంలో, ఆగ్రహం చట్టం కంటే బిగ్గరగా మాట్లాడుతుంది. కానీ ఈ న్యాయస్థాన స్పందన మనకు గుర్తు చేస్తుంది. చట్టం ముందు ఆగ్రహం సంయమనంతో నియంత్రించబడాలి.

ప్రధాన న్యాయమూర్తి గవాయ్ స్వయంగా దళిత నేపథ్యం నుండి వచ్చినవారు. ఆయన అత్యున్నత న్యాయస్థాన అధికారిగా ఎదగడం మన ప్రజల సమానత్వ స్ఫూర్తికి, రాజ్యాంగం ద్వారా సాధ్యమైన అవకాశానికి నిదర్శనం. 'సనాతనం' పేరుతో ఆయనపై దాడి జరగడం కుల వాదం, మతపరమైన అసహనం, క్షీణ భావజాల సంస్కృతికి ప్రతీక. ఈ తీవ్రవాదం మన దేశానికి చాలా ప్రమాదకరమైంది.

ఒక సత్యం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి: న్యాయస్థానం యొక్క గౌరవం సమాజం యొక్క గౌరవం. సుప్రీం కోర్టు కేవలం న్యాయ సంస్థ మాత్రమే కాదు, ఇది మన దేశం యొక్క నైతిక శిఖరం. దాని బెంచ్‌ను అపవిత్రం చేయడానికి చేసిన ప్రయత్నం మన గణతంత్ర యొక్క నీతి,ధర్మంపై చేసిన దాడి. ఇటువంటి సంఘటనలు సామాన్యమైనవి కావు. అవి సమాజంలో పెరుగుతున్న అవిశ్వాసం, అసహనం, మరియు ఆవేశపూరిత అజ్ఞానాన్ని సూచిస్తాయి. మన తరం బూట్లు విసరడం లేదు, అది చట్టం యొక్క గౌరవాన్ని విడిచిపెడుతోంది.జనాభిప్రాయం హింస ద్వారా మాత్రమే బలహీనపడదు, గౌరవం క్షీణించినప్పుడు అది క్షీణిస్తుంది. న్యాయవ్యవస్థపై గౌరవం మనలో ఇంకా మానవత్వం ఉందనడానికి నిదర్శనం. బూటు విసరడం న్యాయం యొక్క చిహ్నం కాదు – అది దాని అంతం.ఈ పతనం మన దేశంలో 2014 నుండే ప్రారంభం అయింది. దేశంలో ఫ్యాసిజం విజృంభణకు చిహ్నం దీనిని మొగ్గలోనే త్రుంచి వేయాలి. మన సమాజం తప్పనిసరిగా ఒక గుణం పాఠాన్ని తిరిగి నేర్చుకోవాలి.మరో సారి ఈ మత వ్యాధి పీడితులకు దూరంగా ఉండాలి.

న్యాయంపై నమ్మకం ఉన్నవాడు విజయం సాధిస్తాడుబీ న్యాయాన్ని తిరస్కరించేవాడు చరిత్ర హీనుడై పతనం చెందుతాడు.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

## మార్కెటింగ్!

మార్కెటింగ్
అమ్మకాలు
కొనుగోళ్ళు!
తినాలంటే
కొనాలి!
అమ్మకం
నీ ఇష్టం!
నేనూఅమ్ముతాను
కాళ్ళుచేతులు!
శ్రమజీవిని
'కూలి'కోసం!
నా'కూలి'రేటు
నిర్ణయం నీది!
నా బతుకు
నీ చేతుల్లో!
తరతరాలుగా
కూలి జనం
శ్రమ అమ్మకం
అనివార్యం!
నీ మార్కెటింగ్
భూమిగాలినీరు
కొత్త ఇన్వెన్షన్స్
వస్తు సేవలు!
ఓ ప్రక్క ప్రకృతి
మరోప్రక్కమేము
దోచుకొనే నీకు
ప్రపంచమేమార్కెట్!
లాభాలే లాభాలు
వస్తుసేవలేకాదు!
భక్తి, ఆధ్యాత్మికం
భావాలు కూడా
మార్కెటింగ్!
'రేటు' నీది!
'వేటు'మాకు!
వైభవంనీకు!
దరిద్రంమాకు!
దేవుడూ
పంచభూతాలు
వేసే శిక్షలు!
ఎన్నోనీతులు!
లాభాలు నీకు!
శిక్షలు మాకు!
పాపం నీది!
భీతి మాకు!
మార్కెటింగ్!
మార్కెటింగ్!
నీదోపిడీసాగుజి
అమానుషం!
ఇప్పుడిప్పుడే
కళ్ళుతెరిచాం!
నీ మార్కెటింగ్!
వస్తుసేవలదోపిడి!
అర్థమౌతోంది!
అంతానీకుట్ర!
అవిద్య అజ్ఞానం
మామొహానకొట్టి
నువ్వుదోచేసావ్!
రాజ్యమూ
నీకే తోడు!
మా శ్రమను దోచి
నువ్వు కులకటం!
క్యాపిటలిజం
క్రోనీ క్యాపిటల్
సామ్రాజ్యావాదం
కార్పొరేట్ శక్తులు!
మార్కెట్!మార్కెట్!
ప్రపంచ మార్కెట్!
అంతా నీచేతుల్లో!
ఇన్నాళ్లు సాగింది!
ప్రపంచకార్మికులు
ఐక్యమౌతున్నారు!
లాల్ నీల్ శక్తులు
ఏకమౌతున్నాయి!
లాభాలు నీవికాదు
సమాజపరమౌతాయి
కాలం మారుతోంది!
విను!ప్రపంచమంతా
నినాదాలహోరు!

తమ్మినేనిఅక్కిరాజు
హైదరాబాద్

## హక్కులు సాధించేవరకు సమ్మె కొనసాగిస్తాం

- 26వ రోజు గిరిజన కాలేజీ హాస్టల్ ముందు వర్కర్ల ఆందోళన




**మెదక్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 7 (జనం సాక్షి) :** హక్కులు సాధించుకునే వరకు సమ్మె కొనసాగిస్తామని తెలంగాణ డైలీ వైజ్, కాంటినిజెంట్ వర్కర్ల జేఏసి రాష్ట్ర కన్వీనర్ మాడే పాపారావు హెచ్చరించారు. తెలంగాణ గిరిజన ఆశ్రమ స్కూల్స్ పనిచేస్తున్న డైలీ వైజ్, కాంటినిజెంట్ వర్కర్ల జేఏసి ఆధ్వర్యంలో వర్కర్లు మంగళవారం మెదక్ లోని గిరిజన కళాశాల హాస్టల్ ముందుచేపట్టిన సమ్మె 26వరోజుకుచేరింది.వీరిసమ్మెకు మద్దతు తెలిపి సమ్మె లో పాల్గొని మాడే పాపారావు మాట్లాడుతూ 26రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యే లను కలిసి తమ గోడు చెప్పుకున్నామని, అయినా వారిలో చలనం రావడం లేదని ఆరోపించారు.తమేమి గోంతెమ్మ కోరికలు కోరడం లేదని, తమకు న్యాయ బద్దంగా ఇవ్వాల్సిన బెనిఫిట్స్ మాత్రమే అడుగుతున్నామన్నారు. 212 జీవోను సవరించి 2014 నాటికి ఐదెండ్లు సర్వీస్ ఉన్న వారందరిని పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. కొత్త మెనూ పెరిగిన పనిభారానికి అనుగుణంగా కార్మికులను పెంచలన్నారు. పూర్తికాలం పనిచేస్తున్న కార్మికులకు పూర్తి వేతనాలు ఇవ్వాలన్నారు. విద్యార్థులతో పాటు కార్మికులకు కూడా రెండు జతల యూనిఫాం, ఐడి కార్డులుఇవ్వాలన్నారు.కార్మికులకు రూ 10 లక్షల ప్రమాద భీమా కల్పించాలని కోరారు.ఏండ్ల తరబడి అనేక సమస్యలతో సతమతమవుతున్నామని, వేంటనే సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమం యూనియన్ ప్రధాన కార్యదర్శి జె. సునంద కోశాధికారి ఏ. మాధవి సలహాదారు నూనె శేఖర్ ఉపాధ్యక్షులు డి. సువర్ణ సభ్యులు భూలక్ష్మి,జ్యోతి, పెంటమ్మ,రజిత,కిషన్,సురేష్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులపై సర్కారు జులుం

- 6 వేల ఎకరాలు గుంజుకొండ్రు
- పెద్దోళ్ల కోసమే పేదల భూములకు ఎసరు
- అలైన్మెంట్ మార్పుపై స్పష్టత ఇవ్వని సర్కార్
- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఫైర్



**వికారాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 7 (జనం సాక్షి) :** రాష్ట్రంలో ప్రజా పాలన అందిస్తామన్నా రేవంత్ సర్కార్ ఆచరణను పక్కనపెట్టి పేదల భూములు బలవంతంగా లాక్కొని భూధందా చేస్తుందని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు. మంగళవారం నవాబ్ పేట్ మండలం చిట్టి గిద్ద గ్రామంలో రీజనల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. నవాబ్ పేట పోలీసులు అరెస్ట్ చేసిన రైతులను పరామర్శించి మేము ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజా పాలన అందిస్తున్న రేవంత్ సర్కార్ వాళ్ల భూములను లాక్కొని భూధందా చేస్తుందని ఘాటుగా విమర్శించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు సర్కార్ పేద ప్రజల 6 వేల ఎకరాల భూమిని గుంజుకొని విక్రయానికి పెట్టిందని అన్నారు. వికారాబాద్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రేవంత్ రెడ్డి లగ్గచర్ల తరహా లోనే పూడూర్ నవా బ్ పేట్ మోమిన్ పేట మండలాలలోని వివిధ గ్రామాల రైతుల భూములను బలవంతంగా భయపెట్టి సర్కార్ లాక్కోవడానికి ప్రయత్నిస్తుందని అన్నారు. బలవంతంగా తమ భూములను లాక్కోవద్దని శాంతియుతంగా నిరసన ప్రజా ప్రతినిధులకు అధికారులకు వినతి పత్రాలు ఇస్తే రైతులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో తరలిస్తారా అని ప్రశ్నించారు. రైతుల ప్రైవేట్ ప్రభుత్వ భూములను అభివృద్ధి కోసం తీసుకుంటూ వారి పైన కేసులు వేస్తే ఎలా అని ప్రశ్నించారు. రీజినల్ రింగ్ రోడ్డు అభివృద్ధి కోసం తమ పార్టీ వ్యతిరేకం కాదని రైతులను ఒప్పించి మెప్పించి భూసేకరణ చేయవలసిన అవసరం ఉందని అన్నారు. భూ సేకరణ కోసం రైతులు అడ్డువస్తున్నారని వారిని భయభ్రాంతులకు గురిచేసి బలవంతంగా భూసేకరణ చేసే ప్రయత్నం చేస్తే రైతుల పక్షాన న్యాయపోరాటం చేస్తామని వారికి మద్దతుగా నిలుస్తామని తెలియజేశారు. సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గంలో నిలగచర్లలో బలవంతంగా భూసేకరణ చేస్తే రైతులంతా ప్రతిఘటించిన విషయాన్ని గుర్తు చేశారు. అధికార బలంతో రైతులపై జులుం చేస్తే గల్లి లో ఉన్న రైతులు ఢిల్లీ దాకా వెళ్లి ఉద్యమించారని అన్నారు. అదే తరహాలో ఈ మూడు మండలాల రైతులు ప్రతిఘటించవలసిన రోజు వస్తుందని గుర్తు చేశారు. రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం ప్రణాళిక బద్ధంగా చేయాలని కోరారు. మూడు మండలాల రైతులు జేఏసీగా ఏర్పడి రాజకీయ నాయకులను సభ్యులుగా చేర్చుకొని భూ పోరాటం చేయాలని కోరారు. రైతుల జేఏసీ నాయకత్వంలో తామంతా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని రైతులకు భరోసా ఇచ్చారు. రీజనల్ రింగ్ రోడ్ కోసం భూసేకరణ విషయమై రైతులను నిర్బంధించి కేసులు వేసి జైలకు పంపించాలని ప్రయత్నిస్తే తాము ఊరుకునేది లేదని హెచ్చరించారు. రీజనల్ రింగ్ రోడ్డు అలైన్మెంట్ మార్పుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వవలసిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. కొందరి పెద్దొల్ల భూముల రక్షణ కోసమే అలైన్మెంట్ మార్చి పేదల భూములను గుంజుకుంటున్నారనే వాదన వినిపిస్తుందని దీనిపై స్పష్టత ఇవ్వవలసిన అవసరం ఉందని అన్నారు. మంత్రుల నుంచి అధికారుల వరకు రీజనల్ రింగ్ రోడ్డుపై స్పష్టత ఇవ్వాలని రైతులు పదేపదే వినతి పత్రాలు ఇస్తున్న ఎవ్వరు పట్టించుకోవడంలేదని విమర్శించారు. అధికారులు ప్రజా ప్రతినిధులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి జిల్లాలోనే రైతులపై జులుం జరుగుతుంటే అధికారులను వారించలేని స్థితిలో ఉన్నారని అన్నారు. ఫ్యూచర్ లేని సీఎం రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీని ఎలా నిర్మిస్తారని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వ హాయంలో రైతులను ప్రోత్సహించే పథకాలను అమలు చేశామని వారిని ఏనాడు ఇబ్బందులకు గురి చేయలేదని అన్నారు. అతివృష్టి వల్ల మర్పల్లిలో పంటలు నష్టపోతే ఢిల్లీలో ఉన్న తమను హైదరాబాద్ కు రప్పించి అప్పటి సీఎం కేసీఆర్ రైతులకు మేమున్నామని భరోసా ఇప్పించారని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జిల్లా నుంచి ఉన్న పాలనలో రైతులను బలవంతంగా పోలీస్ స్టేషన్లకు తరలించడం దురదృష్టకరమని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు అలైన్మెంట్ మార్పు అనివార్యమైతే దానికి గల కారణాలను రైతులకు వివరించి ఒప్పించి అలైన్మెంట్ మార్పు చేయవలసిన అవసరం ఉంటుందని బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద పటేల్ అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు భరత్ రెడ్డి దయాకర్ రెడ్డి విజయ్ శాంత కుమార్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



**మొయినాబాద్, అక్టోబర్ 7 (జనం సాక్షి) :** ఉద్యోగరిత్య పదవీ విరమణ సహజమేనని ఉపాధ్యాయ వృత్తి సమాజంలో ఎంతో గొప్పదని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని చిన్నమంగళారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేసిన ఎస్.వెంకటయ్య పదవీ విరమణ అభినందన సభను పిజిఆర్ గార్డెన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొని పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు వెంకటయ్యను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య, రాష్ట్ర పీఆర్టీయూటీఎస్ అధ్యక్షులు పుల్లం దామోదర్ రెడ్డిలు మాట్లాడుతూ.. 40 సంవత్సరాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో వెంకటయ్య చేసిన సేవలు మరచిపోలేనివన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి అంకిత భావంతో ఉపాధ్యాయ వృత్తిలో మంచిపేరు తేవడం ఆయన వ్యక్తిత్వం అన్నారు. ఉద్యోగ రిత్యా పదవీ విరమణ తప్పదని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో పదోన్నతులు త్వరలో జరగబోతున్నాయన్నారు. ఈహెచ్ఎస్ ద్వారా ఉపాధ్యాయులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1వ తేదీన ఇందిరాపార్కు వద్ద ఓపీఎస్ సాధనకు పీఆర్టీయూ ధర్నా కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్నమంగళారం మాజీ సర్పంచ్ బాలమణిరాములు, పూలగుళ్ల గోపాల్ రెడ్డి, ఆంజనేయులుగౌడ్, మల్లేష్, ఎం.ప్రభాకర్, ఉపాధ్యాయ సంఘం నాయకులు గిరిధర్ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్ రెడ్డి, ఎస్టియూ రాష్ట్ర అధ్యక్షులు సదానంద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పోచయ్య, సామాల మహేందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, రాఘవేందర్, జగన్మోహన్ గుప్తా, గోవర్ధన్ యాదవ్, నారాయణగౌడ్, మండల విద్యాధికారి మల్లయ్య, పీఆర్టీయూ మండల అధ్యక్షులు జక్కని బందయ్య, ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు హమీద్, లక్ష్మణ్, సత్యనారాయణ, రాములు, శివకుమార్, విజయాబాయ్, నరేందర్, వేణుగోపాల్, హైమావతి, శ్రీలత, నారాయణ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను ప్రారంభించిన కార్పొరేటర్ స్వర్ణరాజ్



**కాప్రా, అక్టోబర్ 7 (జనం సాక్షి) :** కాప్రా డివిజన్ ఎల్లారెడ్డిగూడా స్మశానవాటిక అభివృద్ధి పనులు ను మంగళవారం స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి ప్రారంభించారు.ఈ సందర్బంగా స్వర్ణరాజ్ శివమణి మాట్లాడుతూ– ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని , ఎల్లారెడ్డిగూడ స్మశానవాటిక అభివృద్ధి పనులకు రూ. 85లక్షల వ్యయంతో నూతన బర్నింగ్ ప్లాటుఫారంలు, వెయిటింగ్ హాల్, స్నానపు గదులు, అంతర్గత రోడ్లు, మూత్ర శాలలు, నూతన పవర్ బోర్, మొక్కలతో సుందరీకరణ వంటి పనులకు ఏర్పాటు చేయనున్నవని తెలిపారు. తాను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ డివిజన్ అభివృద్ధికై పాటుపడుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యుటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ బాలకృష్ణ , అసిస్టెంట్ ఇంజనీర్ సూరజ్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు నాగ శేషు, ఎల్లారెడ్డిగూడ గ్రామవాసులు సత్తిరెడ్డి, యం మల్లారెడ్డి, దామోదర్ రెడ్డి, విఠల్, సత్యం, బ్యాగరి నర్సింగ్ రావ్, కావలి బాలయ్య, శ్రీశైలం, రఘునందన్ రెడ్డి మేడ్చల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీ విఠల్ నాయక్, కాప్రా డివిజన్ కాంగ్రెస్ నాయకులు శ్రీధర్ రెడ్డి,ఉప్పల వినోద్ కుమార్, తోటకూర శ్రీకాంత్, మురళి, పడమటి మల్లారెడ్డి, బాబురావ్, నరేందర్ గౌడ్, తన్నీరు శ్రీహరి, రిజ్వాన్ ఖాన్, ప్రదీప్, ముత్తుజా తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతులే లక్ష్యంగా అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్
- రూ.10 కోట్లతో అభివృద్ధి పనులకు భారీ నిధులు మంజూరు



**రాజేంద్రనగర్, అక్టోబర్ 7 (జనం సాక్షి) :** రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా మంజూరైన రూ.10 కోట్ల భారీ నిధులతో అభివృద్ధి పనులు జరిపించనున్నట్లు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్ సర్కిల్-11 పరిధిలోని డివిజన్లలో అత్యవసరంగా నిర్మించాల్సిన సీసీ రోడ్ల పనుల మంజూరుకై చార్మినార్ జోనల్ కమిషనర్ ని కలిసి లేఖ ద్వారా అభివృద్ధి పనులపై వివరించానని, ఆయన అభ్యర్థన మేరకు, మైలార్‌దేవపల్లి (వార్డు-59) రాజేంద్రనగర్ (వార్డు 61) డివిజన్లతో సహా పలు ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధి పనుల కోసం జీహెచ్ఎంసీ అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ చేసిందని అన్నారు. ఈ భారీ నిధులతో ముఖ్యంగా మైనర్ రోడ్ల అభివృద్ధి, అప్గ్రేడ్ కింద సీసీ రోడ్ల నిర్మాణం మైలార్‌దేవ్పల్లి, రాజేంద్రనగర్ అత్తాపూర్ డివిజన్లలో రోడ్ల అభివృద్ధి పనులు టెండర్ ప్రక్రియలు ప్రారంభించి ప్రజల సమస్యలను తీర్చాలని ఎమ్మెల్యే మున్సిపల్ అధికారులకు ఆదేశించారు.

## త్రిబుల్ ఆర్, నిమ్జ్, టిజిఐసి భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

- రెవెన్యూ, నేషనల్ హైవే అథారిటీ, అధికారులతో కలెక్టర్ సమీక్ష
- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 7 (జనం సాక్షి) :** జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న త్రిబుల్ ఆర్, నిమ్జ్, టిజిఐసి ప్రాజెక్టులకు భసేకరణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో త్రిబుల్ ఆర్, నిమ్జ్, టిజిఐసి భూసేకరణ పనులపై రెవెన్యూ, నేషనల్ హైవే అథారిటీ, పరిశ్రమల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆయా ప్రాజెక్టులకు భూసేకరణ వేగవంతంగా చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. భూ సేకరణ వేగంగా పూర్తి చేయడమే కాకుండా తక్షణమే రైతులకు ప్రయోజనం అందేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. భూ సేకరణకు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన అవార్డు ఫైళ్లను వెంటనే ఫైనలైజ్ చేయాలని అధికారులకు ఆదేశించారు. వేరువేరు దశల్లో ఉన్న పనులను సమగ్రంగా సమీక్షించాలన్నారు. పెండింగ్ లో ఉన్న భూ సేకరణ పనులు వేగవంతంగా పూర్తి చేసి రైతులకు చెల్లించాల్సిన నగదు సకాలంలో అందించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ చర్యల ద్వారా భూసేకరణ పనులు సమర్థవంతంగా పూర్తి అవ్వడమే కాకుండా, రైతులకు తక్షణమే ప్రయోజనం కలిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి,సంగారెడ్డి ఆర్డీఓ రాజేందర్ ,నేషనల్ హైవే అథారిటీ అధికారులు, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## కుషాయిగూడ కుమ్మరిబస్తీ అభివృద్ధి పనులు ప్రారంభం



**కాప్రా, అక్టోబర్ 7 (జనం సాక్షి) :** కుషాయిగూడ కుమ్మరి బస్తిలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చొరవతో మంజూరు అభివృద్ధి పనులు రూ 12 లక్షల 50 వేలతో వరదనీటి పైప్ లైన్ నిర్మాణం పనులు సోమవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు బిఆర్ఎస్ నాయకులు కాలనీవాసులు తో కలిసి ప్రారంభించారు. బస్తీలో వర్షపు నీరు నిలవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు కుషాయిగూడ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో గతంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కుషాయిగూడ వార్డు కార్యాలయం కుమ్మరిబస్తీని సందర్శించిన క్రమంలో వరద నీటి కాలువ నిర్మాణం మధ్యలోనే ఆగిపోవడం మూలంగా నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కుటుంబాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు మహిళలు, కుషాయిడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పనగట్ల చక్రపాణి గౌడ్, యాదయ్య, చల్లవెంకటేష్, నల్లచెరువుల జనార్ధన్, కిషోర్ గౌడ్, సాయికిరణ్, నరసింహులు, నందు, పిట్ల రాజు, సాయినాథ్, చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు నేమూరి మహేష్ గౌడ్, సారా అనిల్ ముదిరాజ్, మొగిలి రాఘవరెడ్డి, జై కృష్ణ, శ్రీశైలం, దాసరి కనకయ్య, సంపత్, శేఖర్ నాయక్, వెంకటేష్, సాయిబాబ, ప్రసాద్ రెడ్డి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# కొందుర్గు మండలంలో యథేచ్ఛగా అక్రమ మట్టి దందా..

- ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న మాఫియా..
- అభివృద్ధి మాటున మట్టి తరలిస్తున్న కాంట్రాక్టర్లు
- అధికారుల మౌనంపై పలు అనుమానాలు



**కొందుర్గు, అక్టోబర్ 7 (జనంసాక్షి) :** ఎలాంటి అనుమతులు లేకుండా నియోజకవర్గంలో ఇక్కడా అక్కడా అనే తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ మట్టిని తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలంలో మట్టి దందా యథేచ్ఛగా జరగుతోంది. రాజకీయ పలుకుబడితోనే ఈ మట్టి బిజినెస్ జరుగుతున్నట్లు ప్రజలు చెబుతున్నారు. అధికార పార్టీ నేతల కనుసన్నల్లో మట్టి వ్యాపారం కోట్ల రూపాయల్లో జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రకృతి వనరులకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తి లేదు, వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని చెప్పే అధికారుల మాటలు, హెచ్చరికలు కార్యరూపం దాల్చకపోవడంతో రంగారెడ్డి జిల్లాలో యథేచ్ఛగా సహజ వనరుల ధ్వంసం జరుగుతున్నాయి అనే చెప్పవచ్చు. ఎలాంటి అనుమతులు లేకుండా మండలంలో ఇక్కడా అక్కడా అనే తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ ప్రభుత్వ భూముల్లో నుండి మట్టిని తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. కొందుర్గుతో పాటు తంగళ్లపల్లి,శ్రీరంగపూర్, ఉమ్మెంత్యాల తదితర గ్రామాల్లో కూడా అక్రమ మట్టి వ్యాపారం జోరుగా సాగుతోంది. ఓ నేత తన అనుచరులతో సయోధ్య డీల్ కుదుర్చుకుని మట్టి తరలిస్తున్నా, మైనింగ్ అధికారులు ఎవరూ ఏమీ పట్టనట్టే ఉంటున్నారు. తన రాజకీయ పలుకుబడి ఉపయోగించి అధికారుల నోర్లు మూయిస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కొందుర్గులో అక్రమ మట్టి వ్యాపారాన్ని మించి గ్రైనెట్ దందా జరుగుతున్నదని, ఆ ఖద్దరు చొక్కా నేతతో పాటు మరి కొంత మంది సిండికేట్లుగా ట్రిప్పు లెక్క ఎంతో కొంత డీల్ కుదుర్చుకుని ఈ మట్టి దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారని కొందుర్గు జనం మాట్లాడుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టే ఉంటున్నారు. ఈ అక్రమ దందాలో అధికారుల వాటా వారికి ముట్టుతన్నందునే వారు చూసీ చూడనట్టు నటిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఈ అక్రమ మట్టివ్యాపారాన్ని అరికట్టి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను మండల ప్రజలు కోరుతున్నారు.

# పత్తి రైతుకు మద్దతు ధర కొరకు స్లాట్ బుకింగ్ తప్పనిసరి




**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 7 (జనం సాక్షి) :** పత్తి రైతుకు మద్దతు ధర కొరకు స్లాట్ బుకింగ్ తప్పనిసరి అని మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు మల్లేశం పేర్కొన్నారు. మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో కపాస్ కిసాన్ యాప్ పై వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖల అధికారులకు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి రియాజ్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఈ. మల్లేశం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పత్తి రైతులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు సీసీఐ కి పత్తి విక్రయించాలంటే 'కపాస్ కిసాన్' యాప్‌లో తప్పనిసరిగా స్లాట్ బుక్ చేసుకోవాలని మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఈ. మల్లేశం అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సీజన్‌లో పత్తి కొనుగోళ్ల కోసం కొత్త "కపాస్ కిసాన్" యాప్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం ఈ ఏడాది క్వింటాలు నాణ్యమైన పత్తికి రూ. 8110 రూపాయలు మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నూతన యాప్ పై వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కపాస్ కిసాన్ యాప్‌లో వివరాల నమోదుతో సందేహాల నివృత్తి కోసం ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్ 18005995779 కేటాయించినట్లు తెలిపారు. ఈ యాప్ ను గూగుల్ ప్లే స్టోర్ నుండి డౌన్లోడ్ చేసుకోవాలని యాప్ లో రైతు పేరు, జెండర్, పుట్టిన తేదీ, ఆధార్ నంబర్, గ్రామము, రైతు పట్టాదార్ పాస్ పుస్తకం నెంబర్, పంట సాగు చేసిన సర్వే నెంబర్, విస్తీర్ణం కులము, ఫోన్ నెంబర్ తదితర వివరాలను నమోదు చేసి రైతు ఫోటోని అప్లోడ్ చేస్తే స్లాట్ బుకింగ్ తేదీ వస్తుందని ఆరోజు రైతులు తమ పత్తి పంటను సీసీఐ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తీసుకు వెళ్లాల్సి ఉంటుందని అన్నారు. పత్తి కొనుగోలులో దళారీ వ్యవస్థను నిర్మూలించి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందించడంలో కపాస్ కిసాన్ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ యాప్ పై వ్యవసాయ శాఖ మార్కెటింగ్ శాఖ సిబ్బంది తమ పరిధిలోని రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించి రైతులందరూ ఈ యాప్ లో తమ వివరాలు నమోదు చేసుకొని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జిల్లాలోని వ్యవసాయ సహాయ సంచాలకులు, మార్కెట్ కమిటీ కార్యదర్శులు, సిబ్బంది, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు పనుల ఆలస్యంపై జగ్గారెడ్డి అసహనం

- బైపాస్ రోడ్డు పనులపై ఆరా
- రోడ్డు విస్తీర్ణ పనులు వేగవంతం చేయాలి
- బైపాస్ రోడ్డు పనులను పరిశీలించిన జగ్గారెడ్డి



**సంగారెడ్డి టౌన్, అక్టోబర్ 7 (జనం సాక్షి) :** సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డు పనులను మంగళవారం తెలంగాణ పరిశ్రమల మౌలిక సదుపాయాల కల్పన చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పరిశీలించారు. రోడ్డు పనులు ఆలస్యం పై అసహనం వ్యక్తం చేశారు. పనుల జాప్యానికి కారణాలను హెచ్ఎండిఏ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు ,కరెంటు స్తంభాల వల్ల రోడ్డు పనులు జాప్యం జరుగుతుందని అన్నారు. డిప్యూటీ ఇంజినీర్ ఎలక్ట్రిసిటీ ఫారెస్ట్ అధికారులను స్వయంగా పరిశీలనకు తీసుకెళ్లి తగు సూచనలు చేసి పనులు వేగంగా చేయాలని ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని తెలిపారు. బై పాస్ రోడ్డు లో నాలుగు జంక్షన్ లు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం తో పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎండిఏ, ఏఈ వెంకన్న,ఎలక్ట్రిసిటీ ఎడిఈ లక్ష్మన్, ఆర్ అండ్ బి డిఈ రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మున్సిపల్ డి ఈ రఘు ఫారెస్ట్ అధికారులు, నియోజకవర్గ ఇంచార్జి జూలకంటి ఆంజనేయులు,సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి,నాయకులు తోపాజి అనంత కిషన్,కూన సంతోష్,షఫీ, కిరణ్ గౌడ్, మహేష్, వెంకట్రాజు, ఉదయభాస్కర్,విక్రాంత్ శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వాల్మీకి మహర్షి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 7 (జనం సాక్షి) :** రామాయణ గ్రంధాన్ని రచించి లోకానికి పరిచయం చేసిన మహనీయుడు వాల్మీకి మహర్షి జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ముఖ్య అతిథిగా హాజరై, మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రచించిన రామాయణం, భారత సాంస్కృతిక వారసత్వానికి ఆధారం అయిందని పేర్కొన్నారు. మహర్షి వాల్మీకి రామాయణంలో సకల సద్గుణాలతో సీతారాముల జీవితాన్ని వర్ణించడం జరిగిందన్నారు. సనాతన భారతీయ గ్రంథాల్లో రామాయణం మనిషి నైతిక విలువలతో జీవించడానికి దోహదపడుతుందని కొనియాడారు. ఇంత గొప్ప గ్రంధాన్ని రచించిన మహర్షి వాల్మీకి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం గర్వకారణమన్నారు. యువత వాల్మీకి రామాయణంలోని విలువలను ఆచరణలో పెట్టితే సమాజం మరింత అభివృద్ధి దిశగా సాగుతుందని అన్నారు. జిల్లా నలుమూలల వాల్మీకి జయంతిని ప్రజలందరూ నిర్వహించుకోవడంతో పండుగ వాతావరణం నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ హెచ్ సెక్షన్ సూపరెంటెండెంట్ విజయలక్ష్మి , బి సి వెల్ ఫేర్ సహాయ సంక్షేమ అధికారిణి డి ఓ అమరజ్యోతి , వివిధ శాఖల అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీలో రాణిస్తున్న రఘుపతి పేట క్రీడా కుసుమాలు

- జాతీయ అత్యపత్య క్రీడల్లో తెలంగాణ ప్రతినిధులుగా యామిని, పావని





**కల్వకుర్తి, అక్టోబర్ 7 (జనం సాక్షి) :** మండలంలోని రఘుపతిపేట్ జడ్పిహెచ్ఎస్ విద్యార్థినిలు పావని, యామిని తమ ప్రతిభతో మరోసారి రఘుపతిపేట్ పేరును జాతీయ స్థాయిలో వెలుగులోనికి తీసుకొచ్చారు. రాష్ట్ర స్థాయి అత్యపత్య పోటీల్లో సత్తా చాటి జాతీయ స్థాయిలో తెలంగాణ తరపున ప్రాతినిధ్యం వహించనున్నారని పాఠశాల హెచ్ఎం ఎస్. అంజయ్య, ఫిజికల్ డైరెక్టర్ పోలే అంజయ్య వర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 9 నుంచి 12 వరకు కర్ణాటక రాష్ట్రంలోని చందార్గీ పట్టణంలో జరగనున్న సీనియర్ అత్యపత్య జాతీయ స్థాయి క్రీడల్లో వీరిద్దరూ పాల్గొనబోతున్నారు. గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల వరకు ప్రతిభ కనబరిచిన పావని, యామిని, తమ కష్టపడి సాధనతో ఈ స్థాయికి చేరుకున్నారని వారు పేర్కొన్నారు. క్రీడాకారునిలు యామిని, పావని లతో రఘుపతిపేట్ జడ్పిహెచ్ఎస్ పాఠశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కిందని ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థినిల కృషి, క్రమశిక్షణ, క్రీడాపట్ల అంకితభావం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు రామకృష్ణ, షకీల్ అహ్మద్, భాస్కర్, మల్లయ్య, విజ్జి, తిరుపతయ్య, జయశ్రీబాయి, శ్రీనివాస చారి, సుభాష్ రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయి పోటీలో రాణిస్తున్న తమ గ్రామ క్రీడాకారుల పట్ల గ్రామస్థులు, తల్లిదండ్రులు, సహ విద్యార్థులు కూడా పావని, యామిని విజయంపై ఆనందం వ్యక్తం చేస్తూ జాతీయ స్థాయిలో కూడా మెరుగైన ఫలితాలు సాధించి తెలంగాణకు గౌరవం తెచ్చిపెట్టాలి అంటూ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థినిలకు ఘన స్వాగతం లభించగా వారిని గౌరవిస్తూ పూలమాలలు వేసి ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ మాకు నిరంతరం మార్గదర్శకత్వం అందించిన మా ఉపాధ్యాయులందరికీ ధన్యవాదాలు. జాతీయ స్థాయిలోనూ మా పాఠశాల పేరును గర్వంగా నిలబెడతాం అన్నారు.

# కొత్త రిజర్వాయర్ల ఏర్పాటుపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి

- ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డితో ప్రత్యేక సమావేశం
- గొల్లపల్లి రిజర్వాయర్ ఏర్పాటు
- బుద్ధారం స్టేజ్ 2 రిజర్వాయర్
- ఘనపసముద్రం రిజర్వాయర్ ల్యాండ్ ఎక్వేషన్ నిధుల
- మంజూరు గురించి చర్చించిన ఎమ్మెల్యే



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 7 (జనంసాక్షి) :** వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే వనపర్తి నియోజకవర్గ పరిధిలో నిర్మాణం చేపట్టబోయే పలు రిజర్వాయర్ లపై సుదీర్ఘంగా చర్చించారు.నూతనంగా నిర్మించబోయే గొల్లపల్లి రిజర్వాయర్, బుద్ధారం స్టేజ్ 2 రిజర్వాయర్ నిర్మాణాలను చేపడితే నియోజకవర్గం పరిధిలో భవిష్యత్ తరాలకు సైతం సాగునీటి ఎద్దడి ఉండదని ఎమ్మెల్యే అభ్యర్థించారు.ఇందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.అదేవిధంగా ఖిల్లా ఘనపురం మండలంలోని ఘనపసముద్రం రిజర్వాయర్ ఏర్పాటు లో భూములు కోల్పోయిన అన్నదాతలకు వెంటనే నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ముఖ్యమంత్రి కోరడంతో స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే రైతులకు నష్టపరిహారం మంజూరు చేయనున్నట్లు తెలిపారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.వనపర్తి అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## హత్య కేసులో నిందితునికి జీవిత ఖైదు

- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 7 (జనం సాక్షి) :** హత్య కేసులో నిందితునిగా ఉన్న వ్యక్తికి జీవిత ఖైదు శిక్ష విధించడం జరిగిందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. మంగళవారం కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ వివరించారు... సంగారెడ్డి జిల్లా సదాశివపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న హత్య కేసులో నిందితుడైన పెద్దగొల్ల బీరప్ప కు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జి.భవానీచంద్ర తీర్పు ఇచ్చారని తెలిపారు. జరిమానా చెల్లించని యెడల 3 రోజుల సాధారణ జైలు శిక్ష విధించాలని ఆదేశించారు. కేసు వివరాలలోనికి వెళ్లితే.... నిందితుడు పెద్దగొల్ల బీరప్ప కుటుంబ కలహాలతో భార్యను వదిలి సదాశివపేటలో కూలి పని చేసుకొని జీవిస్తున్నాడు. ట్రాక్టర్ బ్యాటరీ దొంగతనం విషయంలో మృతుడు పాపయ్య, మరి కొందరు తనను తిట్టి, అవమానించగా, పాపయ్య తనపై మూత్రం వేశాడని మనుసులో ఉంచుకొని, తనను అవమానించిన పాపయ్యను చంపాలని నిర్ణయించుకొని, తేది: 05-08-2021 నాటి రాత్రి తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో సదాశివపేట పట్టణంలోని లక్ష్మీ కాంప్లెక్స్ వద్ద నిద్రలో ఉన్న పాపయ్యను ఒక పెద్దరాయితో తలకు మూడు సార్లు బలంగా కొట్టి హత్య చేశాడన్నారు. పెద్దగొల్ల సుభాష్ తన తండ్రిని చంపిన పెద్దగొల్ల బీరప్ప పై చట్టరిత్యా తగు చర్య తీసుకోవలసిందిగా సదాశివపేట పోలీస్ స్టేషన్లో దరఖాస్తు చేయగా అప్పటి యస్.హెచ్.ఒ సంతోష్ కుమార్ ఇన్స్పెక్టర్ కేసు నమోదు చేసి, ఇన్వెస్టిగేషన్ అనంతరం న్యాయ స్థానంలో చార్జ్ షీట్ దాఖలు చేయగా, కేసు పూర్వపరాలను విన్న ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జి.భవానీచంద్ర నిందితునికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. నిందితుని వివరాలు.... సదాశివపేట మండలంలోని నిజాంపూర్ పంచాయతీ పరిధిలోని తిమ్మన్న గూడెం గ్రామానికి చెందిన పెద్దగొల్ల బీరప్ప శిక్ష విధించినట్లు తెలిపారు. నిందితునికి శిక్షపడేలా కృషి చేసిన అధికారులు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ, అప్పటి యస్.హెచ్.ఒ., ఇన్వెస్టిగేషన్ అధికారి, సంతోష్ కుమార్ ఇన్స్పెక్టర్, ప్రస్తుత యస్.హెచ్.ఒ. వెంకటేశ్ ఇన్స్పెక్టర్, కోర్ట్ డ్యూటీ కానిస్టేబుల్స్ రవీందర్, కోర్ట్ లైజనింగ్ అధికారి రాజశేఖర్, కె. సత్యనారాయణ ఎస్ఐ. లను ఎస్పీ అభినందించారు.

## ఫర్టిలైజర్ గోదాంను సీజ్ చేసిన వ్యవసాయ అధికారి



**అచ్చంపేట, అక్టోబర్ 7 (జనం సాక్షి) :** యూరియా అధిక ధరలకు విక్రయించబడుతున్నట్లు రైతుల నుండి ఫిర్యాదు అందడంతో పాటు, ఈ విషయం పై పత్రికల్లో వార్తలు ప్రచురించబడిన నేపథ్యంగా మండల వ్యవసాయ అధికారి శ్రీ కృష్ణయ్య గారు సవివరమైన విచారణ నిర్వహించారు. విచారణ అనంతరం తుది నివేదికను ఎరువుల లైసెన్సింగ్ అథారిటీకి సమర్పించారు. నివేదిక ఆధారంగా ఎరువుల లైసెన్సింగ్ అథారిటీ అయిన వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీ చంద్రశేఖర్ గారు, సంబంధిత డీలర్‌పై తదుపరి ఆదేశాలు వచ్చే వరకు లైసెన్స్ రద్దు ఆర్డర్ జారీ చేశారు. లైసెన్స్ తాత్కాలికంగా రద్దు చేయడం జరిగినది అనంతరం మండల వ్యవసాయ అధికారి శ్రీ కృష్ణయ్య స్వయంగా డీలర్ షాప్ పరిశీలించి, గోడౌన్‌లో ఉన్న మొత్తం ఎరువుల నిల్వలను సీజ్ చేయడం జరిగింది. రైతుల ప్రయోజనాలను కాపాడటానికి ఎరువుల అధిక ధరల విక్రయం మరియు అక్రమ బిల్లుల జారీ వంటి చర్యలపై వ్యవసాయ శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని అధికారులు తెలిపారు.

## ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..

- 15 సంవత్సరాలుగా రోడ్డు లేక అవస్థలు
- హనుమాన్ నగర్ కాలనీవాసుల ఆందోళన

**సదాశివపేట, అక్టోబర్ 7 (జనం సాక్షి) :** గుంతల రోడ్డులో ప్రయాణం చేసి ప్రాణాలు పోతున్న పట్టించుకోరా అని హనుమాన్‌నగర్ కాలనీవాసులు ఆందోళనకు దిగారు. మంగళవారం సదాశివపేట పట్టణంలో హనుమాన్ నగర్ కాలనీ రోడ్డు నిర్మించాలని కోరుతూ కాలనీవాసులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుండి రోడ్డు లేక కాలనీలోకి వెళ్లే మట్టి రోడ్డు గుంతల మయంగా ఏర్పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. రోడ్డుపై వెళ్తూ వాహనాలపై నుండి కింద పడి చేతులు కాళ్లు విరగడమే కాకుండా ప్రాణాలు పోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులు రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో పలుమార్లు అధికారులకు, స్థానిక నాయకులకు విన్నవించిన పట్టించుకోవడం లేదన్నారు. ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కాలనీ వాసులతో మాట్లాడారు. అనంతరం కాలనీవాసులు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ మేనేజర్ ఉమేందర్ సింగ్ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.



## బ్యాంకర్లు నిర్దేశించిన రుణ లక్ష్యాలను సాధించాలి



**మెదక్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 7 (జనం సాక్షి) :** ప్రభుత్వ, ప్రైవేటుబ్యాంకర్లు నిర్దేశించిన రుణా లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ వివిధ బ్యాంకు అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా బ్యాంక్ అధికారులతో గూగుల్ మిట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ మెదక్ జిల్లా అంటేనే వ్యవసాయ ఆధారిత జిల్లా అని, ఈ సంవత్సరం అధిక మొత్తం కంటే ఎక్కువగా వర్షాలు పడడం వల్ల ఖరీఫ్- రబి సీజన్లో సమృద్ధిగా పంటలు పండే అవకాశం ఉందన్నారు. డిసెంబర్ మాసం కల్లా 80 శాతం రుణ లక్ష్యాలను సాధించాలన్నారు. ప్రజా అవసరాల కోసం ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు ప్రతి బ్రాంచ్ ను,ప్రతి సెక్టార్ ను టార్గెట్ గా చేసుకొని నిర్దేశించిన రుణాల లక్ష్యాలను సాధించాలన్నారు. వ్యవసాయ ,పారిశ్రామిక, స్వయం సహాయక ,ముద్ర, ఎమ్మెస్ ఎంఈ, సూక్ష్మ, చిన్న ,మీడియం ఎంటర్ప్రైజెస్, ల నిర్దేశించిన రుణాలను ఆర్బీఐ నిబంధనల మేరకు, ప్రజా అవసరాల కొరకు అందించాలన్నారు. బ్రాంచ్ ల వారీగా బ్యాంక్ మేనేజర్లతో మాట్లాడి నిర్దేశించిన రుణాల లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ డిఆర్డిఏ శ్రీనివాసరావు, బ్యాంక్ అధికారులు మేనేజర్లు పాల్గొన్నారు.

# మతోన్మాద దాడులను తిప్పికొడదాం

- దళిత ప్రజా సంఘాలు



**మక్తల్, అక్టోబర్ 7 (జనంసాక్షి) :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ పై సనాతన దుర్మార్గుడు రాకేష్ కిషోర్ కోర్టు హాలులో న్యాయవాదులందరూ చూస్తుండగానే దాడికి పూనుకున్న అత్యంత హేయమైన దుర్మార్గమైన చర్యను ఖండిస్తూ దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భారత రాష్ట్రపతి కి మక్తల్ మండల్ తహసీల్దారు ద్వారా వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మతోన్మాది, సనాతన దుర్మార్గుడు న్యాయవాది ముసుగులో రాజ్యాంగబద్ధమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయి పై చేసిన దాడినీ స్వతంత్ర న్యాయ వ్యవస్థపై, మన భారత రాజ్యాంగం, దళిత ప్రధాన న్యాయమూర్తి పై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు. ఇటువంటి సనాతన దుర్మార్గ న్యాయవాది రాకేష్ కిషోర్ ను వెంటనే అరెస్టు చేసి, దేశద్రోహం కేసులను నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అతడి లైసెన్స్ని శాశ్వతంగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశ అత్యున్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తికే రక్షణ లేకుంటే దేశంలోని సామాన్యుల పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మనువాద బిజెపి ప్రభుత్వాన్ని, సనాతన వాద దుర్మార్గ శక్తులను ప్రజలు, ప్రజాస్వామికవాదులు ఇప్పటికైనా ఎదుర్కోకపోతే ప్రజాస్వామ్యానికి, భారత రాజ్యాంగానికి, భారతదేశ ప్రజలకు భవిష్యత్తు ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పృథ్వీరాజ్, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా నాయకులు విజయ్ కుమార్, అంబేద్కర్ యువజన సంఘం మాజీ అధ్యక్షులు పరంధాములు టీచర్, డీఎస్పీ నాయకులు తిమ్మరాజు, ఆర్టీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ గొల్లపల్లి, అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షులు వెంకటేష్, సహాయ కార్యదర్శి రవికుమార్, కోశాధికారి త్రిమూర్తి, నాయకులు పళ్ళ రాజేష్, తల్వార్ నరేష్, శ్రీహరి బ్యాగరి, రవికుమార్, జగ్గలి రమేష్, కర్రెమ్ సురేష్, సందీప్, నాగేష్ గోలపల్లి, ఎల్ల లింగప్ప, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ ప్రాయుడు వాల్మీకి మహర్షి

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 7 (జనంసాక్షి) :** వాల్మీకి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆయన ఆదర్శ ప్రాయుడు అని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. వాల్మీకి మహర్షి జీవితం, బోధనలను గౌరవించడానికి వాల్మీకి జయంతిని నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. రామాయణం రచించిన ఆదికవి మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ లో అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రత్నాకరుడి నుంచి మహర్షి వాల్మీకిగా ఆయన పరివర్తన, వ్యక్తిగత వృద్ధి, విముక్తిని సూచిస్తుందని, ఆయన రామాయణాన్ని సృష్టించిన గొప్ప ఋషి అని కొనియాడారు. వాల్మీకి సంస్కృత సాహిత్యంలో పేరెన్నికగల కవి అన్నారు. రామాయణాన్ని రాసిన ఆయనను సంస్కృతభాషకు ఆదికవిగా గుర్తిస్తారన్నారు. కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు అని వాల్మీకి జీవిత చరిత్ర చెబుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సంచిత్ గాంగ్వర్, శ్రీను, ఎస్. డీ. సీ రాజేందర్ గౌడ్, డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ్ ప్రణీత్, కలెక్టరేట్ ఏ వో జయసుధ, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఖలీల్, డీపీఆర్వో ఎం. ఏ. రషీద్, సీపీవో యోగానంద్, వసతి గృహ వార్డెన్లు, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నివేదికను

# ప్రభుత్వానికి అందిస్తా

- వ్యవసాయ శాఖ చీఫ్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్




**కొమురం భీమ్ ఆసిఫా జిల్లా బ్యూరో అక్టోబర్ 7 (జనం సాక్షి) :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రాణహితుచేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. మంగళవారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గంలోని తుమ్మిడి హీట్టి వద్దగల ప్రాణహిత ,చేవెళ్ల ప్రాజెక్టు నిర్మించే స్థలాన్ని ఆయన సందర్శించారు.2007 లో అప్పటి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఈ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన నివేదిక ఆధారంగా ప్రభుత్వానికి పూర్తి వివరాలు అందిస్తున్నట్లు వివరించారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం రు.38 వేల కోట్లతో నిర్మించే ఈ ప్రాజెక్టు కింద 16.40 లక్షల ఎకరాలకు సాగునీరం అందించే ఉద్దేశంతో ప్రాజెక్టుకు అప్పట్లో రూపకల్పన చేశారు. నియోజవర్గంలోని బెజ్జూర్, కౌటాల, చింతలమానపల్లి, బెల్లంపల్లి, వేమనపల్లి మండలాల్లో కాలం నిర్మాణం కోసం తవ్వకాలు సైతం జరిపారు. ఇందుకోసం కోసం 9వేల కోట్ల పైచిలుకు నిర్మాణ పనులు సైతం జరిగినట్లు తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం చేపట్టే తుమ్మిడి హెట్టి వద్ద నీటి సామర్థ్యం, గ్రావిటీ ద్వారా ఇకనుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టు, అనంతరం హైదరాబాద్ జంట నగరాలకు సైతం సాగునీరు తాగునీరు అందించేందుకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నాయకులు చీఫ్ సెక్రటరీ ప ప్రశాంత్ జీవన్ పాటిల్ కు ప్రాజెక్టు నిర్మాణాన్ని త్వరగా ప్రారంభించి, పూర్తిచేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ చీఫ్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్ వెంట నీటిపారుదల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నిషేధిత మావోయిస్టు పార్టీ

# డివిజన్ కమిటీ కార్యదర్శి రూబెన్ లొంగుబాటు

- వివరాలు వెల్లడించిన వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 07 (జనంసాక్షి) :** నిషేదిత సిపిఐ మావోయిస్టు పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి,సౌత్ బస్తర్,డివిజనల్ కమిటీ సభ్యుడు, దండాకారుణ్య స్పెషల్ జోనల్ కమిటీ కి చెందిన మంద రూబెన్, అలియాస్ కన్నన్న అలియాస్ మంగన్న అలియాస్ సురేష్(67) వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఎదుట మంగళవారం లొంగిపోయాడు.ఈ లొంగుబాటుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ వివరాలు వెల్లడిస్తూ హన్మకొండ జిల్లా,హసన్ పర్తి మండలం,వంగపాడు గ్రామానికి చెందిన మంద రూబెన్, అలియాస్ కన్నన్న అలియాస్ మంగన్న అలియాస్ సురేష్ 1979 సంవత్సరంలో కాజీపేటలోని ఆర్. ఈ.సిలో హాస్టల్ మెస్ విభాగంలో పనిచేస్తున్న సమయంలో రాడికల్స్ యూనియన్స్ నిర్వహించే సంస్కృతిక కార్యక్రమాలకు ఆకర్షితుడై మావోయిస్టు పార్టీమాజీ ప్రధాన కార్యదర్శి,ఒకప్పటి ఆర్. ఈ.సి పూర్వ విద్యార్థి నంబాల కేశవరావు పిలుపు నందుకొని మావోయిస్టు పార్టీ లో చేరి అజ్ఞతంలోని వెళ్ళిపోయాడు. 1981సంవత్సరం నుండి 1986 వరకు నేషనల్ పార్క్ దళ కమాండర్ లంక పాపిరెడ్డి నాయకత్వం దళ సభ్యుడుగా కుంట, బస్టర్ ప్రాంతాల్లో పనిచేసాడు.1987లో మావోయిస్టు పార్టీ నాయకత్వం రూబెన్ ను ఏరియా కమిటీ సభ్యుడిగా అప్పగించడం జరిగింది.1991లో అనారోగ్యం కారణంగా చికిత్స కోసం కొత్తగుడెం కు వెళుతున్న సమయంలో చత్తీస్గఢ్ పోలీసులు అరెస్ట్ చేసి జగదల్పూర్ జైలు తరలించగా,ఒక సంవత్సరం అనంతరం రూబెన్ మరో ముగ్గురు ఖైదీలతో కలసి జైలు నుండి తప్పించుకున్నాడు. 1992 లో జైలు తప్పించుకున్న రూబెన్ తిరిగి మావోయిస్టు పార్టీ లో కలిసి ఏరియా కమిటీ సభ్యుడిగా కుంట, అబుజ్ మడ్ ప్రాంతాల్లో 1999 వరకు పనిచేసాడు. ఇదే సంవత్సరంలో సెంట్రల్ కమిటీ సభ్యుడు రావుల శ్రీనివాస్ ఏరామన్న గోపన్న నేతృత్వంలో బీజాపూర్ జిల్లా, గుండ్రాయి గ్రామానికి చెందిన పొడియం భీమే తో రూబెన్ కు వివాహం జరిపించారు. 2005 సంవత్సరం డివిజన్ కమిటీ సభ్యుడి పనిచేస్తున్న సమయంలో అనారోగ్యం కారణంగా పార్టీ ఆదేశాలతో రూబెన్ గుండ్రాయి గ్రామంలోనే భార్య, పిల్లలతో నివాసం వుంటూ, కోళ్ళు, గొర్రెలు ఫారాలు నిర్వహిస్తూనే స్థానిక గ్రామ కమిటీలతో కలసి చురుకుగా పని చేసే వాడు. ఇదే సమయంలో మావోయిస్టు పార్టీ నాయకులతో పాటు దళ సభ్యులకు షెల్టర్, భోజన వసతులను కల్పిస్తూనే పోలీసుల కదలికలను గమనిస్తూ మావోయిస్టులకు సమాచారం అందిస్తూ మావోయిస్టు పని చేసేవాడు. అనారోగ్యం బాధపడుతున్న రూబెన్, ఉద్యమంలో పాల్గోడంలో శరీరం సహకరించకపోవడం.ముఖ్యంగా మావోయిస్టు సిద్దాంతాలకు కాలం చెల్లిపోవడం, ప్రజలకు మావోయిస్టులపై వ్యతిరేకత రావడంతో పాటు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న పురావాస పథకాల ద్వారా ప్రశాంతవంతమైన వాతావరణంలో తన కుటుంబ సభ్యులతో జీవించాలని, నిర్ణయించుకొని పోలీసుల ఎదుట రూబెన్ లొంగిపోవడం జరిగిందని సీపీ తెలియజేశారు. రూబెన్ పై 8లక్షల రూపాయల రివార్డ్ వుందని పోలీస్ కమిషనర్ వెల్లడించారు.

### రూబెన్ పాల్పడిన నేరాల వివరాలు

కుంట దళ సభ్యుడిగా పనిచేసే సమయంలో పెద్ద కెడు వాల్,పండోడు,పిడిమాల్,బండారిపాడు గ్రామాలకు చెందిన గ్రామస్తులను దళ సభ్యులతో కలసి హత్యలు చేయడంతో పాటు,ఎలమకొండా గ్రామ సర్పంచ్ ను హత్య చేసిన సంఘటనల్లో నిందితుడు. 1988లో గొల్లపల్లి-మారాయి గూడ మార్గం లో పోలీసుల కాన్వాయి పై మావోయిస్టుల కలసి 20 మంది సి. ఆర్. పి. ఎఫ్ పోలీసులను దారుణంగా హత్య చేసి వారి ఆయుధాలను పట్టుకొని పోయిన సంఘటనలో నిందితుడు. 1990లో సెంట్రల్ కమిటీ సభ్యుడు గోపన్నతో కలసి తుర్లపాడు పోలీస్ స్టేషన్ పై దాడి చేసిన ఘటన లో రూబెన్ నిందితుడు.

## ఆధునిక సాంకేతిక వృత్తి విద్యను

# సద్వినియోగం చేసుకోవాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 7 (జనంసాక్షి) :** ప్రభుత్వం అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా విద్యార్థులకు అందిస్తున్న అధునాతన సాంకేతిక వృత్తి విద్యను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని జన్నారం మండల కేంద్రంలో గల అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్ ను ఆకస్మికంగా సందర్శించి రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సాంకేతిక వృత్తి విద్య కోర్సులను సద్వినియోగం చేసుకొని అభ్యర్థులు స్వయం ఉపాధి పొందాలని తెలిపారు. నేటి పోటీ ప్రపంచానికి అనుగుణంగా ఈ కేంద్రాలలో వృత్తి విద్య కోర్సులను అందించడం జరుగుతుందని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి ఇంటర్మీడియట్ కొరకు అదనంగా నిర్మిస్తున్న గదుల నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ విద్య సంస్థలను బలోపేతం చేస్తూ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడంతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామంలో గల రామ్ లక్ష్మణ్ రైస్ మిల్లును సందర్శించి రైస్ మిల్లుకు కేటాయించిన సి.ఎం.ఆర్. లక్ష్యాల పురోగతిని పరిశీలించారు. రైస్ మిల్లులకు కేటాయించిన సి.ఎం.ఆర్. లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని, సంబంధిత శాఖల అధికారులు రైస్ మిల్లుల నిర్వాహకుల సమన్వయంతో లక్ష్యసాధనకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందివ్వాలి

- ఎన్‌పిడిసిఎల్ సీఎండీ కే.వరుణ్ రెడ్డి




**నిర్మల్ రూరల్, అక్టోబర్ 7 (జనంసాక్షి) :** ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించాలని తెలంగాణ ఎన్‌పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో విద్యుత్ శాఖ అధికారులతో ఆ శాఖపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వరుణ్ రెడ్డి జిల్లాలో విద్యుత్ వినియోగంపై వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో కొత్త విద్యుత్ ఉపకేంద్రాలు, విద్యుత్ లైన్లు అవసరముంటే వెంటనే తమకు ప్రతిపాదనలు పంపాలని తెలిపారు.అటవీ ప్రాంతాల్లో నూతన విద్యుత్ కేంద్రాల నిర్మాణం,విద్యుత్ స్థంబాల స్థాపన,తదితర నిర్మాణాల విషయంలో అటవీ అనుమతులు వీలైనంత త్వరగా రతీసుకోవాలన్నారు. అటవీ అధికారులతో సమన్వయ పరుచుకోవాలని సూచించారు. నిర్మాణాలకు సంబంధించి వ్యయ అంచనాలు సిద్ధం చేసి నివేదికలు పంపాలన్నారు. నిర్మాణాలకు అవసరమైన స్థల సేకరణ వేగవంతంగా పూర్తి చేసుకోవాలని తెలిపారు. అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని, రైతాంగానికి, గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ఉండేలా ఇప్పటి నుంచే ప్రాణాలకలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. పంట కోతలు పూర్తవ్వగానే అవసరమైన చోట పంట పొలాల్లో నూతన విద్యుత్ లైన్లు,మరమత్తులు చేపట్టాలన్నారు. ప్రజలకు, రైతాంగానికి అనవసర కోతలు లేకుండా, నాణ్యమైన విద్యుత్ అందించాల న్నారు. విద్యుత్ మరమ్మత్తులు, విధులు నిర్వహించే సిబ్బంది తప్పనిసరిగా భద్రతా పరికరాలు ధరించాలని తెలిపారు.ఈ సమావేశంలో విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.



## గూడెం చెక్‌పోస్ట్ వద్ద ఆవుల అక్రమ రవాణా

**చింతలమానేపల్లి, అక్టోబర్7 (జనంసాక్షి) :** మండలంలోని గూడెం చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు ఆవులను అక్రమంగా తరలిస్తున్న ఐచర్ వ్యాన్‌ను అదుపులోకి తీసుకున్నారు పోలీసు సిబ్బంది మహారాష్ట్ర నుండి ఆవులను రవాణా చేస్తున్న షకీల్(చంద్రయానగుట్ట), డ్రైవర్ ఇర్ఫాన్‌లను పోలీసులు పట్టుకున్నారు. వ్యాన్‌ను స్టేషన్‌కు తరలించి తనిఖీ చేసినప్పుడు మొత్తం 27 ఆవులు ఉండగా, అందులో ఒక ఆవు మృతదేహంగా కనపడింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ రూరల్, అక్టోబర్ 7 (జనంసాక్షి) :** బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారుల ఆదేశించారు.మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లాలో అమలు చేస్తున్న బాలశక్తి కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ,మొదటి దశలో భాగంగా జిల్లాలోని కేజీబీవీలలో విజయవంతంగా బాలశక్తి కార్యక్రమాన్ని అమలుపరిచామని తెలిపారు.అదేవిధంగా జెడ్పీ పాఠశాలల్లో రెండో దశలో భాగంగా బాలశక్తి కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు.ఇందులో భాగంగా ఇప్పటివరకు పూర్తి చేసిన వైద్య పరీక్షల వివరాలు మండలాల వారిగా సమీక్షించారు. విద్యార్థులందరికీ రక్తహీనత,థైరాయిడ్, పోషక లోపాల గుర్తింపు, తదితర వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు.విద్యార్థుల్లో లోపాలు గుర్తిస్తే, వారికి ప్రత్యేక పోషక ఆహారంతో పాటుగా అవసరమగు మందులను అందివ్వాలని తెలిపారు.ఎప్పటికప్పుడు వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తూ,వారి ఆరోగ్య స్థితిగతుల్లో మార్పు వస్తుందో,లేదో చూడాలన్నారు. అన్ని వివరాలు వారి హెల్త్ కార్డుల్లో నమోదు చేస్తూ ఉండాలన్నారు.విద్యార్థుల పోషకులతో సమావేశాలు నిర్వహించినప్పుడు వారి ఆరోగ్య విషయాలు పోషకులకు వివరించాలన్నారు. విద్యార్థులకు ప్రభుత్వ కార్యాలయాల పనితీరు, సామాజిక అంశాలపై విద్యార్థులకు అన్ని వివరాలు తెలిసేలాగా ప్రభుత్వ కార్యాలయాలకు, వైజ్ఞానిక యాత్రలకు తీసుకెళ్లాలని తెలిపారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,డీఈఓ భోజన్న,డిఆర్డివో విజయలక్ష్మి,డీఎంహెచ్ఓ రాజేందర్, ఎల్డీఎం రామ్ గోపాల్,ఇతర అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# పక్కాగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలి

- ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు శిక్షణ
- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 07(జనంసాక్షి) :** జిల్లాలో పండించిన ప్రతి నాణ్యమైన గింజను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పక్కాగా కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మంగళవారం ఏటూరునాగారం రైతు వేదికలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, వాజేడు, వెంకటాపురం, తాడ్వాయి, గోవిందరావుపేట పరిధిలోని వివిధ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు నిర్వహించిన శిక్షణ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఖరీఫ్ (వానకాలం) ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం కట్టుదిట్టంగా జరగాలని, జిల్లాలో దాదాపు 1.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా 175 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం పరిధిలో ఉన్న రైతుల వివరాలు, రైతులు సాగు చేసిన భూ విస్తీర్ణం వివరాలు, వచ్చే పంట దిగుబడి వివరాలు ముందస్తుగా తెలుసుకోవాలని, షెడ్యూల్ ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకుని వచ్చే విధంగా చూడాలని కలెక్టర్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా పూర్తిస్థాయిలో 175 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకొని 17 కంటే తక్కువ తేమ శాతంతో కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావాలని, రైతుల ధాన్యం నాణ్యతను వ్యవసాయ విస్తరణ అధికారులు పరిశీలించి ధ్రువీకరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో అవసరమైన మేర ప్యాడి క్లీనర్ లను ఏర్పాటు చేశామని, ధాన్యాన్ని తప్పనిసరిగా ప్యాడి క్లీనర్లతో శుభ్రం చేసిన తర్వాత మాత్రమే కొనుగోలు చేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ట్రక్ షీట్ అందించాలని, రైస్ మిల్లుల వద్ద ఎటువంటి కటింగ్ విధించడానికి వీలులేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో డిజిటల్ వేయింగ్ యంత్రాలను మాత్రమే వినియోగిస్తున్నామని, వాటి పనితీరును జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి తనిఖీ చేయాలని కలెక్టర్ సూచించారు. సమస్య ఏదైనా ఏర్పడితే వెంటనే ఎలక్ట్రిషియన్ అందు బాటులో ఉండే విధంగా చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. వానకాలం ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎక్కడ, ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని, జిల్లా లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులతో వాట్సప్ గ్రూపులు తయారు చేశామని, కొనుగోలు ప్రక్రియలో ఉత్పన్నమయ్యే సమస్యలను ఎప్పటి కప్పుడు తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. మొదటి రోజు నుంచి నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్డీఓ శ్రీనివాస్ రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి షా ఫైజల్ హుస్సేని, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ రాం పతి, జిల్లా సహకార అధికారి సర్దార్ సింగ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చెయ్యాలి


- స్థానిక ఎన్నికలల్లో సత్తా చాటాలి : మంత్రి సీతక్క



**గంగారం అక్టోబర్ 5 (జనం సాక్షి) :** అభివృద్ధి, సంక్షేమమే ఈ అభ్యర్థుల గెలుపు లక్ష్యం.ప్రజాసేవలో అంకితభావం అభ్యర్థిలను గెలిపించుకుందాం.ఈసీ ఇచ్చిన రిజర్వేషన్లపై మాపై నిందలు వేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు. గంగారం మండలం సమగ్రాభివృద్ధి దిశగా పయనిస్తోంది.గంగారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి విస్తృత సమావేశ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రివర్యులు ధనసరి అనసూయ సీతక్క ఈ సందర్భముగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికలల్లో గెలుపు లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలి, అభివృద్ధి సంక్షేమమే ఈ అభ్యర్థుల గెలుపు లక్ష్యం, ప్రజాసేవలో అంకితభావం ఉన్న అభ్యర్థులను గెలిపించుకుందాం అదేవిధంగా ఈసీ ఇచ్చిన రిజర్వేషన్లపై మాపై నిందలు వేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులపై అసహనం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు నిత్యం అసత్య ప్రచారాలు చేస్తూ విషం కక్కుతున్నారు. గంగారం మండలం నుండి కామరాం వరకు డబల్ రోడ్డు పనులు ప్రారంభించామని , గ్రామ గ్రామన సిసి రోడ్లు, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణ రుణాలు వేల కోట్ల నిధులు, మేడారం కు 150 కోట్లు, మండలంలో బ్రిడ్జిల నిర్మాణానికి 8 కోట్లు, కొత్త రేషన్ కార్డులు, 50వేల పైగా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉచిత బస్సు, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ అభివృద్ధి దిశగా పరుగెత్తుతుందని అన్నారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన గత ప్రభుత్వం ప్రజలకు ఇప్పటికి బాకీ పడ్డారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు జాడి వెంకటేశ్వర్లు, కొత్తగూడెం మండల అధ్యక్షులు వద్ద సారన్న, గ్రామీణ ఉపాధి హామీ స్టేట్ డైరెక్టర్ చల్ల నారాయణ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరబోయిన మొగిలి, అదేవిధంగా రాష్ట్ర,జిల్లా,మండల,గ్రామ నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, యూత్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

- కేఎంసి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఉద్యోగుల ధర్నా
- తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాద నాయక్




**వరంగల్ ఎంజీఎం, అక్టోబర్ 7(జనంసాక్షి):** కాకతీయ వైద్య కళాశాల ఆవరణలో గల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల ఆరు నెలల పెండింగ్ వెతనాలు వెంటనే చెల్లించాలని,అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలని,ఇతర అన్ని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆసుపత్రి ముందు ధర్నా చేయడం జరిగింది.ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాద నాయక్ మాట్లాడుతూ... కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో గత ఐదు సంవత్సరాలుగా పనిచేస్తున్న నర్సింగ్ ఆఫీసర్స్,ల్యాబ్ టెక్నీషియన్లు,ఫార్మసి ఆఫీసర్స్, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్లు, పిఆర్వోలు,డేటా ఎంట్రీ ఆపరేటర్లు,ఇతర సిబ్బందికి 6 నెలల వేతనాలు పెండింగ్ లో ఉండటం వలన కుటుంబాలు గడవక,అప్పులు పుట్టక గత్యంతరం లేని పరిస్థితుల్లో ఉద్యోగులు ఈరోజు ధర్నాకు రావడం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం,సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకొని ఆరు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని,అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలని,ఇతర అన్ని సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు.

ఐదు సంవత్సరాల నుండి పనిచేస్తున్న వీరికి సమాన పనికి - సమాన వేతనం ఇవ్వకుండా పీఎఫ్,ఈఎస్ఐ చెల్లించకుండా ఇతర చట్టబద్ధ సౌకర్యాలు ఏ ఒక్కటి అమలు చేయకుండ ప్రభుత్వం మోసం చేస్తుందని, వీరి పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఖండించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు వీరి సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేకుంటే వీరి సమస్యల పరిష్కారానికి మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులందరి మద్దతును కూడగట్టి దశల వారి ఆందోళన,పోరాటాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు, ధర్నా అనంతరం ఆసుపత్రి డిప్యూటీ సూపరిండెంట్ కి,కెఎంసి ప్రిన్సిపాల్ కి వినతి పత్రాలు సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ డిప్యూటేషన్లను రద్దు చేస్తున్నామని,పెండింగ్ వేతనాలు,ఇతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి జే సుధాకర్, ఆసుపత్రి సిబ్బంది శోభ, సంధ్య, భానురేఖ, విక్రమ్, కోమల,సంతోష్ కుమార్, లావణ్య,మౌనిక,స్రవంతి, హిమబిందు, శ్రావణి పాల్గొన్నారు.

# అరుదైన వ్యాధులకు యశోద ఆసుపత్రిలో చికిత్సలు

- డాక్టర్ రంజిత్ కుమార్ కన్సల్టెంట్ ఎండో వాస్క్యులర్స్ సర్జన్



**హైదరాబాద్, అక్టోబర్ 7 (జనంసాక్షి) :** అరుదైన వ్యాధులకు అతి తక్కువ ఖర్చులతో హైదరాబాద్ మలక్ పెట్ యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్న అధునాతనమైన ట్రామా వాస్క్యులర్ ఆర్థోపెడిక్ ప్లాస్టిక్స్ సర్జరీ సేవలు, క్రిటికల్ కేర్ సమగ్ర పునరస వైద్య సేవలను వినియోగించుకోవాలని డాక్టర్ రంజిత్ కుమార్ అన్నారు. మంగళవారం దేవరకొండలో యాదవ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో ఎక్కడలేని విధంగా యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో అనేక రకములైన చికిత్సలకు అధునాతనమైన పరికరాలతో అతి తక్కువ ధరలకే సర్జరీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మధ్యకాలంలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడ్డ వాళ్లకు చేతులు కాళ్లకు ప్రధాన రక్తనాళాలు అనుబంధ రక్తనాళాలు తెగిపోతే చాలా ప్రమాదకరమైన పరిస్థితి ఏర్పడుతుంది ! రక్తప్రసన్న ఆగిపోవడం వల్ల అవయాల్లో కండరాలు నరాలు మాంసం తీవ్రంగా దెబ్బతింటాయి. ప్రమాదము జరిగిన ఆరు గంటల్లోపు రోగిని వీలైనంత త్వరగా ఆసుపత్రికి తీసుకురాగలిగితే శాశ్వతంగా వైకల్యాన్ని, ప్రాణాలను కాపాడవచ్చని ఆయన తెలిపారు. అలాంటి సమయంలో నిపుణులైన మలక్ పేట్ యశోద వైద్య బృందం ఆగ మేఘాల మీద స్పందించి సమస్యను గుర్తించి వీలైనంత త్వరగా ఆపరేషన్ చేసి రోగి ప్రాణాలను కాపాడ కలుగుతారని ఆయన తెలిపారు. ఇటీవల జూన్ మాసంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నల్గొండ జిల్లా పెద్ద పీఏ పల్లి మండలం చింతల్ తండా కు చెందిన రామవత్ రమేష్ పదహారేళ్ల యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై తన ఎడమచేతి బోను విరిగి రక్తనాళాలు తెగిపోయాయి అతని 6 గంటల తర్వాత ఆలస్యంగా హైదరాబాదులోని మలక్ పేట యశోద ఆసుపత్రికి తీసుకువచ్చారు. ప్రమాదం జరిగిన తర్వాత మొదటి ఆరు గంటల్లో చాలా కీలకమైన కాలమని ఆయన తెలిపారు. ఈ లోగా రోగిని ఆసుపత్రికి తీసుకురాగలిగితే నష్టాన్ని వీలైనంత నివారించవచ్చని కానీ ఈ కేసులో ఆ కాలం దాటిపోయినది రోగి ఎడమ చేయికి రక్త ప్రసన్న పూర్తిగా ఆగిపోయింది అతని చేతిలో ప్రధాన రక్తనాళంతో పాటు దానికి అనుసంధానమైన ఉన్న మరో రెండు ముఖ్యమైన నాళాలు కూడా తెగిపోయి ఇబ్బంది పడుతున్న రమేష్ ను డాక్టర్ల బృందం సిటీ పెరిఫెరెల్ ఎంజియోగ్రామ్ ద్వారా దానిని వైద్యులు గుర్తించి శాస్త్ర చికిత్స ద్వారా రోగి చేతికి రక్తప్రసరణ రక్త ప్రసరణ జరిగే విధంగా రక్తనాళాలను అతికించి మాంసం పొర ఫ్లాఫ్ భాగం కలిసిపోయే విధంగా దాని మీద అమర్చిన చర్మం గ్రాఫ్ కూడా చక్కగా అతుక్కునే విధంగా శాస్త్ర చికిత్సర నయం చేశారు. తర్వాత చేతిని కాపాడేందుకు బయట నుండి అమర్చిన ఇనుప పరికరాన్ని కూడా తొలగించి ఈ కేసులో నిపులైన యశోద మలక్పేట వైద్య బృందం రోగి చేతిని ప్రాణాన్ని కాపాడగలమని ఆయన తెలిపారు. ఇలాంటి కేసులులో రోగిని కాపాడినప్పుడే డాక్టర్లకు తృప్తినిస్తాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ ఎం ఇవి చంద్రమౌళి, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ప్రఫుల్ కిలార్, జనరల్ ఫిజీషన్ గుత్తా శశిధర్ రెడ్డి, జనరల్ మేనేజర్ శ్రీనివాస్ సిదుర, సీనియర్ మేనేజర్ ఏ. వాసు కిరణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీల్లో గురుకుల విద్యార్థి ప్రతిభ



**ఖమ్మం, అక్టోబర్ 7 (జనం సాక్షి) :** రాష్ట్రస్థాయి పోటీలకు కబడ్డీ ఎం జె పి బోనకల్ కళాశాల విద్యార్థి సాయి కిరణ్ ఎంపిక బోనకల్ కళాశాల విద్యార్థి మధిర మండలం కృష్ణాపురం లోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలుర కళాశాలకు చెందిన విద్యార్థి జిల్లా స్థాయిలో నిర్వహించిన కబడ్డీ క్రీడల్లో చక్కని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి ఆర్చరీ క్రీడకు పోటీలకు ఎంపికయ్యాడు ఈ సందర్భంగా జిల్లా ఆర్ సి ఓ రాంబాబు ప్రిన్సిపాల్ సుష్మ (డి సి ఓ) మాట్లాడుతూ కళాశాల విద్యార్థి అన్ని రంగాలలో తమ ప్రతిభ తో ముందుండి ఈరోజు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు అనంతరం విద్యార్థిని అభినందించారు విద్యార్థి అభిరుచులను పరిగణలోకి తీసుకొని వారి ఆసక్తికి తగిన శిక్షణ ఇస్తున్న ఫిజికల్ డైరెక్టర్స్ జి రవి పి వెంకటేశ్వర్లు తెలిపారు.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి సరికాదు




**ఖమ్మం, అక్టోబర్ 7 (జనం సాక్షి) :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి సంఘటనను బిఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్షనేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. న్యాయవ్యవస్థపై దాడులు ప్రజాస్వామ్యానికి మచ్చ తెస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థ గౌరవాన్ని దెబ్బతీసే ఇలాంటి చర్యలు సరికాదన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వంటి ఉన్నత హోదాలో ఉన్న వ్యక్తిపై దాడి ప్రయత్నం జరగడం ఆందోళనకరమని నామ అన్నారు. ప్రజల న్యాయహక్కులను కాపాడే న్యాయమూర్తులపై దాడి ప్రయత్నం దేశ ప్రజాస్వామ్య గౌరవాన్ని దెబ్బతీసిన చర్యగా అభివర్ణించారు. దాడి యత్నం చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. న్యాయమూర్తుల భద్రతను మరింత పటిష్టపరిచి, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం నిలబెట్టడంలో ప్రభుత్వం, న్యాయవర్గాలు, ప్రజాసంఘాలు సమన్వయంతో ముందుకు రావాలని నామ పేర్కొన్నారు.

## ఏరియా ఆసుపత్రిలో గర్భస్థ శిశువు మృతి



**ఆర్మూర్, అక్టోబర్ 7 (జనంసాక్షి) :** ఆర్మూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిండు గర్భిణి కడుపులోనే ఆడ శిశువు మృతి చెందింది. ఆర్మూర్ పట్టణంలోని సంతోష్ నగర్ కాలనీకి చెందిన శృతి కొద్ది రోజుల క్రితం ఆర్మూర్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. గర్భిణిని పరీక్షించిన వైద్యులు సాధారణ ప్రసవం కోసం ప్రసూతి వార్డులో చేర్చుకుని పరీక్షలు నిర్వహించారు. నెలలు నిండి 24 గంటలు దాటినా పురిటి నొప్పులు రాకపోవడంతో వైద్యులు శస్త్రచికిత్స చేసి ఆడ శిశువుకు పురుడు పోశారు. నిండు గర్భిణి శృతికి సకాలంలో శాస్త్ర చికిత్స చేయకపోవడంతో కడుపులోనే శిశువు ఊపిరాడక మృతి చెందింది.

### వైద్యుల లోపం ఏమి లేదు



సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసూతి కోసం ప్రయత్నించామని ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రమిద రెడ్డి తెలిపారు. ఇదే సమయంలో శిశువు హార్ట్‌బీట్ తక్కువగా ఉన్నట్లు గుర్తించి ఎమర్జెన్సీగా శస్త్రచికిత్స చేసి బయటికి తీశామని చెప్పారు. పాప హార్ట్ బీట్ తక్కువగా ఉండడంతో ఆక్సిజన్ అందక నిండు గర్భిణీ కడుపులోనే ఆడ శిశువు మృతి చెందిందని చెప్పారు. శిశువు మృతిలో వైద్యుల లోపం లేదన్నారు. గర్భంలోని శిశువును కాపాడేందుకు వైద్యులు అపర్ణ, పిల్లల వైద్యుడు అజయ్, అనేస్తేషియా రాజేష్ విశ్వ ప్రయత్నాలు చేశారన్నారు.

**- ఆస్పత్రి సూపర్డెంట్ ప్రమిద**

## పారదర్శకమైన పాలన కోసమే సమాచార హక్కు చట్టం




**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 7 (జనంసాక్షి) :** సమాచార హక్కు చట్టం ద్వారా పాలనలో పారదర్శకత ,బాధ్యత పెరుగుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 5 నుండి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్న సమాచార హక్కు చట్టం వారోత్సవాలలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ లో నిర్వహించిన వారోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాచార హక్కు చట్టం కింద ప్రజలు కోరిన సమాచారాన్ని ఇవ్వాల్సిన బాధ్యత పౌర సమాచార అధికారులు ,పబ్లిక్ అథారిటీలపై ఉందని అన్నారు. ఆయా పబ్లిక్ అథారిటీలు వారి దగ్గర ఉన్న సమాచారాన్ని పౌరులు కోరితే ఇవ్వాలని, ఏ పద్ధతిలో సమాచారం కోరితే ఆ పద్ధతిలో ఇవ్వాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. ఎట్టి పరిస్థితులలో తప్పు సమాచారం ఇవ్వద్దని అన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా అధికారం యంత్రాంగాలలో పారదర్శకత, బాధ్యత పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, డిఆర్డిఓ పిడి అప్పారావు, డిపిఓ యాదగిరి, డిఎఫ్ఓ సతీష్, జిల్లా, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పూలే విగ్రహం వద్ద కళ్లకు గంతలతో బీసీ నాయకులు నిరసన



**మిర్యాలగూడ, అక్టోబర్ 7 (జనం సాక్షి) :** బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని గవర్నర్ ఆమోదించక పెండింగ్లో ఉంచడం,అలాగే కొంతమంది రిజర్వేషన్ వ్యతిరేకులు, రెడ్డి జాగృతి నాయకులు కోర్టుకు పోయి అడ్డుకునే ప్రయత్నాలు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం మిర్యాలగూడ పట్టణంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహం వద్ద కళ్లకు నల్ల గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ మాట్లాడుతూ న్యాయమైన బీసీ రిజర్వేషన్ల వాటాను అడ్డుకోవాలని రిజర్వేషన్ల వ్యతిరేకులు చూడడం సిగ్గుమాలిన చర్య అన్నారు. అసెంబ్లీలో చట్టం చేసిన బీసీ బిల్లును గవర్నర్ఆమోదించకుండా పెండింగ్లో ఉంచటం విడ్డూరంగాఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ మిర్యాలగూడ నియోజకవర్గం అధ్యక్షుడు గుండెబోయిన నాగేశ్వరావు యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యర్రబెల్లి దుర్గయ్య రజక, బీసీ యువజన సంఘం పట్టణ కార్యదర్శి దోనేటి శేఖర్ ముదిరాజ్, బీసీ యువజన సంఘం జిల్లా కార్యదర్శి కుమ్మరికుంట్ల సుధాకర్ రజక, బీసీ యువజన నాయకులు బంటు సైదులు ముదిరాజ్, భాషం శ్రీనివాస్, మునుకుంట్ల లక్ష్మీనారాయణ రజక, గంట రాంబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలకు ప్రత్యామ్నాయ పద్ధతిలో తాగునీరు



**దేవరకొండ, అక్టోబర్ 7 (జనంసాక్షి) :** ఇటీవల కురిసిన భారీ వర్షం కారణంగా దేవరకొండ డివిజన్, డిండి మండలం, కందుకూరు వాగులో మిషన్ భగీరథ పైప్ లైన్లు దెబ్బతినగా నీటి సరఫరా నిలిచిపోయిన గ్రామాలకు ప్రత్యామ్నాయ పద్ధతిలో తాగు నీటిని సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మంగళవారం ఆమె కందుకూరు వాగులో దెబ్బతిన్న మిషన్ భగీరథ పైప్‌లైన్ స్థలాన్ని పరిశీలించి, మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా అధికారులతో సమస్యను అడిగి తెలుసుకున్నారు. చందంపేట, దిండి మండలాలలోని 92 గ్రామాలకు తాగు నీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ పైప్ లైన్ భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్నదని , అందువల్ల చందంపేట, డిండి మండలాలలోని గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయిందని, నీటి ప్రవాహం తగ్గిన వెంటనే పైపులైన్లను పునరుద్ధరిస్తామని మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీనారాయణ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. వాగులో వరద నీరు తగ్గిన వెంటనే పైప్ లైన్లను పునరుద్ధరించాలని, అప్పటివరకు ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా తాగునీటి ట్యాంకర్లు, బోర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని దేవరకొండ ఆర్డిఓను ఆదేశించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ డిండి మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్లు తప్పనిసరిగా వారి పరిధిలోని పాఠశాలలను, అంగన్వాడి కేంద్రాలను సందర్శించి పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ ఐటిఐని సందర్శించి భవన నిర్మాణం, ఫ్లోరింగ్ పరిశీలించారు. లీకేజీలు కాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. దేవరకొండ ఆర్‌డిఓ రమణారెడ్డి, మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు లక్ష్మీనారాయణ,మహమ్మద్ అక్తర్, నగేష్ జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



**కామేపల్లి, అక్టోబర్ 7 (జనం సాక్షి) :** ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ కళావతి భాయి,భద్రాచలం ఐటీడీఏ అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ బి.సైదులు పిలుపునిచ్చారు. కామేపల్లి మండలం మద్దులపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. శిబిరంలో గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రసన్న జ్యోతి, డెర్మాటాజిస్ట్ డాక్టర్ అమీనాజ్, ఇతర స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ నిరోషా, డాక్టర్ రాజశేఖర్ డాక్టర్ అభిలాష్ రెడ్డి డాక్టర్ జై కీర్తి సుమారు 400 మంది ప్రజలకు వివిధ రకాల పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో మండల మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ ఎన్.చందన,డాక్టర్ శిరీష, భద్రాచలం ఐటిడిఏ డీపీఎంఓ శ్రీనివాసరావు, హెచ్ఈఓ లింగం నాయక్, హెచ్ ఓకే వెంకటేశ్వర్లు, సూపర్వైజర్లు నరేంద్రనాయక్,రాధాకృష్ణ, ఎం లక్ష్మి,హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, మల్లికార్జున్, రాంబాబు, ఎల్‌టి ఉమామహేశ్వరరావు, స్టాఫ్ నర్స్ పుష్పలత, ఏఎన్ఎంలు నాగమణి పాల్గొన్నారు.

## రిజర్వాయర్ ముంపు బాధితులకు మరోచోట పునరావాసం కల్పించాలి



**చింతపల్లి, అక్టోబర్ 7 (జనం సాక్షి) :** చింతపల్లి మండలం వర్కాల గ్రామ శివారు లోని 173 సర్వే నెంలో సుమారుగా 42 మంది రైతుల భూములను 45 ఎకరాలుగా ఉన్న భూమిని ఆర్ఆర్ కింద శివన్నగూడెం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ముప్పు గ్రామాలకు కేటాయించిన 45 ఎకరాల భూమిని వర్కాల గ్రామస్తులు గత 60 సంవత్సరం నుండి పొలం సాగు చేసుకుని జీవనం కొనసాగించేవారు. రైతులకు నిరుపేద కుటుంబాలకు ఆనాటి ప్రభుత్వాలు అసైన్డ్ పట్టాలు ఇచ్చారు. ఆనాడు అట్టి పొలాలు చిన్నపాటి అడవిగా ఉండేది దాన్ని పూర్వీకులు చెప్పారు. ఆ భూములు అప్పుడు వంపులు వర్రెలు చెట్లు పుట్టలు కలిగిన భూములు మా తాతలు మా నాన్నలు వాటీని చదువు చేసుకుని వ్యవసాయం భూమిగా మార్చుకొని బ్రతుకు సాగిస్తూ వచ్చారు . ప్రస్తుతం మేము వాటిని అభివృద్ధి చేసుకొనుటకు బోర్లు బావులు వేయించుకొని మేము సంపాదించిన డబ్బుల్లో మొత్తం బోర్లకు పెట్టి పంటలను మరి కూరగాయలను పండించుకొని జీవనం కొనసాగిస్తున్నాం. కావున మాకు మా గ్రామంలో భూమి తప్ప మరెక్కడ లేదు కావున మా పిల్లలకు జీవనాధారం ఇదే కాబట్టి చర్లగూడెం వారికి ఇక్కడ కేటాయించి వారి వల్ల మమ్మల్ని కూడా నిర్వాసితులు చేసి కూలీలుగా చేయవద్దని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. రిజర్వాయర్లో ముంపుకు గురైన గ్రామ ప్రజలకు మరోచోట పునరావసం కల్పించి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# ఓట్ల చోరీపై సంతకాల సేకరణ ముమ్మరం చేయండి

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్
- కాంగ్రెస్ నాయకులకు దిశా నిర్దేశం



**ఖమ్మం, అక్టోబర్ 7 (జనం సాక్షి) :** ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో మండల, పట్టణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులతో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఓట్ల దొంగలు గద్దె దిగండి అనే ఉద్యమం పిలుపు లో భాగంగా ఓట్ల చోరీపై సంతకాల సేకరణకు కాంగ్రెస్ నాయకులు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఆదేశానుసారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సూచన మేరకు ఓట్ల చోరీపై సంతకాల సేకరణ చేపట్టాలని కోరారు. బీజేపీ, ఎన్నికల సంఘం కుమ్మక్కుపై ప్రజలకు వివరిస్తూ సంతకాల సేకరణ చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో అక్రమాలకు కుట్ర పన్నడమే బిజెపి చేసే అతిపెద్ద పని అని ఆరోపించారు. ఎన్నికలను ప్రభావితం చేయడానికి బీహార్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ చేపట్టారని అన్నారు. ఏడాది కిందట చేపట్టాల్సిన ఈ సవరణ ప్రక్రియను ప్రతిపక్షాల ఓట్లను తొలగించాలని ఉద్దేశపూర్వకంగా ఇప్పుడు చేపట్టారని విమర్శించారు ఎన్నికల కమిషన్ తనకున్న రాజ్యాంగ ప్రతిపత్తిని దుర్వినియోగం చేస్తుందని ఆరోపించారు. ఇవన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లి బిజెపి అక్రమాలను ఎండగట్టి ప్రజాభిప్రాయ సేకరణకు సంతకాలు తీసుకోవాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. అంతేకాకుండా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలలో ఖమ్మం ప్రత్యేకత ను మరోసారి నిరూపించాలని అన్నారు. అంసెబ్లీ ఎన్నికల్లో పది కి పది సీట్లు ఎలా అయితే సాధించామో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అన్ని పంచాయతీలను కాంగ్రెస్ కే దక్కేలా పని చేయాలని బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షులకు దిశా నిర్దేశం చేసినారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు టి పి సి సి ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు మహ్మద్ జావేద్, జిల్లా ఓ బి సి సెల్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్, బోజెడ్ల సతీష్, దగ్గుల రఘుపతి రెడ్డి, చావ వేణు, కందిమల్ల వీరబాబు, వేముల కృష్ణప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వడ్డే నారాయణరావు, కళ్ళెం వెంకటరెడ్డి, భూక్యా బాలాజి నాయక్, సూరంశెట్టి కిషోర్, కొమ్మినేని రమేష్ బాబు, గాలి దుర్గారావు, వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, శీలం వెంకటనర్సిరెడ్డి, స్వర్ణ నరేంద్ర, తలారి చంద్రప్రకాష్, కాపా సుధాకర్, కాసర చంద్రశేఖర్ రెడ్డి, మిరియాల రమణ గుప్త, ఎదునూరి సీతారాములు తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయంపై దాడి

- కంప్యూటర్ ధ్వంసం



**మర్రిగూడ, అక్టోబర్ 7 (జనం సాక్షి) :** ఎంపీడీవో కార్యాలయం పై దాడి కంప్యూటర్ ధ్వంసం. నల్గొండ జిల్లా గట్టుప్పల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ ఘటనలో కార్యాలయంలోని కంప్యూటర్లు, మానిటర్లు, ప్రింటర్లు ధ్వంసమయ్యాయి. గట్టుప్పల్ ఎస్సై సంజీవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన గుండ్లపల్లి శ్రీశైలం వయస్సు (35)తండ్రి నారయ్య అనే వ్యక్తి మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారుల పనికి ఆటంకం కలిగిస్తూ కార్యాలయంలోకి దూసుకు వెళ్లి అక్కడ ఉన్న పరికరాలను ధ్వంసం చేశాడని ఎంపీడీవో వసంత లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు గట్టుప్పల్ ఎస్సై తెలిపారు.




## జీఎస్టీ క్రమబద్ధీకరణ తర్వాత ఎస్‌బీఐ జనరల్ నుంచి కొత్త హెల్త్ ప్లాన్



**న్యూఢిల్లీ:**భారతదేశంలో ప్రముఖ బీమా సంస్థల్లో ఒకటైన ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ తమ వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా హెల్త్ ఆల్ఫా పేరుతో సమగ్ర ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించింది. ఆధునిక వైద్య ఖర్చులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి, అన్ని వయసుల వారికి మెరుగైన రక్షణ కల్పించడానికి రూపొందిస్తున్నట్లు చెబుతున్న ఈ ప్లాన్ వివిధ రకాల ప్రత్యేకతలు, సౌకర్యాలు, ప్రయోజనాలు కలిగి ఉందని కంపెనీ తెలిపింది.అనూహ్యంగా పెరిగే వైద్య ఖర్చుల నుంచి పాలసీదారులకు ఆర్థిక భద్రత కల్పించడానికి ఎస్‌బీఐ జనరల్ ఈ ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొంది. జీఎస్టీ సంస్కరణల తర్వాత ఎస్‌బీఐ ?ప్రారంభించిన మొదటి ఆరోగ్య బీమా ఇది.అదనంగా ప్రీమియం చెల్లించకుండా 10 రెట్లు క్లెయిం-ఫ్రీ క్యుమిలేటివ్ బోనస్‌ను అందిస్తున్నట్లు చెప్పింది. ఈ ప్లాన్‌లో బేస్ కవరేజీపై గరిష్ట పరిమితి లేదని తెలిపింది. 'జిమ్, స్పోర్ట్స్ ఇంజ్యూరీ కవరేజి కూడా లభిస్తుంది. అందుకు ఓపీడీ ప్రయోజనాలు, పరీక్షలు, చికిత్స, మందుల ఖర్చులు కూడా కవర్ అవుతాయి. ప్లాన్ కొనుగోలు చేసేందుకు కోట్ చేసిన 5 రోజుల్లోగా కొనుగోలు చేసినట్లయితే ప్రీమియంపై 5% తగ్గింపు పొందవచ్చు' అని కంపెనీ తెలిపింది.

## రోజుకు 12 గంటల నిద్ర!..

• ఇదే నా సక్సెస్ సీక్రెట్: టెలిగ్రామ్ సీఈఓ

స్మార్ట్‌ఫోన్ ప్రపంచాన్ని అరచేతిలో చూపిస్తుందని.. అందరూ నమ్ముతుంటే, ఫోన్ వాడకపోవడం వల్లే నేను సక్సెస్ సాధించా అని టెలిగ్రామ్ కో-ఫౌండర్, సీఈఓ పావెల్ దురోవ్ చెబుతున్నారు.ఇంతకీ అదెలా సాధ్యమైంది?, వివరాలు ఏమిటనేది ఇక్కడ తెలుసుకుందాం. లెక్స్ ఫ్రిడ్‌మాన్ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. "రోజులో వీలైనంత సమయం.. సుమారు 11 నుంచి 12 గంటలు నిద్ర కోసం కేటాయించడానికి ప్రయత్నిస్తాను. అయితే అన్ని గంటలు నిద్రకోసం కేటాయించినా.. నిద్రపోను. మంచం మీద పడుకుని ఆలోచిస్తూనే ఉంటాను" అని దురోవ్ పేర్కొన్నారు.పడుకున్నప్పుడే.. నాకు అద్భుతమైన ఆలోచనలు వస్తాయి. తాను సోషల్ నెట్‌వర్కింగ్‌లో ఉన్నప్పటికీ.. స్మార్ట్‌ఫోన్ వాడకం చాలా తక్కువని పేర్కొన్నారు. నిద్ర లేచిన వెంటనే తన ఫోన్ చూడకుండా ఉండటానికి ప్రయత్నిస్తాను. నోటిఫికేషన్‌లు, సోషల్ మీడియా వంటివన్నీ ఒక వ్యక్తి రోజును డిసైడ్ చేస్తాయని నమ్ముతాను.జీవితంలో ఏది ముఖ్యమైనదో నిర్ణయించుకోవాలి. ఇతర వ్యక్తులు, కంపెనీ వంటివన్నీ మన జీవితంలో చాలా ముఖ్యమైనవి కాదు. ప్రతి రోజూ ఉదయం ఫోన్ లేకుండానే మీ దినచర్యను ప్రారభించడం అలవాటు చేసుకోవాలి.వ్యాయామం చేసేటప్పుడు.. ఇతరత్రా పనులు చేసేటప్పుడు కూడా వీలైనంత ఫోనుకు దూరంగా ఉండాలి. ఫోన్ దూరంగా ఉన్నప్పుడే మీకు అద్భుతమైన ఆలోచనలు రావొచ్చని దురోవ్ చెబుతున్నారు.

# నాలుగో రోజూ లాభాల్లో..

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగో రోజూ లాభాల్లో ముగిశాయి. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి షేర్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. క్యూ2 ఫలితాల సీజన్ ప్రారంభం వేళ ప్రాఫిట్ బుకింగ్ కనిపించింది. ఈ కారణంగా సూచీలు స్వల్ప లాభాలకే పరిమితమయ్యాయి. సెన్సెక్స్ ఉదయం 81,883.95 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,790.12) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 82,309.56 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. ఆఖర్లో లాభాల స్వీకరణతో




136.63 పాయింట్ల లాభంతో 81,926.75 వద్ద ముగిసింది. నిఫ్టీ 30.65 పాయింట్ల లాభపడి 25,108.30 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.78గా ఉంది.సెన్సెక్స్ 30 సూచీలో భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. యాక్సిస్ బ్యాంక్, టాటా మోటార్స్, ట్రెంట్, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ షేర్లు ప్రధానంగా నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 65.34 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3957 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## ఏపీలో 172 బావుల ఏర్పాటుకు రూ.8,110 కోట్లు

**న్యూఢిల్లీ:**ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) ఆంధ్రప్రదేశ్‌లోని ఎనిమిది పెట్రోలియం మైనింగ్ లీజు బ్లాకుల్లో 172 ఆన్‌షోర్ బావులను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించింది.వీటి ద్వారా చమురు, గ్యాస్ ఉత్పత్తి కోసం రూ.8,110 కోట్లు పెట్టుబడి పెట్టడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అడవులు, వాతావరణ మార్పులకు సంబంధించిన ఒక కమిటీ గత నెలలో జరిగిన సమావేశంలో ఈ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతి ఇవ్వడానికి సిఫార్సు చేసింది. ఈ ఆన్‌షోర్ బావుల ఏర్పాటు కోసం పర్యావరణ నిర్వహణ ప్రణాళిక కు సంబంధించి మూల ధన వ్యయం రూ.172 కోట్లుగా కంపెనీ నిర్ణయించింది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.05 | ₹ 5.07 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,09,450 (22 క్యారెట్లు) | ₹ 1,19,400 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 1,65,000

## ప్యాసివ్ ఫండ్స్‌కు పెరుగుతున్న ఆదరణ

**న్యూఢిల్లీ:** ప్యాసివ్ మ్యూచువల్ ఫండ్స్ పట్ల ఇన్వెస్టర్లలో అవగాహన విస్తృతం అవుతోంది. ఇందుకు నిదర్శనంగా ప్యాసివ్ ఫండ్స్ నిర్వహణలోని ఇన్వెస్టర్ల పెట్టుబడుల (ఏయూఎం) విలువ 2025 మార్చి నాటికి రూ.12.2 లక్షల కోట్లకు చేరింది. 2019 నాటికి ఉన్న రూ.1.91 లక్షల కోట్ల నుంచి ఆరు రెట్లు పెరిగింది.మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్ మూడో ఎడిషన్ 'ప్యాసివ్ సర్వే 2025' ఈ వివరాలు విడుదల చేసింది. 2023 మార్చి నుంచి చూసినా ప్యాసివ్ ఫండ్స్ ఏయూఎం 1.7 రెట్లు పెరిగింది. మూడు వేల మందికి పైగా ఇన్వెస్టర్లు, ఫండ్స్ పంపిణీదారుల నుంచి అభిప్రాయాలను సర్వేలో భాగంగా మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్ తెలుసుకుంది.ప్యాసివ్ ఫండ్స్ (ఇండెక్స్ ఫండ్స్/ఈటీఎఫ్‌లు) అన్నవి నిర్దేశిత సూచీల్లోని స్టాక్స్‌లోనే ఇన్వెస్ట్ చేస్తాయి. రాబడి కూడా సూచీల స్థాయిలోనే ఉంటుంది. యాక్టివ్ ఫండ్స్ మెరుగైన రాబడుల అవకాశాలను ఎల్లప్పుడూ అన్వేషిస్తూ, అందుకు అనుగుణంగా పెట్టుబడులు పెడుతుంటాయి. యాక్టివ్ ఫండ్స్‌తో పోల్చి చూస్తే ప్యాసివ్ ఫండ్స్‌లో ఎక్స్‌పెన్స్ రేషియో తక్కువగా ఉంటుంది.

**సర్వే అంశాలు..**


76 శాతం మంది ఇన్వెస్టర్లు తమకు ఇండెక్స్ ఫండ్స్, ఈటీఎఫ్‌ల పట్ల అవగాహన ఉన్నట్టు చెప్పడం గమనార్హం.68 శాతం ఇన్వెస్టర్లు కనీసం ఒక ప్యాసివ్ ఫండ్‌లో పెట్టుబడులు పెట్టారు. 2023లో ఇలాంటి వారు 61 శాతంగా ఉన్నారు.ప్యాసివ్ ఫండ్స్‌కు ఆదరణ పెరిగినప్పటికీ.. యాక్టివ్ ఫండ్స్‌పైనా కొందరు ఇన్వెస్టర్లలో అమిత విశ్వాసం కొనసాగుతోంది. ఇప్పటికీ ప్రతి ముగ్గురిలో ఒకరు యాక్టివ్ ఫండ్స్‌లోనే ఇన్వెస్ట్ చేస్తున్నారు. వీరికి ప్యాసివ్ ఫండ్స్ గురించి




పెద్దగా తెలియకపోవడం కూడా ఒక కారణం.ప్యాసివ్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టడానికి తక్కువ వ్యయాలు కారణమని 54 శాతం మంది చెప్పారు. సులభత్వం, పారదర్శక గురించి 46 శాతం మంది ప్రస్తావించారు. 29 శాతం మంది పనితీరును కారణంగా పేర్కొన్నారు. మ్యూచువల్ ఫండ్స్ పంపిణీదారుల్లోనూ 93% మందికి ప్యాసివ్ ఫండ్స్‌పై అవగాహన ఉంది.సర్వేలో పాల్గొన్న ఇన్వెస్టర్లలో 85 శాతం మంది మూడేళ్లకు పైగా పెట్టుబడులు కొనసాగిస్తున్నారు. దీర్ఘకాలం కోసం పెట్టుబడుల ధోరణి వారిలో కనిపించింది. ఏడాది నుంచి మూడేళ్ల మధ్య పెట్టుబడులు కొనసాగిస్తున్న వారు 13 శాతంగా ఉన్నారు.57 శాతం మంది ఇన్వెస్టర్లు సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్), ఒకే విడతలో పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తున్నారు. 26 శాతం మంది కేవలం సిప్‌లో, 17 శాతం ఒకే విడత పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తున్నారు.ఆర్థిక స్వేచ్ఛ కోసం ఇన్వెస్ట్ చేస్తున్నట్టు 61 శాతం మంది చెప్పగా, రిటైర్మెంట్ నిధి కోసం 49 శాతం ఇన్వెస్ట్ చేస్తున్నారు.

## ఫ్లెక్స్ ఆఫీస్ ట్రెండ్.. హైదరాబాద్ టాప్

**హైదరాబాద్:**దేశంలో ఫ్లెక్స్ ఆఫీస్ ట్రెండ్ వేగంగా సాగుతోంది. అభివృద్ధి చెందిన నగరాల్లో.. హైబ్రిడ్ వర్క్ మోడల్‌కు ఇదొక ఉత్తమ పరిష్కారం. మైహెచ్‌క్యూ 'ఫ్లెక్స్ ఆఫీస్ స్టాక్ ఫుట్‌ప్రింట్' పేరుతో ఒక నివేదికను విడుదల చేసింది.ఇందులో హైదరాబాద్ అగ్రస్థానంలో ఉన్నట్లు వెల్లడించింది. మైహెచ్‌క్యూ డేటా ప్రకారం.. భారతదేశంలోని మొత్తం ఫ్లెక్స్ ఆఫీసులలో హైదరాబాద్ ముందు వరుసలో ఉంది. ఈ నగరం ఫ్లెక్స్ ఆఫీస్



హబ్‌గా మారింది. ఇక్కడ కూడా ప్రధానంగా.. హైటెక్ సిటీలో 23.4 శాతం ఫ్లెక్స్ ఆఫీసుల, మాదాపూర్‌లో 11.2 శాతం ఉన్నట్లు నివేదిక చెబుతోంది. ఆ తరువాత జాబితాలో బంజారా హిల్స్ (9.9%), బేగంపేట (9.9%), కొండాపూర్ (9.5%), ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ (5.3%) మొదలైనవి ఉన్నాయి.మెట్రో సౌకర్యం, రవాణా కనెక్టివిటీ ఉన్న ప్రాంతాల్లో ఫ్లెక్స్ ఆఫీసుల సంఖ్య పెరుగుతోంది. ఈ సంఖ్య గడిచిన మూడేళ్ళలో పెరుగుతూనే ఉంది. ప్రస్తుతం ఫ్లెక్సిబుల్ వర్క్ కల్చర్ ట్రెండ్‌సెట్టర్‌గా మారిపోయింది. దీంతో ఫ్లెక్స్ ఆఫీసులకు డిమాండ్ పెరుగుతోంది.కోవిడ్ సమయంలో వర్క్ ఫ్రమ్ హోమ్ విధానం ప్రారంభమైంది. అయితే కరోనా దాదాపు కనుమరుగైపోయినప్పటికీ.. ఉద్యోగులు వర్క్ ఫ్రమ్ విధానాలకు అలవాటుపడిపోయారు. దీనిని నివారించడానికి.. సంస్థలు హైబ్రిడ్ వర్క్ కల్చర్ స్టార్ట్ చేశాయి. దీనికోసం ఫ్లెక్స్ ఆఫీసులను ఎంచుకోవడం మొదలైంది. దీంతో ఫ్లెక్సిబుల్ ఆఫీసులు పుట్టుకొచ్చాయి. ఫ్లెక్సిబుల్ సొల్యూషన్స్ ప్రస్తుతం అన్ని కార్యాలయ లావాదేవీలలో 20% వాటా కలిగి ఉన్నాయి. 2030 నాటికి ఈ మార్కెట్ వ్యాప్తి దాదాపు 30%కి చేరుకుంటుందని సమాచారం.

**ఫ్లెక్స్ ఆఫీస్ ఉపయోగాలు**

ఫ్లెక్స్ ఆఫీస్ అనేది.. ఒకవిధమైన ఆఫీస్ వర్క్ స్పేస్. ఇక్కడ ఉద్యోగులు సౌకర్యవంతంగా పనిచేసుకోవచ్చు. స్టార్టప్ కంపెనీలు తక్కువ ఖర్చుతో.. కార్యాలయ నిర్వహణ చేసుకోవడానికి ఫ్లెక్స్ ఆఫీస్ ఉపయోగపడుతుంది. ఫ్రీలాన్సర్లు, రిమోట్ వర్కర్లు తమకు అవసరమైన స్థలాన్ని ఎంచుకుని పని చేయవచ్చు. ఉద్యోగ వాతావరణం ఉంటుంది కాబట్టి.. ప్రొడక్టివిటీ కూడా పెరుగుతుంది.

# ఎన్నికలకు ముందు మెట్రోలు..

### బీహార్ ఎన్నికల్లో విజయానికి సెంటిమెంట్‌ను ప్రయోగిస్తోన్న బీజేపీ

**పట్నా:** బీహార్ ఎన్నికల్లో విజయానికి బీజేపీ 'మెట్రో' సెంటిమెంట్‌ను ప్రయోగిస్తోంది. గత 12 ఏళ్లలో ఆరు రాష్ట్రాల్లో ఎన్నికలకు ముందు వివిధ పార్టీల ప్రభుత్వాలు 'మెట్రో'ను ప్రారంభించాయి.ఈ మెట్రో సెంటిమెంట్ నాలుగు రాష్ట్రాల్లో విజయానికి దారి తీసింది. మొన్న అక్టోబర్ 6న సాయంత్రం 4 గంటలకు బీహార్‌లో ఎన్నికల తేదీలను ప్రకటించారు. దీంతో ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. అయితే దీనికి ఐదు గంటల ముందు బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ పట్నా మెట్రోకు పచ్చజెండా ఊపారు.

**2013, రాజస్థాన్:** ఎన్నికలకు మూడు నెలల ముందు జైపూర్ మెట్రో ట్రయల్ రన్. దీనిని నాటి కాంగ్రెస్ సీఎం అశోక్ గెహ్లాట్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలల ముందు జరిగింది. ఆ సమయంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది.

**ఫలితం:** 200 సీట్లు కలిగిన రాజస్థాన్ అసెంబ్లీలో కాంగ్రెస్ 21 సీట్లకు పడిపోయింది. బీజేపీ 163 సీట్లతో మెజారిటీని సాధించింది. వసుంధర రాజే ముఖ్యమంత్రి అయ్యారు. మెట్రో ప్రారంభించిన జైపూర్ జిల్లాలో 19 సీట్లు ఉన్నాయి. అయితే అక్కడ కాంగ్రెస్ ఒక్క సీటు మాత్రమే గెలుచుకుంది. బీజేపీ 17 సీట్లు గెలుచుకుంది.

**2017, ఉత్తరప్రదేశ్:** 2016, అక్టోబర్ 4న నాటి సమాజ్‌వాదీ పార్టీ ప్రభుత్వ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ కాన్పూర్ మెట్రోకు శంకుస్థాపన చేశారు. డిసెంబర్ 1న లక్నో మెట్రోను ప్రారంభించారు. 2017, ఫిబ్రవరి-మార్చి నెలల్లో ఎన్నికలు జరిగాయి.

**ఫలితం:** ఉత్తరప్రదేశ్‌లోని 403 అసెంబ్లీ స్థానాల్లో ఎస్పీ 47 మాత్రమే గెలుచుకుంది. బీజేపీ 312 సీట్లతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రి అయ్యారు. కాన్పూర్‌లోని 10 సీట్లలో ఎస్పీ రెండు, లక్నోలో ఒక సీటు మాత్రమే గెలుచుకుంది.



2022, ఉత్తరప్రదేశ్: కాన్పూర్ మెట్రో మొదటి దశ ఎన్నికలకు రెండు నెలల ముందు ప్రారంభమయ్యింది. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కాన్పూర్ మెట్రో మొదటి దశను ప్రారంభించారు. తరువాత అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి.

**ఫలితం:** ఉత్తరప్రదేశ్‌లోని 403 సీట్లలో 255 స్థానాలను బీజేపీ గెలుచుకుంది. కాన్పూర్‌లోని 10 స్థానాల్లో ఏడు స్థానాలు బీజేపీ ఖాతాలో చేరాయి. బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రి అయ్యారు.

2023, మధ్యప్రదేశ్: ఎన్నికలకు 45 రోజుల ముందు భోపాల్ మెట్రో ట్రయల్ రన్‌ను నాటి సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ జెండా ఊపి ప్రారంభించారు.అనంతరం రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి.

ఫలితం: నవంబర్ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో, బీజేపీ 230 సీట్లలో 163 ??గెలుచుకుంది. భోపాల్ జిల్లాలో 7 సీట్లలో 6 సీట్లను బీజేపీ సొంతం చేసుకుంది. అయితే శివరాజ్ సింగ్ చౌహాన్ స్థానంలో డాక్టర్ మోహన్ యాదవ్ సీఎంగా నియమితులయ్యారు.

2024, మహారాష్ట్ర: ఎన్నికలకు కొన్ని నెలల ముందు పూణే, ముంబై మెట్రో ప్రారంభమయ్యింది. ప్రధాని నరేంద్ర మోడీ ముంబై మెట్రోను ప్రారంభించారు. 2024, సెప్టెంబర్ 29న పూణే మెట్రోను ప్రారంభించారు. ఆ సమయంలో రాష్ట్రాన్ని బీజేపీ, శివసేన (షిండే), ఎన్‌సీపీ (అజిత్)ల మహాయుతి (మహాయుతి) ప్రభుత్వం అధికారంలో ఉంది. ఏక్‌నాథ్ షిండే ముఖ్యమంత్రిగా ఉన్నారు.

ఫలితం: నవంబర్ 2024 అసెంబ్లీ ఎన్నికల్లో, మహాయుతి 288 సీట్లలో 230 గెలుచుకుంది. ముంబైలోని 36 సీట్లలో 22, పూణేలోని 21 సీట్లలో 18 వారి సొంతమయ్యాయి. అయితే, దేవేంద్ర ఫడ్నవీస్.. ఏక్‌నాథ్ షిండే స్థానంలో ముఖ్యమంత్రిగా నియమితులయ్యారు.

2025, ఢిల్లీ: ఎన్నికలకు ఒక నెల ముందు ఢిల్లీ మెట్రో ఫేజ్ 4 ప్రారంభమైంది. దీనిని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఆ సమయంలో, అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉంది.

ఫలితం: నాటి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 70 సీట్లలో 48 స్థానాలను గెలుచుకుని, 27 సంవత్సరాల తర్వాత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. రేఖా గుప్తా ముఖ్యమంత్రి అయ్యారు.

కరూర్ తొక్కిసలాట..

## బాధిత కుటుంబాలకు విజయ్ పరామర్శ




**చెన్నై:** కోలీవుడ్ ప్రముఖ నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీ తీవ్ర విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే.ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కూడా కోల్పోయారు. ఈ క్రమంలో మృతుల కుటుంబాలను విజయ్ మంగళవారం వీడియో కాల్‌లో పరామర్శించారు. వారిని ఓదార్చిన విజయ్.. త్వరలో కరూర్‌లో పర్యటిస్తానని తెలిపారు."నేను మీతో ఉన్నాను, మీకు అండగా ఉంటానని బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు. అయితే, వీడియో కాల్ సమయంలో ఫోటోలు తీసుకోవద్దని.. రికార్డ్ చేయవద్దని ఆయన బృందం కోరింది. ప్రతి వీడియో కాల్ సుమారు 20 నిమిషాల పాటు సాగిందని సమాచారం. వచ్చే ఏడాది ఎన్నికల నేపథ్యంలో కరూర్ తొక్కిసలాట తమిళనాడు రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. తొక్కిసలాట ఘటనకు సంబంధించి టీవీకే పార్టీకి చెందిన కొందరు నేతలను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ టీవీకే మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. అయితే, మొదట వ్యతిరేకించిన కోర్టు.. ఆ తర్వాత సిట్ దర్యాప్తునకు ఆదేశించింది. కాగా, టీవీకే పార్టీకి 10 వేల మందికి మాత్రమే అనుమతి ఇచ్చినప్పటికీ సుమారు 30 వేల మందికి పైగా హాజరయ్యారు. భారీగా జనం హాజరవుతారని అధికారులు ముందుగా అంచనా వేయలేకపోయారు.

## తుపాకీతో కాల్చుకుని..
### సీనియర్ ఐపీఎస్ అధికారి ఆత్మహత్య



**గుర్గావ్:** హర్యానా రాజధాని చండీగఢ్‌లో విషాదం జరిగింది. హర్యానా కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ ఆఫీసర్ వై. పురాణ్ కుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డారు.ఇవాళ (మంగళవారం అక్టోబర్ 7) సెక్టార్ 11లో ఉన్న తన నివాసంలోనే సర్వీస్ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న చండీగఢ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. పురాణ్ కుమార్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు.పురాణ్ ఆత్మహత్యకు గల కారణాలపై పలు కోణాల్లో ఆరా తీస్తున్నారు. ఆత్మహత్యకు వ్యక్తిగత కారణాలా? మరేదైనా ఉందా అన్న కోణంలో విచారణ చేపట్టారు. ఆయన మొబైల్ ఫోన్‌తో పాటు వస్తువులను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. కాగా, నిజాయితీ, నిబద్ధత గల అధికారిగా పురాణ్‌కు పోలీస్ శాఖలో మంచి పేరుంది. అలాంటి వ్యక్తి మరణంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీనియర్ ఐపీఎస్ అధికారి, అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఏడీజీపీ) హోదాలో పురాణ్ కుమార్ గత కొన్ని సంవత్సరాలుగా హర్యానా పోలీస్ శాఖలో సేవలు అందిస్తున్నారు. ఆయన భార్య, ఐఏఎస్ అధికారిణి అమ్నీత్ పి కుమార్ కూడా ఆ రాష్ట్ర కేడర్‌లోనే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆమె భర్త ఆత్మహత్యకు పాల్పడిన సమయంలో ఆమె విధుల్లో భాగంగా విదేశీ పర్యటనలో ఉన్నారు. హర్యానా సీఎం నయాబ్ సింగ్ సైనీతో పాటు జపాన్ పర్యటనకు వెళ్లారు. భర్త మరణించిన విషయం తెలుసుకున్న ఆమె వెంటనే భారత్‌కు తిరుగు పయనమయ్యారు. ఆత్మహత్యకు కారణం ఇంకా తెలియాల్సి ఉందని దర్యాప్తు ప్రారంభించామని ఓ సీనియర్ పోలీస్ అధికారి వెల్లడించారు. కుటుంబ సభ్యులు, సిబ్బంది వాంగ్మూలాలు నమోదు చేస్తున్నామని తెలిపారు.

## 18వేల అడుగుల ఎత్తు!
## సెల్ఫీ తీయబోతే పట్టు తప్పి..



**బీజింగ్:**సెల్ఫీ మోజు.. ఓ పర్వతారోహకుడి ప్రాణం బలి తీసుకుంది ఏకంగా 18వేల అడుగుల ఎత్తైన శిఖరాన్ని అధిరోహించే క్రమంలో ఆ వ్యక్తి పెద్ద పొరపాటు చేశాడు.తోటి బృందంతో సెల్ఫీ కోసమని కట్టుకున్న తాడును విప్ప దీసుకున్నాడు. అదే.. అతని మరణానికి కారణమైంది.చైనా సిచువాన్‌లోని మౌంట్ నామా శిఖరంపై(ఎత్తు: 5,588 మీటర్లు.. సుమారుగా 18,300 అడుగులు) ఓ బృందం ట్రెక్కింగ్ చేస్తోంది. ఆ సమయంలో ఓ హైకర్.. సేఫ్టీ రోప్‌ను విప్పేసి సెల్ఫీ కోసం ప్రయత్నించాడు. అయితే పట్టు తప్పి దొర్లుకుంటూ పడిపోయాడు. అలా.. 200 మీటర్లు(656 మీటర్లు) జారిపడి మృతి చెందాడు. ఆ సమయంలో తోటి బృందంలోని సభ్యులు నిస్సహాయంగా చూస్తూ ఉండిపోవాల్సి వచ్చింది.మృతుడ్ని 31 ఏళ్ల హాంగ్‌గా గుర్తించారు. రక్షణ బృందాలు అతన్ని కాపాడే ప్రయత్నం చేయగా.. అప్పటికే అతని ప్రాణం పోయింది. అతికష్టం మీద స్వాధీనం చేసుకున్న హాంగ్ మృతదేహాన్ని.. గోంగ్గా మౌంటెన్ టౌన్‌కు తరలించారు. సెల్ఫీ కోసం తన సేఫ్టీ రోప్ తీసేయడం.. ఐస్ యాక్స్ లేకపోవడంతో కాళ్లకు ఉన్న క్రాంపాన్ బూట్లు మంచుపై జారి ఈ ఘోరం జరిగిందని అధికారులు తెలిపారు. ఇదిలా ఉంటే.. హాంగ్ మంచు కొండలు ఎక్కడం ఇదే తొలిసారి అని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ ఘటన సెప్టెంబర్ 25న చోటుచేసుకోగా, వీడియో సోషల్ మీడియాలోవైరల్ అవుతోంది.ఇదిలా ఉంటే.. హాంగ్‌తో పాటు వెళ్లిన బృందం ఎలాంటి అనుమతులు లేకుండానే శిఖరాన్ని అధిరోహించే ప్రయత్నం చేసిందని అధికారులు వెల్లడించారు. అయితే అతను ప్రొఫెషనల్ కాదని, అరుదుగా కొండలెక్కిన అనుభవం మాత్రమే ఉందని సిచువాన్ మౌంటెనీరింగ్ అసోషియేషన్ అంటోంది.

## హిమాచల్‌ప్రదేశ్‌లో ఘోర ప్రమాదం

కొనసాగుతున్నాయి. హరియాణాలోని రోహ్‌తక్ నుంచి హిమాచల్‌లోని ఘుమర్విన్‌కు ప్రైవేటు బస్సు బయలుదేరింది. బలూఘాట్ ప్రాంతానికి చేరుకోగానే కొండచరియలు విరిగి వాహనంపై పడ్డాయి. బస్సు మొత్తం శిథిలాల కింద చిక్కుకుపోయింది. రె స్క్యూ ఆపరేషన్ చేపట్టిన బృందాలు.. పలువురిని ప్రాణాలతో బయటకు తీసి నట్లు సమాచారం. ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు దిగ్భ్రాంతి వ్య క్తం చేశారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు.

## యుద్ధం ఎక్కడ మొదలైందో అక్కడే ముగుస్తోంది

**టెల్‌అవీవ్(జనంసాక్షి):** ఇజ్రాయెల్- గాజా మధ్య యుద్ధానికి రెండేళ్లు. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధం ఎక్కడ మొదలయ్యిందో.. అక్కడే ముగుస్తోందన్నా రు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.గాజాతో యుద్ధం ముగించడానికి దగ్గరగా ఉన్నామ న్నారు. అయినా.. హమాస్ ఇంకా నాశనం కాలేదని వ్యాఖ్యానించారు. గా జాలో ప్రారంభమైన యుద్ధం అక్కడే ముగుస్తోందన్నారు. అక్టోబరు 7న హ మాస్ చేసిన దాడులతో ఇజ్రాయెల్ పనైపోయిందని అందరూ భావించా రన్నారు. కానీ, ఊహించని విధంగా ఇంకా బలపడిందని నెతన్యాహు పేర్కొన్నారు.

## ఢిల్లీలో భారీ ఎన్‌కౌంటర్

### రూ. లక్ష రివార్డు గ్యాంగ్‌స్టర్ హతం



న్యూఢిల్లీ: పలు ఘోరమైన నేరాలకు పాల్పడుతూ, పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న ఓ నేపాలీ గ్యాంగ్‌స్టర్ ఎట్టకేలకు హతమయ్యాడు. ఢిల్లీ, గురుగ్రామ్ పోలీసులు సోమవారం రాత్రి సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భీమ్ మహాబహదూర్ జోరా (30) అనే మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ ప్రాణాలు కోల్పోయాడు. అతడి తలపై పోలీసులు లక్ష రూపాయల రివార్డు ప్రకటించారు. గత రాత్రి నెహ్రూ ప్లేస్ సమీపంలోని ఆస్థా కుంజ్ పార్క్‌లో జోరా తన అనుచరుడితో కలిసి ఉన్నాడన్న పక్కా సమాచారంతో గురుగ్రామ్ క్రైమ్ బ్రాంచ్, ఢిల్లీ పోలీసుల స్పెషల్ బృందాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. పోలీసులను గమనించిన జోరా, వారిపై విచక్షణా రహితంగా కాల్పులు జరుపుతూ పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఒక బుల్లెట్ గురుగ్రామ్ క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర శర్మ బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్‌కు తగలడంతో ఆయన ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. లొంగిపోవాలని పోలీసులు పదేపదే హెచ్చరించినా జోరా వినకుండా కాల్పులు కొనసాగించాడు. దీంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని ఎయిమ్స్ ట్రామా సెంటర్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ గందరగోళంలో జోరా అనుచరుడు చీకట్లో తప్పించుకున్నాడు.

**వైద్యుడి హత్య కేసులో ప్రధాన నిందితుడు**

జోరా అనేక హత్యలు, దోపిడీలు, దొంగతనాల కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ముఖ్యంగా 2024 మే నెలలో ఢిల్లీలోని జంగ్‌పురాలో డాక్టర్ యోగేష్ చంద్ర పాల్ (63) హత్య కేసులో ఇతనే ప్రధాన సూత్రధారి.

**పనివాళ్ల రూపంలో దోపిడీలు**

జోరా నేపాల్ కేంద్రంగా ఓ పెద్ద అంతర్జాతీయ దొంగల ముఠాను నడుపుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ ముఠా సభ్యులు నకిలీ ఆధార్ కార్డులతో ఢిల్లీ, ముంబై, బెంగళూరు వంటి పెద్ద నగరాల్లోని సంపన్నుల ఇళ్లలో పనివాళ్లుగా చేరతారు. యజమానుల నమ్మకం చూరగొన్న తర్వాత, వారికి మత్తుమందు ఇచ్చి లేదా బంధించి ఇళ్లలోని నగదు, బంగారం, విలువైన వస్తువులతో నేపాల్‌కు పారిపోవడం వీరి పద్ధతి. ఘటనా స్థలం నుంచి ఒక ఆటోమేటిక్ పిస్టల్, బుల్లెట్లు, దొంగతనానికి ఉపయోగించే పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీ, గురుగ్రామ్ పోలీసుల మధ్య బలమైన సమన్వయం వల్లే ఈ ఆపరేషన్ విజయవంతమైందని ఉన్నతాధికారులు తెలిపారు.

## 56.33 శాతం ఉన్న బీసీలకు 42 శాతం
# రిజర్వేషన్లు కల్పిస్తే అడ్డుకోవడమెందుకు?

**బీసీ సాధికారిక సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 7 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం చేపించిన కులగణన సర్వేలో బీసీ జనాభా 56.33శాతం తేలినందున, 42శాతం రిజర్వేషన్లు సమంజసమని భావించి హైకోర్టు సానుకూలంగా తీర్పు ఇస్తుందన్న ఆశాభావాన్ని బీసీ సాధికారిక సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్ వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బీసీలకు జనాభా దామాషా ప్రకారం న్యాయ పరంగా దక్కాల్సిన రిజర్వేషన్లను నాటి నుండి-నేటి వరకు కోర్టుల్లో అడ్డుకుంటున్న శక్తులకు ఈ ఎన్నికల్లో అడ్డుకట్ట వేస్తమన్నారు. 50 శాతం రిజర్వేషన్లు మించద్దన్నసుప్రీంకోర్టు తీర్పు ఉన్నప్పటికీ, 9 శాతం లేని అగ్రకుల పేదలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కేంద్రం ఆమోదిస్తే తప్పు లేదా అని ప్రశ్నించారు. 56.33 శాతం ఉన్న బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీఓ తీస్తే తప్పవుతుందా..బీసీల నోటికాడి బుక్క ఎందుకు లాక్కుంటున్నారన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏండ్లు గడుస్తున్నప్పటికి బీసీలకు రాజ్యాంగ ఫలాలు, స్వాతంత్ర్య ఫలాలు సక్రమంగా అందక పోవడంతో పాటుగా, బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా, ఉపాధి, ఉద్యోగ పరంగా సమ న్యాయం జరగడంలేదన్నారు. కొన్ని ఏండ్ల పోరాట ఫలితంగా, రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా కులగణన సర్వేలో బీసీ జనాభా 56.33 శాతంలో స్థానిక ఎన్నికల్లో,విద్య, ఉద్యోగాల్లో కేవలం 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ ,ప్రభుత్వం జీవో 9 ద్వార ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేస్తే,బీసీ వ్యతిరేకులు జీవో 9 ద్వార ఎన్నికలు జరపడం చట్ట విరుద్ధమని, బీసీల నోటికాడి బుక్కను ఎత్తగొట్టడానికి హైకోర్టును, సుప్రీం కోర్టును ఆశ్రయించడం ఎంతవరకు సమంజసమన్నారు. బిపి మండల్ కమీషన్(బిందేశ్వరీ ప్రసాద్ మండల్)కమీషన్ 1979 లో ఓబీసీలను గుర్తించి,దేశంలో 52 శాతం బీసిలుగా గుర్తించడం జరిగిందని,నాటి మండల కమీషన్ సిఫార్సు పై కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో విద్య,ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ,నాటి ప్రధాని విపి.సింగ్ ఆగష్టు 13,1990న ప్రకటిస్తే,రిజర్వేషన్ వ్యతిరేకులు కోర్టుల ద్వార అడ్డుకోగా,చివరకు 1992లో రిజర్వేషన్లు అమలయ్యేనని అదేవిధంగా,2018లో గత ప్రభుత్వం బీసీలకు స్థానిక ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ,జీవో 396 ను జారీ చేస్తే,బీసీ వ్యతిరేకులు సుప్రీం కోర్టు 2011లో 50 శాతం సీలింగ్ విధించిందని, కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారన్నారు. మళ్ళీ ఇప్పుడు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన 9 జీవోను హైకోర్టు,సుప్రీం కోర్టుల ద్వార అడ్డుకుంటున్నారని ఆయన మండి పడ్డారు. 50 శాతం రిజర్వేషన్లు దాటద్దని 2011లో సుప్రీం కోర్టు సీలింగ్ విదించిందని చెబుతున్న బీసీ వ్యతిరేకులు,50 శాతం మించవద్దని సీలింగ్ ఉండగా,9 శాతం లేని అగ్రవర్ణ పేదలకు కేవలం 10 రోజుల్లోనే 10 శాతం రిజర్వేషన్లను కేంద్రం ఆమోదిస్తే బీసీలు ఎవరు కూడ అడ్డు పడలేదన్నారు. అక్టోబర్ 8న హైకోర్టులో జరుగనున్న విచారణ బీసీలకు అనుకూలంగా తీర్పు వస్తుందన్న ఆశాభావాన్ని నరేందర్ వ్యక్తపరిచారు. అఖిలపక్షంతో ప్రభుత్వం పకడ్బందీగా ముందుకెళ్ళి రిజర్వేషన్లు సాధించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బీసీ సాధికారిత సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి ఇల్లందుల వెంకటేష్,నాయకులు ఉయ్యాల భూమయ్య గౌడ్, సిహెచ్,రామస్వామి గౌడ్, మల్లారం దేవయ్య,కుంభం రవీందర్,ఎట్టెం సాయికృష్ణ, మారం రాములు,పి.శ్రీనివాస్,గోలు పర్శరాములు, ఎద్దండి రమేష్,కె.శ్రీధర్ పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో
# ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి

**అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి**




**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 07 (జనంసాక్షి):** ఇతిహాసాలలో రామాయణానికి చాలా విశిష్టత ఉన్నదని, రామాయణం ద్వారా సీతారాముల వైభవాన్ని తెలుసుకుంటామని ఈ వైభవాన్ని చాలా చక్కగా వర్ణించినటువంటి మహనీయులు మహర్షి వాల్మీకి అని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు వాల్మీకి మహర్షి కి, వారి చిత్రపటానికి ఘనంగా పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహర్షి వాల్మీకి ప్రపంచానికి ఎంతో జ్ఞానాన్ని అందజేశారని, బ్రహ్మ అవతారంలో ఉన్నటువంటి మహర్షి వాల్మీకి బోధనలను చాలా శ్రేయస్కరమైనవని వారు గుర్తు చేశారు. మహర్షి వాల్మీకి బ్రహ్మ అవతారంలో ఉన్న వారిగా గుర్తించబడతాడని ప్రముఖ కావ్యమైన రామాయణాన్ని రచించి ధర్మం, విధివిధానాలను ధర్మం పాటించే బాధ్యతలను చాలా చక్కగా రూపొందించడమే కాకుండా శ్రీరాముని చరిత్రను చాలా చక్కగా వర్ణించడంలో వాల్మీకికి సాటి ఎవరూ లేరని కొనియాడారు. లవకుశలకు మహర్షి వాల్మీకి నిర్దేశించినటువంటి పద్ధతులను బోధించి తండ్రికి తగ్గట్టుగా తనయునిగా తీర్చిదిద్దారు. వారు వారి జయంతిని పురస్కరించుకొని ప్రాంగణంలో వారి విశిష్టతను తెలియపరచడమే కాకుండా రామాయణంలోని పలు పద్యాలను చాలా చక్కగా వర్ణించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని ఖండించిన అంబేద్కర్ సంఘం నాయకులు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయి మీద జరిగిన దాడిపై అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల బాబు జిల్లా అధ్యక్షులు కొత్తోల్ల గంగారాం తీవ్రంగా ఖండించారు. ఆయనపై కిశోర్ రాకేష్ అనే సీనియర్ న్యాయవాది దాడి జరిపి సనాతన ధర్మం వర్ధిల్లాలి సనాసధర్మంపై దాడి చేసిన వారు ఎవరిని ఉపేక్షించమని మాట్లాడడం చూస్తే ఈ యొక్క దాడి మతవాదులు చేస్తున్న దాడిగా భావించవలసివస్తుందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక అత్యున్నత హోదాలో ఉన్న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి మీద దాడి ఈ దేశ రాజ్యాంగనికే మాయని మచ్చగా అభివర్ణించారు. ఎస్సీ,ఎస్టీలు అత్యున్నత స్థాయిలో ఉండడాన్ని ఓర్వలేకనే మనువాదుల, మతవాదులు ఈ దాడులు చేస్తున్నారన్నారు. ఇలాంటి దాడులు దేశవ్యాప్తంగా ఎస్సీ ఎస్టీలు, బహుజనులు, ప్రజాస్వామ్య వాదులు ఖండించాలి. దీనిని మతవాదులు పెంచి పోషిస్తున్న ఉగ్రవాదుల చర్యగా భావిస్తున్నామని దీన్ని దేశ వ్యాప్తంగా ఉన్నటువంటి దళిత బహుజన సంఘాలు ఖండించాల్సిన అవసరం ఉందని కోరుతూ ఇది దేశవ్యాప్తంగా దళితుల మీద జరుగుతున్నటువంటి దాడిగా భావిస్తున్నామని తెలియజేశారు. కిషోర్ రాకేష్ పై దేశ ద్రోహం కేసు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.




## ఎంపీడీవో కార్యాలయంపై దాడి.. కంప్యూటర్ ధ్వంసం

**గట్టుప్పల్,మర్రిగూడ, అక్టోబర్ 7 (జనంసాక్షి) :** ఎంపీడీవో కార్యాలయం పై దాడి కంప్యూటర్ ధ్వంసం.నల్గొండ జిల్లా గట్టుప్పల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ ఘటనలో కార్యాలయంలోని కంప్యూటర్లు, మానిటర్లు, ప్రింటర్లు ధ్వంసమయ్యాయి. గట్టుప్పల్ ఎస్సై సంజీవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన గుండ్లపల్లి శ్రీశైలం వయస్సు (35)తండ్రి నారయ్య అనే వ్యక్తి మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారుల పనికి ఆటంకం కలిగిస్తూ కార్యాలయంలోకి దూసుకు వెళ్లి అక్కడ ఉన్న పరికరాలను ధ్వంసం చేశాడని ఎంపీడీవో వసంత లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు గట్టుప్పల్ ఎస్సై తెలిపారు.



## పాఠశాల అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

**రామగుండంలో పలు ప్రభుత్వ పాఠశాలలు తనిఖీ : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**గోదావరిఖని, జనంసాక్షి :** పాఠశాల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష రామగుండం ప్రాంతంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.రామగుండం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, దుర్గయ్య పల్లిలోని అప్పర్ ప్రైమరీ స్కూల్, గాంధీపార్క్ వద్ద ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో చేపట్టిన కాంపౌండ్‌వాల్, భవన నిర్మాణ పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొని రావాలని కలెక్టర్ ఆదేశించారు. ఆదర్శ పాఠశాలల్లో అవసరమైన వస్తువుల కల్పనకు ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ పంచాయతి అధికారులను సూచించారు. దుర్గయ్యపల్లి,గాంధీపార్క్ పాఠశాల అభివృద్ధి కోసం అందించిన ప్రతిపాదనలను పరిశీలించిన కలెక్టర్ అవసరమైన నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట డీఈఈ అప్పల్‌నాయుడు, ఏఈ నరేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులను పరిశీలించిన కలెక్టర్



**నిజామాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 07 (జనం సాక్షి) :** నిజామాబాద్ జిల్లా వర్ని మండలం సిద్ధాపూర్ వద్ద కొనసాగుతున్న రిజర్వాయర్ పనులను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం పరిశీలించారు. నీటి ప్రవాహాలతో కూడిన వాగులు, ఎత్తైన కొండ ప్రదేశాలను కాలి నడకన దాటుతూ, రిజర్వాయర్ బండ్ నిర్మిస్తున్న ప్రాంతాన్ని సందర్శించారు. ఇప్పటివరకు చేపట్టిన పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్లూయిస్ ల నిర్మాణానికి అవసరమైన స్థలం విషయమై రెవెన్యూ, అటవీ శాఖల మధ్య వివాదం నెలకొని ఉన్న ప్రదేశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. టోపో షీట్, గూగుల్ మ్యాప్ ల ఆధారంగా స్థల నిర్ధారణ కోసం రెవెన్యూ, అటవీ శాఖల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. స్థల వివాదానికి సంబంధించిన అంశాలపై తన వెంట ఉన్న బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా ఇతర అధికారులతో చర్చించారు. పరస్పర సమన్వయంతో సర్వే పూర్తి చేయాలని ఇరు శాఖల అధికారులను ఆదేశించారు. స్లూయిస్‌ల నిర్మాణానికి అటవీ భూమి అవసరం అయిన పక్షంలో భూసేకరణ, అనుమతుల కోసం ప్రభుత్వానికి నివేదిస్తామని అన్నారు. అప్పటిలోగా రిజర్వాయర్‌కు సంబంధించిన ఇతర పనులను వేగవంతంగా చేపట్టి పూర్తి చేయించాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఈ.ఈ రాజశేఖర్, ఎఫ్.డీ.ఓ సుధాకర్, తహసీల్దార్ సాయిలు ఉన్నారు.

# పొన్నం నీ నోరు భద్రం

**ఎంఆర్పీయస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు రుశేగాం భూమయ్య**

**కామారెడ్డి :** రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ నీ నోరు భద్రమని ఎంఆర్పీయస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు రుశేగాం భూమయ్య హెచ్చరించారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో మంగళవారం పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. మంత్రి పొన్నం నోరు అదుపులో పెట్టుకోవాలని లేదంటే ఖబర్దార్ అని పేర్కొన్నారు. మంత్రి పొన్నం సహచర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ని పట్టుకొని దున్నపోతు అన్నమాటను వెంటనే ఉపసంహరించుకొని వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా మైనార్టీలు ఏర్పాటు చేసిన సభకు హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ మైనారిటీ శాఖ మంత్రి అయిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ని ఉద్దేశించి జంతువులతో పోల్చిన అహంకారపు మాటలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక బీసీ మంత్రి అయి ఉండి సహచర మంత్రిని గౌరవించకుండా మాట్లాడిన మాటలకు సమాజం సిగ్గుతో తలవంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మా మంత్రిని అగౌరవ పరిచి, మాదిగల ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా వ్యవహరించిన పొన్నం మెట్టు దిగిరావాలని, లేనియెడల మా మాదిగల ఆగ్రానికి గురిగాక తప్పదని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు సింగం కాశీరాం మాదిగ, ఉమ్మడి జిల్లాల సలహాదారులు కంతి పోచీరాం మాదిగ, జుక్కల్ నియోజకవర్గ ఇన్చార్జ్ వెంది యాదవ రావు మాదిగ, మండల అధ్యక్షులు రవీందర్ మాదిగ, మారుతి మాదిగ, శంకర్ మాదిగ, మైపాల్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు రైలు ఢీకొని వ్యక్తి మృతి




**జమ్మికుంట,అక్టోబర్ 7 (జనం సాక్షి):** జమ్మికుంట మండలంలోని శాయంపేట గ్రామానికి చెందిన పంజాల సాగర్ (45) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబికులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు గ్రామంలో కిరాణంషాపు, ట్రాక్టర్ నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడని, మంగళవారం ఇంటి నుండి తన మోటార్ సైకిల్‌పై జమ్మికుంటకు కిరాణం సామానుకు వెళుతున్నానని,అలాగే ధర్మారంలో వరి చేను కోసేందుకు(హార్వెస్టర్) గిరాకీ కోసం చూసి వస్తానని చెప్పి వెళ్ళాడని, ఈ క్రమంలో ధర్మారం శివారు లోని ఎఫ్‌సిఐ సమీపంలో వరి చేను చూసి రైల్వే ట్రాక్ దాటుతుండగా ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు ఢీ కొని మృతి చెందాడన్నారు. మృతినికి బార్య మంజల, కూమారుడు అరుణ్ కుమార్, కూతూరు ఉన్నారు. ఇట్టి విషయంపై రామగుండం రైల్వే పోలీస్ అధికారి గంగారపు తిరుపతిని వివరణ కోరగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించిన ఆటో డ్రైవర్‌ను పరామర్శించిన కేటిఆర్

**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 07, (జనంసాక్షి) :** ఆటో ఆరు నెలల నుండి నడువడం లేదని బ్రతుకడం కష్టంగా ఉందని ఆటో ఫైనాన్స్ కట్టడం కూడా అవ్వడం లేదని, అప్పులు అధికమయ్యాయని మూడు రోజుల క్రితం నాంపెల్లి సతీష్ అనే ఆటో డ్రైవర్ ఆత్మహత్యయత్నం చేసుకొని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని అశ్విని ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మంగళవారం మాజీ మంత్రి, సిరిసిల్ల శాసనసభ్యులు కల్వకుంట్ల తారకరామారావు బాధితుడిని పరామర్శించారు. ఇలాంటి పని చేయడం సరైందికాదని నీకు భార్య జ్యోతి, ఇద్దరు చిన్న చిన్న కూతుర్లు ఉన్నారు కదా డాక్టర్ సాబ్ మంచోడు కనుక నిన్ను బ్రతికించిండు అంటూ అశ్విని ఆసుపత్రి నిర్వహకులు డాక్టర్ జి. సత్యనారాయణ స్వామి, డాక్టర్ అభినయ్‌లను అభినందించారు. అధైర్యపడకు సహాయం చేస్తా, ఆసుపత్రి ఖర్చులు పెట్టుకుంటా అంటూ సతీష్‌కు అతని కుటుంబ సభ్యులకు కేటిఆర్ భరోసా ఇచ్చారు. అనంతరం విలేకరుల సమావేశంలో కేటిఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని సంవత్సరానికి 1000 రూపాయలు ఇస్తామని మాయమాటలు చెప్పి ఆటో డ్రైవర్లను మోసం చేసిందన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాలో ఇప్పటివరకు 93 మంది ఆటో డ్రైవర్లు ఆటోలు నడువకుండా ఆత్మహత్యలు చేసుకొని చనిపోయారన్నారు. ఈ కుటుంబాలను ఆదుకోవాలని అసెంబ్లీలో పేర్లతో సహా తాను సమర్పించడం జరిగిందని ఈ కుటుంబాలకు 10లక్షల



ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేసిన ప్రభుత్వం ఇంతవరకు స్పందించ లేదన్నారు. ప్రక్క రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆటో డ్రైవర్లకు హామి ఇచ్చి వారికి ఆర్థికసహాయం అందించడం జరిగిందన్నారు. మన రాష్ట్రంలో రెండు సంవత్సరాలు అవుతున్నందున ఒక్కోక్క ఆటో డ్రైవర్‌కు 24వేల రూపాయలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించకుంటే బిఆర్ఎస్ పార్టీ మీ వెంట ఉందని మీతో కలిసి ఆందోళనలు నిర్వహిస్తామని అన్నారు. ఈ సమావేశంలో కెడిసిసిబి చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా కేంద్రంలోని ఎలక్షన్ గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 7 (జనం సాక్షి) :** మంగళవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా కేంద్రంలో గల ఎలక్షన్ గోడౌన్ జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ తో కలిసి సందర్శించి ఈవీఎంలను భద్రపరిచిన గదుల వద్ద రక్షణ చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సాధారణ తనిఖీల్లో భాగంగా ఈరోజు ఇవిఎం గోడౌన్ సందర్శించి రక్షణ చర్యలను పరిశీలించడం జరిగిందని అన్నారు. అదేవిధంగా ఇవిఎం గోడౌన్ లో సిసి కెమెరాలు 24 గంటలు పని చేసేలా చూడాలని, ఇసిఐ మార్గదర్శకాలు ప్రకారం నిరంతరం బందోబస్తు నిర్వహించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి తాసిల్దార్ జనార్ధన్, ఎలక్షన్ డిటి తదితరులు పాల్గొన్నారు.

## వీధి వ్యాపారులకు స్కానర్లు

**సుల్తానాబాద్,అక్టోబర్ 07(జనంసాక్షి) :** పట్టణంలోని వీధి వ్యాపారులకు డిజిటల్ లావాదేవీల కోసం పోస్ట్ ఆఫీస్ జారీ చేసిన క్యూ ఆర్ కోడ్ స్కానర్లను మున్సిపల్ కమిషనర్ టి. రమేష్ అందజేశారు మంగళవారం బల్దియా కార్యాలయములో లోక కళ్యాణ్ మేళా లో భాగంగా నిర్వహించిన కార్యక్రమములో కమిషనర్ తిప్పరాజు రమేష్ మాట్లాడుతూ,ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందటంలో పోస్ట్ ఆఫీస్ సేవలను ఉపయోగించుకోవాలన్నారు. పోస్టల్ బ్యాంక్ మేనేజర్ రాజేశ్ మాట్లాడుతు, పేమెంట్ బ్యాంక్ ద్వారా అందిస్తున్న అకౌంట్, జీవనజ్యోతి బీమా,ప్రమాద బీమా,డిజిటల్ లావా దేవిలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమములో మున్సిపల్ మేనేజర్ అలీమోద్దీన్ ఎస్ క్రాంతి కుమార్, మెప్మా సి. ఓ స్వరూప, ఆర్పిలు, అధిక సంఖ్యలో మహిళలు పోస్టల్ సిబ్బంది శ్రీకాంత్, మౌనిక, తిరుపతి, స్ట్రీట్ వెండర్స్ పాల్గొన్నారు.

## ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

**బోధన్, అక్టోబర్ 7 ( జనంసాక్షి ) :** బోధన్ విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలో విద్యార్థి సంఘ సమావేశంను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు విద్య రంగ సమస్యలపై అనేక విషయాలను చర్చించారు. ముఖ్యంగా బోధన్ పట్టణంలో ఉన్నటువంటి ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజుల వేధింపు ఎక్కువైందని దోపిడికి హద్దు అదుపు లేకుండా పోయిందని ఈ సందర్భంగా చర్చించడం జరిగింది. ఫీజుల దోపిడికి వ్యతిరేకంగా ఉద్యమించాలని చర్చించడం జరిగింది. ఫీజులు చెల్లించుటకు కట్ ఆఫ్ డేట్ లని పెట్టి విద్యార్థులకు వేధించడం సమంజసం కాదని అన్నారు స్కాలర్షిప్, రియాబర్స్మెంట్ రాలేదని క్లాస్ రూమ్ లో నుండి బయటకు పంపడం చేస్తే ఏమాత్రం సహించేది లేదని తేల్చి చెప్పారు ప్రవేట్ విద్యాసంస్థల్లో ఫీజులో దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించాలని ఏకగ్రీవంగా నిర్ణయించుకోవడం జరిగింది ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అండ ఉన్నదని మాకు ఎవరు ఏమి చేయలేరని కొందరు విద్యాసంస్థల యాజమాన్యాలు విర్రవీగుతున్నాయని వారిని చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. బోధన్‌లో మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని అలాగే ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ భవనాల అద్దె బిల్లులు చెల్లించాలని, పక్క భవనాలను నిర్మించాలని ,పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్




ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని తదితర అంశాలపై ఉద్యమ కారాచరణకి తీర్మానించడం జరిగింది విద్యారంగ సమస్యలపై ఎమ్మెల్యే దృష్టి కేంద్రీకరించాలని ఈ సందర్భంగా వారిని కోరారు. అలాగే గత 20 సం.లుగా ఆంధ్రప్రభ విలేకరిగా సేవలందించిన ఉమాకాంతన్నకి మౌనం పాటిస్తూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు నాగరాజు, గౌతమ్ కుమార్, సంజయ్, సాయికుమార్, మౌనిక మోసిన్, సంతోష్, రాజేందర్, బాలరాజు రాజన్న, జనార్దన్, శ్రీకాంత్, సతీష్, నరేష్, ప్రతాప్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల నివారణ కార్యక్రమాలను బలోపేతం చేయాలి

- **నూతన డిజిపిని కోరిన టి పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేష్ కాశిపాక**



**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 07 (జనంసాక్షి):** నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన బి. శివధర్ రెడ్డి ని మంగళవారం రోజు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశిపాక రాజేష్ హైదరాబాద్ లోని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా డీజీపీకి శుభాకాంక్షలు తెలిపి వినతి పత్రంను అందజేశారు. సైబర్ నేరాల నివారణ కార్యక్రమాలను, రాష్ట్రంలో పోలీసింగ్ ప్రజాభద్రతను మరింత బలోపేతం చేసే దిశగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని పౌరులందరికీ చట్టాన్ని సమర్థించడంలో శాంతి భద్రతలను నిర్ధారించడంలో మీ పదవీకాలం విజయవంతంగా నిర్వహించాలని రాజేష్ కోరారు. తెలంగాణ అంతటా ముఖ్యంగా కరీంనగర్ జిల్లా శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదని, కరీంనగర్ నగరం, గ్రామీణ ప్రాంతాలలో శాంతిభద్రతలు నేరాల నివారణపై ప్రజా అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా చేయవలసిన అవసరం మరింత ఎక్కువ ఉన్నదని డిజిపి దృష్టికి రాజేష్ తీసుకెళ్లారు. ఇటీవలి కాలంలో, సైబర్ నేరాలు, మహిళ లపై నేరాలు, ఈవ్ టిజింగ్, డ్రగ్స్ వాడకం వంటివి పెరిగిపోయినాయని, అంతేకాకుండా ఆన్‌లైన్ మోసం, వాటి వేధింపుల సంఘటనలతో రోజురోజుకు రాష్ట్ర ప్రజలలో ఆందోళన పెరుగుతోందని తెలిపారు. ఇందుకు పోలీస్ శాఖ ద్వారా స్థానిక ప్రతినిధులు, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో సైబర్ భద్రతతో పాటుగా, మహిళల భద్రత , సామాజిక సామరస్యంపై అవగాహన కార్యక్రమాలను విస్తరింపజేయడం చాలా ముఖ్యమైనవని వినతిపత్రంలో కోరారు. షీ టీమ్స్ , ఉమెన్ హెల్ప్ డెస్క్‌లు, సైబర్ అవేర్‌నెస్ సెల్‌లపై ప్రత్యేక దృష్టితో మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ విధమైన కార్యక్రమాలను హాట్‌స్పాట్ గా ఉండే ప్రాంతాలను, పాఠశాలల, ప్రజా సమూహా ప్రదేశాలకు విస్తరించాలని, జిల్లా స్థాయి సెన్సిటైజేషన్ కార్యక్రమాలు, ఆత్మరక్షణ వర్క్‌షాప్‌లతో పాటు డిజిటల్ భద్రతకు సంబంధించిన అవగాహన ప్రచారాలను చేపట్టి పౌరులలో ముఖ్యంగా యువతలో, మహిళలలో విశ్వాసాన్ని పెంపొందించడానికి పోలీసు శాఖ కృషి చేయాలని కోరారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ తరపున, రాష్ట్ర ప్రజలకు చట్టబద్ధమైన, శాంతియుత సురక్షితమైన జీవన పరిస్థితులను నిర్ధారించే లక్ష్యంతో జరిగే అన్ని కార్యక్రమాలలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పూర్తి సహకారంతో పోలీసు శాఖ సహకరిస్తుందని డిజిపికి రాజేష్ తెలిపారు. నేరాల నివారణ, సైబర్ భద్రతలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించ డానికి పోలీసు శాఖ, విద్యాసంస్థలు, సమాజ ప్రతినిధులతో కూడిన రాష్ట్రవ్యాప్త అవగాహన డ్రైవ్‌ను పరిగణనలోకి తీసుకోవాలని వారు కోరారు.

# హైడ్రా క్లారిటీ..!

- సోషల్ మీడియా దుష్ప్రచారాన్ని ఖండించిన హైడ్రా
- వాస్తవాలు వెలికి తీసేపనిలో పహాడీషరీఫ్ పోలీసులు

హైదరాబాద్, అక్టోబర్ 07 (జనంసాక్షి) : తుక్కుగూడ మున్సిపాలిటీ మంఖాల్ విలేజ్‌లో వర్టెక్స్ రియల్ ఎస్టేట్ సంస్థకు – చైతన్య రెడ్డికి మధ్య ఉన్న వివాదంలో తలదూర్చిన దళారులు.. దొంగలే దొంగా.. దొంగా అనేట్టు వ్యవహరిస్తున్నారు. హైడ్రా పేరు చెప్పి చైతన్య రెడ్డి నుంచి రూ. 50 లక్షలు తీసుకున్నకేసు విచారణను పహాడీషరీఫ్ పోలీసులు ముమ్మరం చేశారు. లోతైన విచారణ చేపట్టారు. ఈ కేసులో ఏ–2గా ఉన్న సుంకరి నరేష్ తో పాటు.. ప్రవీణ్, చందు శ్రీనివాస్ పహాడీషరీఫ్ పోలీసుల విచారణకు సహకరించకుండా.. రకరకాల ఎత్తుగడలతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో వారు వాడిన ఫోన్లను పోలీసులకు అప్పగిస్తే వాస్తవాలు బయటపడతాయి. ఫోన్లు పోయాయని ఒకరు.. పహాడీషరీఫ్ పోలీసులు విచారణకు రమ్మంటే.. రాకుండా మరొకరు కాలయాపన చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అవసరమైతే విచారణను చేపట్టాలని ఏసీబీని కూడా హైడ్రా కోరింది. ఇందుకు ఏసీబీ సమ్మతి వ్యక్తం చేయడమైందని హైడ్రా స్పష్టం చేసింది.

**ఫేక్ సర్టిఫికేట్లతో చెలామణి..**

చదువుకు సంబంధించి ఫేక్ సర్టిఫికేట్లతో లాయర్ గా చెలామణి అవుతున్న సుంకరి నరేష్‌ను బార్ కౌన్సిల్ సస్పెండ్ చేసిన విషయం విధితమే. ఈ విషయమై స్టే తెచ్చుకున్నప్పటికీ.. సుంకరి నరేష్ సర్టిఫికేట్లు ఫేక్‌వని నిర్ధారణ అయ్యింది. ఇలా మోసం, నేర చరిత్ర ఉన్న సుంకరి నరేష్.. మన తొలివెలుగు రఘుతో కలిసి రోజుకో అవాస్తవాన్ని కట్టుకథగా అల్లి దుష్ప్రచారం చేయడాన్ని హైడ్రా ఖండిస్తోంది. సుంకరి నరేష్ వాహనంలో మనతొలి వెలుగు రఘు వర్టెక్స్ వెంచర్ వద్దకు వెళ్లి కథనాలు ప్రసారం చేయడం వెనుక ఉన్న మతలబు ఏంటనేది పోలీసులు వెలికితీసే పనిలో ఉన్నారు. వారి కాల్‌డేటాతో పాటు ఫోను సంబాషణలు, మెసేజ్‌లను పోలీసులు పరిశీలిస్తున్నారు. రూ.50 లక్షలు సుంకరి నరేష్ కు ఇచ్చినట్టు చైతన్య రెడ్డి స్పష్టంగా చెప్పిన సాక్ష్యం హైడ్రా వద్ద ఉంది.




హైడ్రాతో పని పూర్తి చేస్తానని సుంకరి నరేష్ తన వద్ద రూ.50లక్షలు తీసుకున్నట్టు ఆమే పేర్కొంది.

**కేసు పెట్టిన తర్వాత చెక్కుల నాటకం..**

వివిధ కేసులు విచారణలో భాగంగా తనకు చైతన్య రెడ్డి రెండు చెక్కులు ఇచ్చారని, ఇందులో ఒకటి రూ. 10 లక్షలది కాగా.. రెండోది రూ. 20 లక్షలదంటూ సుంకరి నరేష్ చెబుతున్నారు. తనపై పహాడీషరీఫ్ పోలీసు స్టేషన్లో సెప్టెంబరు 4న కేసు నమోదవ్వగా.. ఆ చెక్కుల వ్యవహారం అదే నెల 8న బయట పెట్టారు. కాని ఆమె జూన్ నెలలోనే రూ.50 లక్షలు ఇచ్చినట్టు తెలిపారు. ఈ చెక్కులపై రాసిన రాతలు, వేసిన తేదీలు ఎవరు రాశారనేది కూడా తేల్చే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి చేతి రాతలు ఎవరివో తేల్చనున్నారు. మొత్తమ్మీద ఈ వ్యవహారంలో ఏసీబీ రంగంలోకి దిగితే అసలు వాస్తవాలు బయటపడతాయని హైడ్రా భావిస్తోంది. ఏసీబీతో దర్యాప్తు చేయించే విషయమై హైకోర్టు కేసులో తాము కూడా ఇన్‌ప్లీడ్ అవుతామని హైడ్రా స్పష్టం చేసింది.

# రికార్డు స్థాయిలో పెద్దపెల్లి ఎంసిహెచ్‌లో ప్రసవాలు

- మంచి వైద్య సేవలు అందిస్తున్న బృందానికి ప్రత్యేక అభినందనలు
- ప్రభుత్వ ఆసుపత్రులలో గణనియంగా మెరుగైన వైద్య సేవలు
- పెద్దపల్లి ఎంసిహెచ్ ను సందర్శించి వైద్య బృందాన్ని అభినందించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి,అక్టోబర్ 07(జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు మంచి వైద్య సేవలు అందిస్తున్న సిబ్బందికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేక అభినందనలు తెలిపారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పెద్దపల్లి ఎంసిహెచ్‌ను సందర్శించి వైద్య బృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో రికార్డు స్థాయిలో 250 ప్రసూతులు నిర్వహించినందుకుగాను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. శ్రీధర్‌ని, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. వాణిశ్రీ, ఆసుపత్రి ఆర్ఎం ఓ డా. విజయ్ కుమార్ లను, ఆసుపత్రి గైనకాలజిస్టులు, అనేస్తేటెస్టులు, పీడియాట్రిక్, రేడియాలజీ వైద్యులను,ఓటి సిబ్బంది అండ్ లేబర్ రూమ్ సిబ్బందిని సన్మానం చేయడము జరిగింది.జిల్లా ఆసుపత్రి లో గతంలో డెలివరీ లు సరాసరి 147 ఉండగా సెప్టెంబర్ నెలలో అత్యధికంగా అల్ టైం రికార్డు స్థాయిలో 250 డెలివరీ లు జరిగినాయి. ఈ సంవత్సరము లోనే ఏర్పాటు చేసిన నవజాత శిశు కేంద్రం ద్వారా 68 మంది నవ జాత శిశువు లకు చికిత్స అందించడం జరిగింది. గతం సరాసరి ఒపీ నెలకి 12571 ఉండగా గత సంవత్సర కాలంలో క్రమంగా పెరిగి ఈ నెల 26730కి చేరుకుంది. దీనిలో అధికంగా జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పీడీయాట్రిక్స్, గైనాకలజీ, కంటికి సంబందించిన ఒపీ, చెవి ముక్కు గొంతు, డెంటల్, స్కిన్ ఒపీ లు రెట్టింపు మరియు కొన్ని విభాగలలో మూడు రేట్లు పెరిగాయి. గతంలో ఇన్ పేషెంట్ ఒక నెలకు సరాసరి 1142 ఉండగా ఈ సెప్టెంబర్ 2025 నెలలో 2280 మంది ఇన్ పేషెంట్ సర్విస్ పొందారు. గతంలో ఆర్థోపెడిక్ సర్జరీలు సరాసరి నెలకు 12 మేజర్ 11 మైనర్ ఉండగా ఈ నెల 34 మేజర్ 27 మైనర్ శస్త్ర చికిత్సలు నిర్వహించడం జరిగింది. జనరల్ సర్జరీ గతంలో మేజర్ మరియు మైనర్ కలిపి 20 కాగా ఈ నెల 45 నిర్వహించారు.

గతంలో కంటి శస్త్ర చికిత్సలు పెద్దపల్లి లో ఆపరేషన్ థియేటర్ లేనందున మన కంటి వైద్యులు పెద్దపల్లి జిల్లా పేషెంట్ లను కరీంనగర్ ఆసుపత్రిలో సర్జరీ చేసేవారు. ఈ సంఖ్య నెలకు 31 ఉండగా, నూతనంగా ఏర్పాటు చేసిన కంటి ఆపరేషన్ థియేటర్ వల్ల సెప్టెంబర్ 2025 గాను 229 కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. గతంలో ఈఎన్‌టి డెంటల్ సర్జరీ లు నిర్వహించేవాళ్ళు కాదు. గత నెల 15 ఈ ఎన్‌టి ప్రొసీజర్స్ మరియు 529 డెంటల్ ప్రొసీజర్స్ నిర్వహించారు. గతంలో రక్త పరీక్షలు నెలకు 15595 సరాసరి చేసేవారు కాగా ఈ నెల 31014 రక్త పరీక్షలు నిర్వహించారు. గతంలో స్కానింగ్ సేవలు సరాసరి నెలకు 897 ఉండగా ఈ నెల 1960 స్కానింగ్ సేవలు చేశారు. గతంలో టిఫ్ఫా స్కానింగు లు జరిగేవి కావు. గత నెల 123 టిఫ్ఫా స్కానింగ్ లు నిర్వహించారు. గతంలో 2 డి ఎకో సేవలు ఉండేవి కావు, ఇప్పుడు గత నెలలో 164 2డి ఎకోలు చేయడం జరిగింది. గతంలో ఫిజియోథెరపీ సేవలు నెలకు 126 కాగా గత నెల 678 మందికి ఫిజియోథెరపీ సేవలు చేయడం జరిగింది. కావున పెద్దపల్లి జిల్లా ప్రజలు ఇట్టి ఉచిత సేవలను వినియోగించుకోవాలని తెలిపారు.ఈ పర్యటనలో కలెక్టర్ వెంట డిసిహెచ్ ఎస్ డాక్టర్ శ్రీధర్, డిఎంఅండ్‌హెచ్‌ఓ వాణిశ్రీ పాల్గొన్నారు.

## మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి



పెద్దపల్లి,అక్టోబర్ 07(జనంసాక్షి) మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాల సాధన దిశగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణు అన్నారు.మహాకవి వాల్మీకి జయంతి పురస్కరించుకొని మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఉత్సవ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణు పాల్గొన్నారు. మహాకవి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ మహాకవి వాల్మీకి హైందవ ధర్మానికి అతి ముఖ్యమైన గ్రంథం రామాయణాన్ని రచించారని, రామాయణ గ్రంథం ద్వారా అనేక విలువలను సమాజానికి అందించారని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. లిరామాయణం ద్వారా ఆదర్శ మానవుడికి ఉండవలసిన లక్షణాలు, మానవ సంబంధాలు, విలువలను మహాకవి మనందరికీ బోధించారని అన్నారు. మహాకవి వాల్మీకి రచించిన రామాయణం కారణంగానే మన దేశంలో కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉందని అదనపు కలెక్టర్ తెలిపారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన వసుదైక కుటుంబం అనే భావన రామాయణంతో ముడిబడి ఉందని అదనపు కలెక్టర్ తెలిపారు. మహాకావ్యం రామాయణాన్ని రచించిన మహాకవి వాల్మీకి జయంతిని పండగగా జరుపుకోవడం సంతోషకరమని అదనపు కలెక్టర్ తెలిపారు. అనంతరం వక్తలు మహర్షి వాల్మీకి జీవిత విశేషాలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు కలెక్టరేట్ సిబ్బంది, బీసీ సంఘాల పాల్గొన్నారు.

# సమర్థవంతంగా ఎన్నికల విధులు నిర్వహించాలి





- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 07 (జనంసాక్షి):** స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా నోడల్ అధికారులకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే తో కలిసి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, ఎన్నికల ప్రక్రియ నిర్వహణపై ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా విధులు కేటాయించబడిన అధికారులు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, మ్యాన్ పవర్, బ్యాలెట్ బాక్సెస్, రవాణా, శిక్షణ, సామాగ్రి నిర్వహణ, ఖర్చుల పరిశీలన, పరిశీలకులు, బ్యాలెట్ పేపర్ – పోస్టల్ బ్యాలెట్, మీడియా కమ్యూనికేషన్, హెల్ప్ లైన్, ఫిర్యాదులు–పరిష్కారాలు, ఓటర్ స్లిప్పుల పంపిణీ, నివేదికలు, వెబ్ కాస్టింగ్, ఫలితాల పర్యవేక్షణ అంశాలకు సంబంధించి నోడల్ అధికారులను నియమించామని తెలిపారు. ఈ విధులు కేటాయించబడిన అధికారులు ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఎలాంటి పొరపాట్లకూ తావు లేకుండా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనరాదని, అటువంటి వారిపై నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి ఇప్పటికే శిక్షణలో పూర్తి చేసామని, ఎన్నికల నిర్వహణకు బ్యాలెట్ బాక్స్ ల కొరత లేదని తెలిపారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా సాగేలా సమన్వయంతో కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ సీఈవో శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## ఈ నెల 9 నుంచి ఎంపీటీపీ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ

**చేవెళ్ల, అక్టోబరు 07 (జనంసాక్షి)** స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఈనెల 9వ తేది నుంచి 11వ తేది వరకు ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు నామిషన్ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఉంటుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, చేవెళ్ల ఎంపీడీవో హిమబిందు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు ఈనెల 9వ తేదిన ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామిషన్ స్వీకరించడం జరుగుతుందన్నారు. నామినేషన్లకు చివరి తేది 11వ తేది సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. 12వ తేదీన నామినేషన్ల సాయంత్రం 5గంటల వరకు ఉంటుందన్నారు. 13వ తేదిన తిరస్కరింపబడిన నామినేషన్లపై అప్పీలు, 14వ తేదిన పరిస్కరణ చివరి తేది. 15వ తేదీన నామినేషన్ల ఉపసహరణ మధ్యహ్నం 3 గంటలకు ఉంటుం దన్నారు. అదే రోజు సాయంత్రం ఎన్నికల పోటీలో ఉండే అభ్యర్థుల పేర్లు ప్రకటించడం జరుగుతుందన్నారు. ఈనెల 23వ తేదిన ఉదయం 7 గంటల నుంచి సాయంత్ర 5 గంటల వరకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారులు స్పష్టం చేశారు.

## ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది


**చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య**



**మొయినాబాద్ అక్టోబర్ 07జనం సాక్షి :** ఉద్యోగరిత్య పదవీ విరమణ సహజమేనని ఉపాధ్యాయ వృత్తి సమాజంలో ఎంతో గొప్పదని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని చిన్నమంగళారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేసిన ఎస్.వెంకటయ్య పదవీ విరమణ అభినందన సభను పిజిఆర్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొని పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు వెంకటయ్యను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య, రాష్ట్ర పీఆర్టీయూటీఎస్ అధ్యక్షులు పుల్లం దామోదర్ రెడ్డిలు మాట్లాడుతూ.. 40 సంవత్సరాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో వెంకటయ్య చేసిన సేవలు మరచిపోలేనివన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి అంకిత భావంతో ఉపాధ్యాయ వృత్తిలో మంచిపేరు తేవడం ఆయన వ్యక్తిత్వం అన్నారు. ఉద్యోగరిత్యా పదవీ విరమణ తప్పదని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో పదోన్నతులు త్వరలో జరగబోతున్నాయన్నారు. ఈహెచ్‌ఎస్ ద్వారా ఉపాధ్యాయులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1వ తేదీన ఇందిరాపార్కు వద్ద ఓపీఎస్ సాధనకు పీఆర్టీయూ ధర్నా కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్నమంగళారం మాజీ సర్పంచ్ బాలమణి రాములు, పూలగుళ్ల గోపాల్ రెడ్డి, ఆంజనేయులుగౌడ్, మల్లేష్, ఎం.ప్రభాకర్, ఉపాధ్యాయ సంఘం నాయకులు గిరిధర్ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్ రెడ్డి, ఎస్టియూ రాష్ట్ర అధ్యక్షులు సదానంద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పోచయ్య, సామాల మహేందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, రాఘవేందర్, జగన్మోహన్ గుప్తా, గోవర్ధన్ యాదవ్, నారాయణగౌడ్, మండల విద్యాధికారి మల్లయ్య, పీఆర్టీయూ మండల అధ్యక్షులు జక్కని బందయ్య, ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు హమీద్, లక్ష్మణ్, సత్యనారాయణ, రాములు, శివకుమార్, విజయాబాయ్, నరేందర్, వేణుగోపాల్, హైమావతి, శ్రీలత, నారాయణ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్‌ను సమస్యలు లేని పురపాలికగా తీర్చిదిద్దాలి

**శంషాబాద్ ఇన్చార్జ్ కమిషనర్ శరత్ చంద్ర**




**రాజేంద్రనగర్, అక్టోబర్7(జనంసాక్షి) :** శంషాబాద్ పురపాలక సంఘం పరిధిలో సమస్యలు లేని పురపాలికగా తీర్చిదిద్దాలని శంషాబాద్ ఇంచార్జ్ కమిషనర్ బి. శరత్ చంద్ర పేర్కొన్నారు. మంగళ వారం కౌన్సిల్ హాలు యందు ఆయన అన్ని విభాగాల అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ వార్డులలో పారిశుద్ధ్య పనులు నిర్వహణ, ట్రేడ్ లైసెన్స్, జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీ, ఎల్ఆర్ఎస్, భవన నిర్మాణ అనుమతుల పట్ల పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, అక్రమ నిర్మాణల పై నోటిసులిచ్చి చర్యలు తీసుకోవాలని, ప్రకటనల పన్నుల వసూలు కోర్టు కేసులు, నూతన సంఘాల ఏర్పాటు, అలాగే స్ట్రీట్ వెండర్స్ జోన్స్ విధానం, భువన్ జీయో ట్యాగ్గింగ్, ఆస్తి పన్ను వసూలు, ఆన్–అస్సెస్డ్, అండర్ అస్సెస్డ్ పన్ను విధింపు, ఇంజినీరింగ్ విభాగంలో వివిధ వార్డులలో అభివృద్ధి పనుల పురోగతి, నూతన పనులు చేపట్టుట, వీధి దీపాల నిర్వాహణ, రిపైర్స్, వన మహోత్సవం నందు లక్ష్యం ప్రకారము మొక్కలు నాటుట, సంరక్షణ పై వివిధ శాఖల అధికారులతో పనులపై ఆరా తీసి, సమీక్ష సమావేశం పై వేగవంతం చేయాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిఈఈ షేక్ సాదిక్, మేనేజర్ శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

# కోణార్క్.. మోనార్క్

## ట్రేడ్ లైసెన్స్ లేకుండానే వ్యాపారం

- అడ్డుకునే వారెవరు..?
- ఆదాయాన్ని కోల్పోతున్న ఖమ్మం కార్పోరేషన్




**ఖమ్మం, అక్టోబర్ 07 (జనంసాక్షి) :** ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో వ్యాపారం ప్రారంభించడానికి ట్రేడ్–లైసెన్స్ తీసుకోవడం తప్పనిసరి. ట్రేడ్–లైసెన్స్ అనేది స్థానిక మునిసిపల్ అధికారులు ఇచ్చే అధికారిక అనుమతి పత్రం. ఒక వ్యక్తి.. సంస్థకు నిర్దిష్ట స్థలంలో, నిర్దిష్ట వాణిజ్య కార్యకలాపాలు చట్టబద్ధంగా నిర్వహించేందుకు దీనిని జారీ చేస్తారు. ఈ లైసెన్స్ ద్వారా వ్యాపారం స్థానిక చట్టాలు, నిబంధనలు, ప్రజారోగ్యం, భద్రతా ప్రమాణాలనుసారంగా ఉన్నదని ధృవీకరించబడుతుంది. సరుకుల విక్రయం, సేవలందింపు వంటి వాణిజ్య కార్యకలాపాలను నిర్వహించడానికి ఈ అనుమతి అవసరం. కొత్త వ్యాపారం ప్రారంభించే ముందు లేదా వ్యాపార రీ–న్యూవల్ కోసం ముందుగా లైసెన్స్ పొందవలసి ఉంటుంది.

**ట్రేడ్ లైసెన్స్ లేకుండానే వ్యాపారం..**

వ్యాపారం చేయాలంటే ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి. ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో మాత్రం ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలనే ఆలోచన కూడా కొంతమంది వ్యాపారులు చేయడం లేదు. కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం, వ్యాపారుల తప్పించుకు తిరిగే ధోరణి వెరసి నగరపాలక సంస్థకు రావలసిన ఆదాయానికి గండి పడుతుంది. ఖమ్మం నగరంలో వైరా రోడ్డు పక్కనే నిర్వహిస్తున్న కోణార్క్ హెూటల్ యాజమాన్యం తీరు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఈ హెూటల్ ను పలువురు నాయకులు ప్రారంభించారు. వీరికి ప్రారంభోత్సవాలకు ఆహ్వానిస్తే సరిపోతుంది. కనీసం ఆ హెూటల్ నిర్వహణకు నగరపాలక సంస్థ నుంచి అనుమతి పొందారో లేదో అనే విషయాన్ని మాత్రం పట్టించుకోరు. ఫలితంగా కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. నిత్యం నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహిస్తున్న వ్యాపారాలను తనిఖీ చేసి ట్రేడ్ లైసెన్సులు జారీ చేశారా? లేదా?.. అని పరిశీలించాల్సిన నగరపాలక సిబ్బంది నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. నగరంలో ఐదు అంతస్తుల సముదాయంలో నిర్వహిస్తున్న ఈ హెూటల్ ఎటువంటి ట్రేడ్ లైసెన్స్ లేకుండానే గత ఆరు నెలలుగా నిర్వహిస్తున్నారంటే కార్పొరేషన్ లో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ హెూటల్ పై అనేక ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఈ హెూటల్ లో ఉన్న రెస్టారెంట్ లో బిర్యానీలో బొద్దింక రావడంతో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఖమ్మంలో అనేక వాణిజ్య,వ్యాపార సముదాయాలు ట్రేడ్ లైసెన్సులు లేకుండానే నిర్వహించడం గమనార్హం. వీటిపై నగరపాలక సంస్థ కమిషనర్ దృష్టి సారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చి, నగరపాలక సంస్థకు సైతం ఆదాయం పెరుగుతుంది.

కోణార్క్ హెూటల్‌కు ట్రేడ్ లైసెన్స్ జారీ చేశారా లేదా అని జనం సాక్షి ప్రతినిధి వార్డు ఆఫీసర్, నగరపాలక సంస్థ సూపర్వైజర్‌ను వివరణ కోరగా, లైసెన్స్ జారీ కోసం యాజమాన్యాన్ని సంప్రదించామని, వారం రోజులు గడువు కోరారని తెలిపారు. గత ఆరు నెలలుగా వ్యాపారం సాగిస్తున్న హెూటల్ యాజమాన్యానికి నోటీసులు ఇవ్వకుండా ఇలా గడువు ఇవ్వడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

## ఎన్నికల నిబంధనలపై అధికారులు
# సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి

**క్రిటికల్ పోలింగ్ కేంద్రాల ఎంపిక పూర్తి చేయాలి**

- స్థానిక సంస్థల ఎన్నికలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, అక్టోబర్ 07 (జనంసాక్షి) :** ఎన్నికల నిబంధనలపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ట్రైనీ కలెక్టర్ బనావత్ వనజ తో కలిసి స్థానిక సంస్థల ఎన్నికల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలు కట్టుదిట్టంగా నిర్వహించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ తమకు అందించిన హ్యాండ్ బుక్ లను ఒకటికి రెండుసార్లు పూర్తి స్థాయిలో చదివి ఎన్నికల నిర్వహణలో తమ బాధ్యతలను పూర్తిగా అర్థం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.ప్రతి మండలంలో ఉన్న క్రిటికల్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓలు, తహసిల్దార్, స్థానిక పోలిస్ అధికారులు సమన్వయంతో గుర్తించాలని అన్నారు. గత ఎన్నికల సమయంలో జరిగిన అంశాలను దృష్టిలో పెట్టుకొని పోలింగ్ కేంద్రాల సజావుగా గుర్తించాలని అన్నారు.గత ఎన్నికల సమయంలో 75% కంటే ఎక్కువ ఓటింగ్ ఒకే పార్టీ లేదా అభ్యర్థికి ఓట్లు పడినట్లయితే ఆ ప్రాంతాన్ని క్రిటికల్ పోలింగ్ కేంద్రంగా ఎంపిక చేయాలని అన్నారు. గత ఎన్నికల సమయంలో ఎక్కడైనా ఎన్నికల బహిష్కరణ జరిగిందా ఇటువంటి అంశాలను దృష్టిలో పెట్టుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ నరేందర్, డిపిఓ వీర బుచ్చయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొమురం భీం ఆశయ సాధనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

### మంత్రి జూపల్లి కృష్ణారావు



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 7( జనం సాక్షి) : జల్ జంగల్ జమీన్ పోరాటయోధుడు, గిరిజన ప్రజల ఆరాధ్య దైవం కొమరం భీమ్ ఆశయ సాధనకు కృషి చేస్తున్నట్లు జిల్లా ఇన్చార్జ్ మంత్రి, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్ గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కొమరం భీమ్ 85 వర్ధంతి సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం అక్కడ కొమరం భీం విగ్రహానికి నివాళులు అర్పించారు. జోడేఘాట్ ప్రాంతాన్ని ఒక పర్యాటక, ప్రసిద్ధ ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. గిరిజనులకు తమ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు తీసుకువచ్చి అమలు చేస్తుందని అన్నారు. ఇక్కడ ఈ ప్రాంత గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకంగా రోడ్ల నిధులు రోడ్లకు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విటల్, ఎమ్మెల్యే కోవలక్ష్మి, జిల్లా కలెక్టర్ వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే కోనప్ప తదితరులు కొమరం భీం విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు.

# రైలు నుంచి అన్నదమ్ముల తోసివేత

- ఒకరు మృతి.. ప్రాణాపాయంలో మరొకరు

హైదరాబాద్, అక్టోబరు7 (జనంసాక్షి) : హైదరాబాద్ నుంచి ఢిల్లీకి వెళుతున్న దక్షిణ ఎక్స్‌ప్రెస్‌లో తాజాగా షాకింగ్ ఘటన వెలుగు చూసింది. ఇద్దరు అన్నదమ్ముల్ని తోటి ప్రయాణికుడు రైలు నుంచి కిందకు తోసేయడంతో ఒకరు మరణించగా మరొకరు కోమాలోకి వెళ్లిపోయారు. ఘట్‌కేసర్ వద్ద ఈ దారుణం జరిగింది. బాధితులను మధ్యప్రదేశ్‌కు చెందిన చంద్వాని సోదరులుగా పోలీసులు గుర్తించారు. అన్నకు 33 ఏళ్లు, తమ్ముడికి 30 ఏళ్లు అని చెప్పారు. వారి మధ్య ఘర్షణకు కారణం ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనలో తీవ్ర గాయాల పాలైన తమ్ముడు అక్కడికక్కడే మృతి చెందగా అన్న కోమాలోకి వెళ్లిపోయాడు. ప్రస్తుతం అతడికి ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్సను అందిస్తున్నారు.

# గాజా ప్రజలకు సంఘీభావంగా ర్యాలీ

- నాయకులను అరెస్టు చేసిన పోలీసులు




హైదరాబాద్ (జనంసాక్షి) : పాలస్తీనా సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ అశోక్ నగర్ నాలా నుండి ఇందిరా పార్కు వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అన్ని వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పడిన సంఘీభావ కమిటీ ప్రదర్శనకు అనుమతిని కోరింది. పోలీసులు ముందుగా వివిఎస్‌టి పార్కు నుండి ఇందిరా పార్కు వరకు ప్రదర్శనకు అనుమతిని తెలిపారు. నిన్న రాత్రి నుండి వి.ఎస్.టి. నుండి ప్రదర్శనకు అనుమతి నిరాకరిస్తున్నామని ప్రకటించారు. ఎన్ని విధాలుగా విజ్ఞప్తి చేసినా అనుమతించలేదు. అంతిమంగా అశోక్ నగర్ నాలా నుండి పార్కు వరకు ప్రదర్శన జరిపారు. 'అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి', ఇజ్రాయిల్ దురహంకార వైఖరి నచించాలి, నెత్యన్యాహును శిక్షించాలి, పాలస్తీనాకు స్వతంత్రతనివ్వాలనీ, పాలస్తీనా ప్రజలకు సంఘీభావం ప్రకటిస్తున్నామని నినదించారు. అనంతరం జరిగిన సభలో అజీజ్ పాషా (సీపీఐ), జాన్ వేస్లీ (సీపీఎం), కె. రమ సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్, బి. ప్రదీప్ (సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ)), గాదరగోని రవి (ఎంసీపీఐ), మురహరి (ఎస్‌యుసీఐ), ఆరెల్లి కృష్ణ (సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ), అజీజ్, ఎంపీజే నాయకులు, (జమాతె హింద్) ఖలీదా పర్వీన్, కెవిఎల్ (ఎఐపిఎస్ఓ) ప్రొఫెసర్ అన్సారీ, సర్ఫరాజ్ (ఎస్ఐఓ), భార్గవి (ఐపిఎస్‌పి), బోస్ (ఎఐపిఎఫ్), తదితరులు ప్రసంగించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సీపీఎం నాయకులు మహేందర్, సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ గ్రేటర్ కార్యదర్శి ఎం. హన్మేశ్, ఝాన్సీ (సీపీఐ (ఎం.ఎల్) ఎన్‌డి జిల్లా కార్యదర్శి), అనిల్ కుమార్ (ఎంసీపీఐ), తేజ్ (యస్ యుసీఐ (సి), విజయ్ అధ్యక్ష వర్గంలో సభ జరిగింది.

సీపీఐ, సీపీఎం, సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్, సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, ఎంసీపీఐ, ఎస్ యుసీఐ, ఎన్.డి.ల రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ దశాబ్దాలుగా ఇజ్రాయిల్, పాలస్తీనాపై దురాక్రమణ దాడులు చేస్తోందన్నారు. ఇజ్రాయిల్ దేశం ప్రారంభమయిన 1948 నుండే కక్ష్యపూరితంగా, అమెరికా సామ్రాజ్యవాదం వత్తాసుతో దురహంకారంగా దాడులూ, యుద్ధాలు చేస్తోందన్నారు. గత 2 సం?లుగా 70 వేల మంది పాలస్తీనా ప్రజల్ని హత్యగావించారన్నారు. అందులో సగం పిల్లలు, మహిళలూ, వృద్ధులేనని అన్నారు. సగటున రోజుకు వంద మందిని మృత్యువుకు గురి చేస్తున్నారన్నారు. వందలాది మంది జర్నలిస్టులను హత్య చేస్తోందన్నారు. ప్రస్తుతం పూర్తిగా ఇజ్రాయిల్, గాజాను దురాక్రమించిందన్నారు. 20 లక్షల జనాభాను ఖాళీ చేయించి, రిసార్టు నిర్మిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంపు వ్యాఖ్యానించడం దుర్మార్గమైనది. గాజాపై యుద్ధాన్ని, లేదా దాడులను ఆపాలనీ ముక్తకంఠంతో ప్రపంచం హెూరెత్తినా చలించడం లేదన్నారు. ఆహారం, నీళ్ళు, గ్రాసం, ముడి సరుకులు లేకుండా కరువుకు గురిచేసి ప్రజలను చంపుతున్నారన్నారు. ఐక్యరాజ్య సమితి, ఇతర దేశాల ఆహార ట్రక్కులను సరిహద్దుల్లో ఆపడం, వాటి కోసం ఎదురుచూస్తున్న ప్రజల్ని వెంటపడి చంపడాన్ని సమాజం ఎలా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. వెంటనే దాడులను ఆపి పాలస్తీనాకు 145 దేశాలు గుర్తించినట్లుగానే, ఇజ్రాయిల్, అమెరికాలు గుర్తించాలని డిమాండ్ చేశారు. పాలస్తీనా ప్రజలకు హైదరాబాదీల సంఘీభావం ప్రకటిస్తున్నామని అన్నారు. ప్రపంచం గాజాను కాపాడుకుందామని సంఘీభావం ప్రదర్శించారు. సభ జరుగుతున్న సందర్భం లోనే పోలీసులు రాష్ట్ర జిల్లా నాయకులను అరెస్ట్ చేసి దోమల గూడా,. చిక్కడపల్లి స్టేషన్ లలో ఉంచారు. సాగర్, డి.జి. నర్సింహరావు, అబ్బాస్ (సీపీఎం), ధర్మేంద్ర, వలివుల్లా ఖాద్రి (సీపీఐ), కె. సూర్యం, ఎస్.ఎల్. పద్మ, సదానందం (మాస్ లైన్), జె.వి. చలపతిరావు, అరుణ, అనురాధ (న్యూడెమోక్రసీ), వీక్షణం వేణుగోపాల్, రవిశర్మ, సజయ్, కన్నెగంటి రవి, వినాయక రెడ్డి, తదితరులు చాలా మంది హాజరయ్యారు.

### తీవ్రంగా ఖండించిన తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు

గాజాపై ఇజ్రాయిల్, అమెరికా చేస్తున్నా జాతి హననానికి వ్యతిరేకంగా పోరాడుదామని గాజా ప్రజలకు సంఘీభావం ప్రకటిద్దాం అని పిలుపునిస్తూ హైదరాబాద్‌లో పాలస్తీనా సంఘీభవా కమిటీ ఆధ్వర్యంలో వివిధ కామ్యూనిస్ట్, ప్రజా సంఘాల నాయకులు ర్యాలీ చేపట్టారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుండి ఇందిరా పార్క్ వరకు సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర కో –ఆర్డినేటర్ కర్రె సత్యనారాయణ మద్దతు ప్రకటించి పాల్గొన్నారు.





# ధాన్యం దిగుబడిలో తెలంగాణా రికార్డ్

- 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి
- 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధం
- రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి) : ధాన్యం దిగుబడిలో తెలంగాణా రాష్ట్రం యావత్ భారతదేశంలోనే సరికొత్త రికార్డు సృష్టించబోతుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. వానాకాలం సీజన్ లో 148 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి ఉంటుందని ఆయన తెలిపారు.దేశ చరిత్రలోనే ఇప్పటి వరకు ఇంతటి దిగుబడి ఎక్కడా నమోదు కాలేదని ఆయన అన్నారు. వానాకాలం ధాన్యం కొనుగోలు పై పౌర సరఫరాల కేంద్ర కార్యాలయం ఆయన సమీక్ష నిర్వహించారు. పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, డైరెక్టర్ తదితర అధికారులు ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నీటిపారుదల విస్తరణతో తెలంగాణా రాష్ట్రం సాధించిన వృద్ధి ధాన్యం దిగుబడిలో ప్రస్ఫుటమౌతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 67.57 లక్షల ఎకరాలలో జరిగిన వరి సాగులో 40.75 లక్షల ఎకరాలలో సన్నాలు,26.82 లక్షల ఎకరాలలో దొడ్డు వడ్ల సాగు చేశారన్నారు. ఇందులో సన్నాలు 90.46 లక్షల మెట్రిక్ టన్నులు,దొడ్డు రకం 57.84 లక్షల మెట్రిక్ టన్నులు మొత్తం కలిపి 148.30 లక్షల ధాన్యం దిగుబడి అంచనా వేస్తున్నట్లు ఆయన వివరించారు. తెలంగాణా రాష్ట్రం ఆవిర్భావం తరువాత ఇంత పెద్ద ఎత్తున ధాన్యం దిగుబడి అరుదైన రికార్డుగా ఆయన అభివర్ణించారు.భారతదేశ చరిత్రలోనే ఇది సరికొత్త రికార్డుగా నమోదు అవుతుందన్నారు 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు.కనిష్ట మద్దతు ధర కింద కొనుగోలు మొత్తానికి 21,112 కోట్ల రూపాయలు అబుతుందని అంచనా వేస్తున్నట్లు ఆయన చెప్పారు.ఇందులో నేరుగా రైతులకు చెల్లింపుల కింద 19,112 కోట్లు ఖర్చు కానున్నట్లు ఆయన తెలిపారు.కేంద్ర ప్రభుత్వం బియ్యం సబ్సిడీ నిమిత్తం చెల్లించాల్సిన 6,500 కోట్లు తక్షణమే విడుదల ఆయన డిమాండ్ చేశారు.రైతులకు మద్దతు ధర చెల్లించడంలో జాప్యం కాకుండా ఉండేందుకు దోహదపడుతుందన్నారు. ప్రభుత్వంపై నమ్మకంతో రైతాంగం రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి చేసిన నేపద్యంలో కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపులలో ఆలస్యం కాకుండా చూడాలి అన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి అయిన నేపద్యంలో ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిలువ ఉంచేందుకు గాను గిడ్డంగుల కొరత ఉండడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం దిగుబడిలో తెలంగాణ సాధించిన రికార్డును కేంద్రం గుర్తించి సహకరించాలని ఆయన కోరారు. తెలంగాణా రాష్ట్రం వరి దిగుబడిలో సాధించిన రికార్డ్ ను ఆయన గణాంకాలతో సహా వివరించారు. 2019-20 లో 72 లక్షల మెట్రిక్ టన్నుల నుండి 2025-26 నాటికి ఏకంగా 148.30 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడికి చేరింది అంటే నీటిపారుదల శాఖా సాధించిన విజయానికి సంకేతం అని ఆయన చెప్పారు. బలమైన సంకల్పంతో పాటు ఆధునిక పద్దతిలో కొనుగోళ్లు జరపడం తెలంగాణా రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన భరోశయో కారణామన్నారు. అత్యల్ప కాలంలో వరి దిగుబడి రెట్టింపు కావడం రాష్ట్ర వ్యవసాయ రంగంలో నూతన అధ్యాయమన్నారు. కొనుగోళ్ల అంశంలో అధికారులు ఎఫ్.సి.ఐ తో సమన్వయం చేసుకుని ప్రణాళికలు రూపొందించుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

# ఖమ్మంను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

### ప్రజలకు మంత్రి తుమ్మల సూచన



ఖమ్మం, అక్టోబర్ 7 (జనంసాక్షి) : ఖమ్మం నగరాన్ని అందంగా తీర్చి దిదద్దడంతో పాటు, పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యమని, అందుకు ప్రజలు కూడా సహకరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నగరంలో రోడ్లు, డ్రైనేజీలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం పట్టణం గతంలో చిన్న పంచాయతీగా ఉండేది, కేవలం 4 వేల జనాభా మాత్రమే ఉండేవాళ్లు అన్నారు. ఇక, మీ డివిజన్లను మీరే పరిశుభ్రంగా ఉంచుకోవాలి, డివిజన్ కు కావలసిన మౌలిక సదుపాయాలు కమిషనర్ అభిషేక్ అగస్త్యను సంప్రదించండి అని సూచించారు. మన కార్పొరేషన్ ను చూసి ఇతర ప్రాంతాలు నేర్చుకునేలా ఉండాలి అన్నారు. నగరం ప్రశాంతమైన వాతావరణం ఉండాలి, కక్ష్యలకు, కార్పణ్యాలకు దూరంగా ఉండాలని మంత్రి తుమ్మల కోరారు. అయితే, ఉన్నతమైన చదువులు చదివితే ఆ కుటుంబం పేదరికాన్ని వీడుతుంది అని మంత్రి నాగేశ్వరరావు తెలిపారు. నగర వాసులకు హైదరాబాద్, అమెరికా కంటే మంచి చదువు ఖమ్మం నగరానికి వస్తుంది అని భరోసా ఇచ్చారు. పోలీసులకు సూచించా పార్టీల పరంగా పోలీసులు ఎవరి పైనా కేసులు పెట్టొద్దని.. అలాగే, రోడ్ల వెడల్పు కోసం నాయకుల ఇండ్ల అయినా కొంత తీసుకోక తప్పదు అన్నారు. బైపాస్ రోడ్డు వేసినప్పుడు నన్ను తిట్టుకున్నారు, ఇప్పుడు బైపాస్ రోడ్డు కూడా జామ్ అవుతుంది.. ఇంకా రెండు మూడు వందల కోట్ల రూపాయలు సీఎం రేవంత్ రెడ్డినీ అడిగి తీసుకుని వస్తాను.. గుడిసెల్లో బ్రతికే పేదలకు ఇళ్లు ఇచ్చే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు. పేదలకు మంచి చేసే విధంగా రాజకీయం ఉండాలి, ఇబ్బంది పెట్టే విధంగా ఉండకూడదని తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.

# ఆరోగ్య దాతకు అరుదైన అవార్డ్

- 'డాక్టర్ బంగారి రజనీ ప్రియదర్శిని'ని వరించిన టైమ్స్ ఆఫ్ ఇండియా హెల్త్ కేర్ ఐకాన్ అవార్డ్




కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 07 (జనంసాక్షి): తెలంగాణా లో ఇన్ఫర్టిలిటీ వైద్య విభాగంలో అత్యుత్తమ సేవలు అందించినందుకు గాను ఎంతో ప్రతిష్టాత్మకమైన టైమ్స్ ఆఫ్ ఇండియా హెల్త్ కేర్ ఐకాన్ అవార్డ్ 2025 ను డాక్టర్ బంగారి రజనీ ప్రియదర్శిని అందుకున్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా వారు ప్రతి సంవత్సరం ఈ అవార్డ్స్ రాష్ట్ర స్థాయిలో వైద్య రంగంలో అత్యున్నత సేవలను అందించిన ప్రముఖ వైద్యులకు ప్రధానం చేస్తారు. కేవలం వైద్యమే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లో తమ వంతు బాధ్యతను నిర్వర్తించే వారిని ఎంపిక చేయడం జరుగుతుందని, దీనిలో భాగంగా కరీంనగర్ కి చెందిన రజనీ ఫెర్టిలిటీ సెంటర్ చైర్మన్, ప్రముఖ వైద్య సంస్థ అయిన రెనే హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ అయిన సీనియర్ వైద్యులు డా.బంగారి రజనీ ప్రియదర్శిని ఈ అవార్డ్‌ను సోమవారం రోజు తాజ్ డక్కన్ హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో ఎల్.వి.ప్రసాద్ ఐ హాస్పిటల్ చైర్మన్ డా.నాగేశ్వర్ రావు చేతులమీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా డా.రజనీ ప్రియదర్శిని మాట్లాడుతూ... నేడు యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య సంతానలేమి అని దానిని అధిగమించాలంటే ఆరోగ్య కరమైన జీవన విధానం, సరైన వ్యాయామం అవసరమని అన్నారు. ప్రతి సంవత్సరం తన అత్తగారైన కీ.శే.బంగారి లక్ష్మీ స్మారకర్థం పదిమంది దంపతులకు ఉచితంగా ఇన్ఫర్టిలిటీ వైద్యాన్ని అందించడం జరుగుతుందని అన్నారు. ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చిన తనకు ఈ అవార్డ్ రావడం ఎంతో సంతోషంగా ఉందని, ఈ అవార్డ్ తో తన బాధ్యత ఇంకా పెరిగిందని అన్నారు. తనను ప్రతిక్షణం ప్రోత్సహిస్తూ.. ఈ అవార్డ్ రావడం సహకరించిన తన భర్త ప్రొఫెసర్ డా.బంగారి స్వామి, కుటుంబ ప్రోత్సాహం, తన తల్లితండుల దీవెనలు ఉన్నాయని అన్నారు. ఈ సందర్భంగా రెనే హాస్పిటల్ చైర్మన్ ప్రొఫెసర్ డా. బంగారి స్వామి ప్రత్యేక అభినందలు తెలిపారు.

# ఆప్ నేత కేజ్రీవాల్‌కు ఊరట

- ఢిల్లీ లోధి ఎస్టేట్‌లో టైప్ 7 బంగళా కేటాయింపు



న్యూఢిల్లీ, అక్టోబర్7 (జనంసాక్షి) : ఆప్ జాతీయ కన్వీనర్, దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రివాల్‌కు కేంద్రం ఎట్టకేలకు అధికారిక నివాసం కేటాయించింది. ఇకపై 95, లోధి ఎస్టేట్‌లో టైప్ 7 బంగళాలో ఆయన ఉండనున్నారు. దిల్లీ ఎన్నికల్లో ఓటమి అనంతరం గత ఏడాది అక్టోబరులో ఆయన సీఎం అధికారిక నివాసాన్ని ఖాళీ చేసిన విషయం తెలిసిందే. అయితే.. దిల్లీలో మాజీ ముఖ్యమంత్రులకు ప్రభుత్వ వసతి కేటాయించే నిబంధన లేదు. దీంతో ఆయన ఆప్ రాజ్యసభ ఎంపీ అశోక్ మిత్తల్‌కు కేటాయించిన లుటియన్స్‌లోని ఫిరోజ్‌షా రోడ్డులో ఉన్న 5వ నంబరు బంగళాలో తాత్కాలికంగా ఉంటున్నారు. ఈక్రమంలోనే గుర్తింపుపొందిన జాతీయ పార్టీ అధ్యక్షుడిగా కేజ్రివాల్ కు తగిన నివాసం కేటాయించాలంటూ ఆప్ న్యాయపోరాటం చేసింది. దిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు కేంద్రం నూతన బంగళాను కేటాయించింది. బీఎస్పీ అధినేత్రి మాయావతి గతంలో నివసించిన 35, లోధి ఎస్టేట్‌లోని బంగళాను ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆప్ కోరింది. కానీ, దాన్ని జులైలో కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీకి కేటాయించింది. కేజీవ్రాల్‌కు ఇప్పుడు కొత్తగా కేటాయించిన ఇంట్లో గతంలో భాజపా నేత, జాతీయ మైనారిటీ కమిషన్ మాజీ ఛైర్మన్ ఇక్బాల్ సింగ్ లాల్‌పుర ఉండేవారు.నూతన నివాసాన్ని కేజీవ్రాల్ దంపతులు ఇప్పటికే పరిశీలించినట్లు సమాచారం. పక్కనే ఉన్న 97వ భవనంలో ప్రస్తుతం కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ఉంటున్నారు. ఇదిలాఉండగా.. సీఎంగా ఉన్నప్పుడు సివిల్ లైన్స్ ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డులోని ఆరో నంబరు బంగళాను కేజీవ్రాల్ అధికార నివాసంగా ఉపయోగించేవారు. ఆ సమయంలో దానికి అనేక హంగులు చేసి పునర్నిర్మించారు. ఇందులో ఎంతో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ.. 'శీష్ మహల్ (అద్దాల మేడ)'గా భాజపా విమర్శలు గుప్పించింది. ఎన్నికల్లో ప్రచారాస్త్రంగా మలచుకుంది. ఇప్పుడు ఈ భవనాన్ని ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌గా మార్చాలని దిల్లీ లోని భాజపా ప్రభుత్వం యోచిస్తోంది.

# 60కోట్ల మోసం కేసులో విచారణ

- ముంబై పోలీస్ విచారణకు శిల్పాశెట్టి హాజరు



ముంబై, అక్టోబర్7 (జనంసాక్షి) : ఓ వ్యాపారవేత్తను రూ.60 కోట్ల మేర మోసం చేసిన కేసులో నటి శిల్పాశెట్టి దంపతులు ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ కేసులో తాజాగా శిల్పాశెట్టిని ముంబయి పోలీసులు విచారించారు. 4 గంటల పాటు విచారించిన పోలీసులు ఆమె బ్యాంక్ స్టేట్‌మెంట్ వివరాలు, ఇతర ఖర్చుల గురించి ఆరాతీసినట్లు తెలుస్తోంది. కొన్ని కీలకమైన పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు కథనాలు వస్తున్నాయి. ఈ కేసు విషయంలో శిల్పాశెట్టి భర్త రాజ్‌కుంద్రాను కూడా ఇటీవల పోలీసులు విచారించారు. కొన్ని కంపెనీల్లో రూ.60కోట్లు పెట్టుబడులుగా పెట్టినట్లు ఆ సమయంలో ఆయన వెల్లడించారు. దీంతో ఈ నిధుల్ని నిజంగానే సంబంధిత కంపెనీలకు మళ్లించారా లేదా ఇతర వ్యక్తిగత ఖర్చులకు ఉపయోగించారా అనే దానిపైనా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇందులోభాగంగా శిల్పాను విచారించినట్లు తెలుస్తోంది. ఇక శిల్పా దంపతులు ఇటీవల థాయ్‌లాండ్ పర్యటనకు వెళ్లడానికి అనుమతి కోరుతూ బాంబే హైకోర్టులో పిటిషన్ వేయగా కోర్టు దాన్ని తిరస్కరించింది. ఈ కేసు విషయంలో స్పష్టత వచ్చేవరకూ విదేశాలకు వెళ్లడానికి వీల్లేదని పేర్కొంది.

# భారీగా ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- విదేశాలకు తరలించే క్రమంలో ఢిల్లీ పోలీసుల దాడి



న్యూఢిల్లీ, అక్టోబరు7 (జనంసాక్షి) : దిల్లీలో పోలీసులు భారీగా ఎర్రచందనం నిల్వలను పట్టుకున్నారు. దాదాపు 10 టన్నుల దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.6 కోట్లు వరకూ ఉంటుందని తెలిపారు. చైనాతోపాటు ఇతర దేశాలకు అక్రమంగా ఎగుమతి చేసేందుకుగానూ.. వాటిని తిరుపతి నుంచి దేశ రాజధానికి తరలించినట్లు తెలుస్తోందన్నారు. ఎర్రచందనం దుంగల చోరీకి సంబంధించిన ఓ కేసులో ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఇచ్చిన నిఘా సమాచారం ఆధారంగా ఈ ఆపరేషన్ చేపట్టినట్లు దిల్లీ సౌత్ ఈస్ట్ డీసీపీ హేమంత్ తివారీ వెల్లడించారు. ఎర్రచందనం దుంగల చోరీకి సంబంధించి తిరుపతిలో ఓ కేసు నమోదైంది. అక్కడి పోలీసుల దర్యాప్తులో భాగంగా.. వాటిని దిల్లీకి అక్రమంగా తరలించినట్లు గుర్తించారు. ఈ సమాచారం ఆధారంగా.. దిల్లీ పోలీస్ ఎస్‌టీఎఫ్, ఆంధ్రప్రదేశ్ ఇంటెలిజెన్స్ యూనిట్‌లు కలిసి దిల్లీ తుగ్లకాబాద్‌లోని ఒక గోదాంలో తనిఖీలు చేపట్టాయి. ఎర్రచందనం నిల్వలను స్వాధీనం చేసుకున్నాయి' అని డీసీపీ హేమంత్ తివారీ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఇర్ఫాన్, మహారాష్ట్రకు చెందిన అమిత్ సంపత్ పవార్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితులకు అంతర్జాతీయ ముఠాతో సంబంధాలు ఉన్నాయన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370